సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 130

బుధవారం 31-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

# ట్రిపుల్ తలాక్ ఇక రద్దు

## రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

- బీజేడీ మద్దతుతో పాసయిన బిల్లు
- సభ నుంచి వాకౌట్ చేసిన జేడీయూ, అన్నాడీఎంకే
- వ్యతిరేకంగా ఓటేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



- వివరాలు 5లో

**240** ఖాళీలు పోను రాజ్యసభలో మొత్తం సభ్యులు..

**183** ఓటింగ్‌లో పాల్గొన్న వారి సంఖ్య..

**99** తలాక్ బిల్లుకు అనుకూలం..

**84** బిల్లుకు వ్యతిరేకం..

ఈ రోజు ఇండియా సంతోషిస్తోంది. సమాజంలో లింగ సమానత్వం సాధనలో ఇదో విజయం. బిల్లుకు మద్దతు తెలిపిన ఎంపీలందరికీ ధన్యవాదాలు. – మోదీ



# ఐటీ జోష్

## మూడేళ్ల తర్వాత ఐటీ రంగంలో జోరందుకున్న నియామకాలు

- ప్రతిభావంతుల కోసం భారత్‌కు క్యూ కడుతున్న ఎంఎన్‌సీలు
- పలువురు ఐఐటీ విద్యార్థులకు భారీగా వేతన ఆఫర్లు
- సగటున రూ.కోటి వార్షిక వేతనం ఆఫర్
- గరిష్టంగా రూ.కోటిన్నర ఇవ్వడానికి సై
- నిట్ కాలేజీల్లోనూ కొలువుల కోలాహలం

**40 లక్షలు** హైదరాబాద్ సీబీఐటీ విద్యార్థికి మైక్రోసాఫ్ట్ ఆఫర్

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఐటీలో మళ్లీ జోష్ పెరిగింది. గత మూడేళ్లుగా కొంత స్తబ్దుగా ఉన్న ఐటీ కంపెనీలు తాజాగా నియామకాల జోరు పెంచాయి. నాలుగేళ్ల క్రితం ఐఐటీ విద్యార్థులకు రూ.కోటి అంతకంటే ఎక్కువ వార్షిక వేతనాలు ఆఫర్ చేసిన మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, గోల్డ్‌మెన్‌శాక్స్ వంటి అమెరికన్ కంపెనీలు ప్రతిభావంతుల కోసం మన ఐఐటీల ముందు క్యూ కట్టాయి. సగటున రూ.కోటి వార్షిక వేతనం ఇస్తామని ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థి ప్రతిభను బట్టి గరిష్టంగా రూ.1.40 కోట్లు, కనిష్టంగా రూ.41 లక్షలు ఇస్తామని పేర్కొంటున్నాయి. అలాగే మొదటిసారిగా అమెరికాకు చెందిన అమెరికన్ ఎక్స్‌ప్రెస్, సిటీ గ్రూప్, పేపాల్ వంటి సంస్థలు ఐఐటీ, ఎన్ఐటీ, ప్రముఖ కాలేజీల్లో ప్లేస్‌మెంట్లకు రావడం విశేషం. ఒక్కో విద్యార్థికి ఒకేసారి ఐదారు ఉద్యోగావకాశాలు కూడా వస్తున్నాయి. జూలై మొదటి వారంలో ప్రారంభమైన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జోరు సెప్టెంబర్ చివరి వరకు కొనసాగే అవకాశం ఉంది. ఐఐటీలు, నిట్‌లు మాత్రమే కాకుండా మంచి ర్యాంకింగ్ కలిగి ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ నియామకాల ప్రక్రియ ఊపందుకుంది. గత మూడేళ్లుగా పాక్షిక నియామకాలకు పరిమితమైన ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, విప్రో, టీసీఎస్, క్యాప్ జెమినీ, యాక్సెంచర్ వంటి కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగుల నియామకానికి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నాయి.

**ఐఐటీ వారణాసి విద్యార్థికి 1.52 కోట్లు**

ఈ ఏడాది ఐఐటీ విద్యార్థుల పంట పండింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారణాసి (బీహెచ్‌యూ) విద్యార్థికి ఒక కంపెనీ రూ.1.52 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. ఈ సంస్థ ఇంకా అధికారికంగా విద్యార్థి, కంపెనీ పేరు వెల్లడించలేదు. మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్‌శాక్స్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, జొమాటో, ఫేస్‌బుక్ వంటి కంపెనీలు ఈ ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు ఆఫర్ చేశాయి. ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ఓ విద్యార్థికి అత్యధికంగా (ఇప్పటివరకూ) రూ.1.5 కోట్ల వార్షిక వేతనాన్ని ఓ కంపెనీ ఆఫర్ చేసింది. ఈ ఐఐటీలో ఆదిత్య బిర్లా, అబోడ్, అమెజాన్, క్యాటర్ పిల్లర్, మారుతీ సుజుకీ సంస్థలు విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. ఐఐటీ రూర్కీలోనూ ఓ విద్యార్థికి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కంపెనీ రూ.1.5 కోట్ల వేతనాన్ని ఆఫర్ చేసింది. ఈ ఐఐటీలో గూగుల్, మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్‌శాక్స్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, వాల్‌మార్ట్ సంస్థలు ఉద్యోగాలు ఆఫర్ చేశాయి. ఐఐటీ బాంబేలో విద్యార్థులను నియమించుకోవడానికి 15 కంపెనీలు పోటీ పడ్డాయి. ఇక్కడ ఇప్పటివరకూ

మిగతా 2వ పేజీలో ▶

• గలగలా గోదారి..



మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ గేట్లు ఎత్తడంతో వరద నీరు ఉరకలు

• బిరబిరా కృష్ణమ్మ..

3లో



మంగళవారం నారాయణ్‌పూర్ గేట్లు తెరవడంతో జూరాలకు విడుదలవుతున్న కృష్ణా వరద

# కాఫీ కింగ్ అదృశ్యం



- తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కాఫీ డే అధినేత సిద్ధార్థ మిస్సింగ్
- ఐటీ అధికారులు, పీఈ ఇన్వెస్టర్ వేధించారంటూ లేఖ
- వ్యాపారంలో విఫలమయ్యానని ఆవేదన...
- ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్న కర్ణాటక పోలీసులు.. ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానాలు
- 20 శాతం పైగా కుప్పకూలిన కాఫీ డే షేరు

“ గడిచిన 37 ఏళ్లుగా ఎంతో నిబద్ధతతో కష్టపడి పనిచేస్తూ నేను స్థాపించిన కంపెనీలు, అనుబంధ సంస్థల్లో 30 వేలకు పైగా ఉద్యోగాలను సృష్టించా. అదేవిధంగా నేను అతిపెద్ద వాటాదారుగా ఉన్న మరో టెక్నాలజీ కంపెనీలో కూడా 20 వేల కొలువులను తీసుకొచ్చా. అయితే, నా కష్టమంతా ధారపోసినప్పటికీ.. ఆయా సంస్థలను లాభదాయకమైన వ్యాపార దిగ్గజాలుగా తీర్చిదిద్దడంలో విఫలమయ్యా. నామీద నమ్మకంతో చేదోడుగా నిలిచిన వారందరినీ క్షమించమని కోరుతున్నా

–జూలై 27న ఉద్యోగులకు రాసిన లేఖలో వీజీ సిద్ధార్థ

బిజినెస్‌లో

## రేపట్నుంచి ఇంజనీరింగ్ తరగతులు



- ఏర్పాట్లు చేస్తున్న వర్సిటీలు
- 15 రోజులపాటు ఇండక్షన్ ప్రోగ్రాం
- ఆ తర్వాత రెగ్యులర్ తరగతులు
- ఇంటర్న్‌షిప్‌కే ప్రాధాన్యం

- వివరాలు 2లో

## వచ్చేసింది..

ICC WORLD TEST CHAMPIONSHIP

యాషెస్ సిరీస్‌తో ప్రారంభం కానున్న ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్

–స్పోర్ట్స్‌లో

## 'టిప్పు జయంతి' రద్దు

➤ కర్ణాటకలో అధికారంలోకి వచ్చీ రాగానే యడియూరప్ప ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 18వ శతాబ్దంలో మైసూరు సామ్రాజ్యాన్ని పాలించిన రాజు టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 5లో











# మహా సుదర్శన యాగం

**యాదాద్రిలో త్వరలోనే ఘనంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం**

**యాగం నిర్వహణపై త్రిదండి చినజీయర్ స్వామితో చర్చలు**

సాక్షి, హైదరాబాద్: త్వరలో యాదాద్రిలో మహా సుదర్శన యాగాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. యాగం నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామితో ఆయన చర్చించారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమీపంలోని శ్రీరామనగరంలో ఉన్న

మిగతా 2వ పేజీలో ▶



మంగళవారం త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామితో సీఎం కేసీఆర్

ఇదండీ సంగతి




మీరే సీఎం అయ్యారు!
ఇక అవసరం ఏముంటుంది సార్!!

# కార్పొరేషన్లలో లక్షన్నర, మున్సిపాలిటీల్లో లక్ష

- జీహెచ్‌ఎంసీలో రూ. 5 లక్షలు
- మున్సిపోల్స్ ఎన్నికల ప్రచార వ్యయం ఖరారు చేసిన ఎస్‌ఈసీ

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చును రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఖరారు చేసింది. జీహెచ్‌ఎంసీ, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల ప్రచార ఖర్చును నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు ఈ ప్రచార వ్యయ పరిమితికి సంబంధించి ఇటీవల ఆదేశాలిచ్చింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఒక్కో డివిజన్‌కు పోటీచేసే అభ్యర్థులు రూ.5 లక్షల చొప్పున ప్రచారానికి ఖర్చు చేసుకునే వీలు కల్పించింది. హైదరాబాద్ మినహా ఇతర కార్పొరేషన్లలోని కౌన్సిలర్ స్థానాల్లో పోటీ చేసే వారు లక్షన్నర చొప్పున, మిగతా మున్సిపాలిటీల్లోని వార్డుల్లో బరిలో నిలిచే అభ్యర్థులు రూ.లక్ష చొప్పున ప్రచార వ్యయం కింద ఖర్చు చేసుకోవచ్చు. 2015లో ఉన్న ధరలు, లెక్కలకు అనుగుణంగా మున్సిపల్ అభ్యర్థుల ప్రచార వ్యయాన్ని ఖరారు చేసినట్లు ఎస్‌ఈసీ వెల్లడించింది. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఇచ్చిన హ్యాండ్‌బుక్స్‌లో ప్రచార ఖర్చుకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావించారు. దీంతోపాటు అభ్యర్థులు చేసే ప్రచార వ్యయ పరిమితిని కూడా పరిశీలించే ఏర్పాట్లు ఎస్‌ఈసీ చేపడుతోంది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ప్రచార వ్యయాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి, ఈ ఖర్చుకు సంబంధించిన అంశాలను బేరీజు వేశారు.



# టీఆర్‌ఎస్‌ను ఓడించేది మేమే

- వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- విలేకరులతో ఇష్టాగోష్టిలో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధీమా
- తెలంగాణలో కాంగ్రెస్‌కే సంస్థాగత బలం
- బీజేపీకి రాష్ట్రంలో పట్టు లేదు
- టీఆర్‌ఎస్–బీజేపీది నకిలీ యుద్ధమని మండిపాటు

- వివరాలు 4లో



## బీఎడ్‌లో ప్రవేశాలకు 5న నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో (బీఎడ్) ప్రవేశాల కోసం ఆగస్టు 5న నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మంగళవారం మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రవేశాల కమిటీ సమావేశంలో ప్రవేశాల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఆగస్టు 5న నోటిఫికేషన్ జారీ చేయాలని, 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. 14 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేలా ఏర్పాట్లు చేయనుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 12 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రవేశాల కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీలైతే రూ. 500 చెల్లించాలని నిర్ణయించింది. మరిన్ని వివరాలను http://edcet.tsche. ac.in వెబ్‌సైట్‌లలో పొందవచ్చని తెలిపింది.

## 6న బీపీఈడీ ప్రవేశాల నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ), బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆగస్టు 6న నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రవేశాల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. 6న నోటిఫికేషన్ జారీ చేసి, 13 నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించనుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం రెండు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.800 (ఎస్సీ, ఎస్టీలైతే రూ.500) చెల్లించాలని పేర్కొంది. మరిన్ని వివరాలను http:// pecet.tsche. ac.in వెబ్‌సైట్‌లలో పొందవచ్చని తెలిపింది.

## నేడు ‘మనూ’లో సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్:** మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నుంచి జరగనుంది. విద్యార్థులు ఉదయం 9 నుంచి 10.30 గంటలలోపు గచ్చిబౌలిలోని మనూ పాలిటెక్నిక్ భవనం వద్దకు చేరుకోవాలని అధికారులు కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, సెల్ఫ్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తీసుకుని రావాల్సి ఉంటుందని, ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలననుమనూ ప్రధాన కార్యాలయంతోపాటు లక్నో క్యాంపస్, శ్రీనగర్‌కు సమీపంలోని బుడ్గామ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ విమెన్ క్యాంపస్‌లోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## గ్రూప్‌-2 ఇంటర్వ్యూలకు ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్–2 ఇంటర్వ్యూలకు అర్హులైన ఎస్టీ అభ్యర్థులకు మౌఖిక పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ స్టడీ సర్కిల్ (ఎస్టీ) డైరెక్టర్ వి.సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాక్ ఇంటర్వ్యూలో శిక్షణ పొందుటకు అర్హులైన ఎస్టీ అభ్యర్థుల నుంచి ఈ నెల 30, 31 తేదీల్లో హైదరాబాద్ పీఈటీసీ, బుద్ధభవన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకు మాక్ ఇంటర్వ్యూల నిర్వహణ ఉన్నందున గ్రూప్–2 ఇంటర్వ్యూలకు అర్హత సాధించిన ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ వివరాలను వెంటనే రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు 8522914704, 040–27540104 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## 6, 7 తేదీల్లో ఏపీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటన

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 6, 7 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీని కలిసి రాష్ట్ర సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలను వివరించడంతోపాటు రాష్ట్రానికి ఆర్థిక సాయం చేయాలని కోరనున్నారు. ప్రధానితోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షాలను కలిసి రాష్ట్ర సమస్యలను వారి దృష్టికి తెస్తారు.

## కొత్త టీచర్లకు మరో 15 రోజులు గడువు

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా టీచర్ పోస్టులు పొందిన వారు కొంత మంది వివిధ కారణాలతో విధుల్లో చేరలేదని, వారికి మరో 15 రోజుల గడువు ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి అపాయింట్‌మెంట్ ఆర్డరు పొందిన తేదీ నుంచి 30 రోజుల్లో పోస్టింగ్‌లు వచ్చిన వారంతా విధుల్లో చేరాలని స్పష్టం చేశారు.

## ఎస్‌ఎంసీల పదవీ కాలం పొడిగింపు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని 25 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్‌ఎంసీ) పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31వ తేదీతో ఆ కమిటీల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో 2020 జనవరి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే అంతకంటే ముందుగానే కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తే కొత్త కమిటీలే అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## నేటి నుంచి ఎంసెట్ బైపీసీ ప్రవేశాల కౌన్సెలింగ్

**సాక్షి, హైదరాబాద్:** బీఫార్మసీ, ఫార్మ్‌–డీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం బుధవారం (31వ తేదీ) నుంచి ఎంసెట్ (బైపీసీ) ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. విద్యార్థులు నేటి నుంచి ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకొని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 2 నుంచి 3 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని.. 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని తెలిపారు. వారికి 6వ తేదీన సీట్లు కేటాయిస్తామని వివరించారు.

## 4న బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ అర్హత పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్)లో సివిల్స్ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 4న పరీక్ష నిర్వహిస్తామని డైరెక్టర్ ఎన్. బాలాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 3 దఫాలుగా పరీక్ష ఉంటుందన్నారు. studycircles. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 040–24071178, 6302427521 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 21 మంది వైద్య ప్రొఫెసర్లకు పదోన్నతులు

**సాక్షి, హైదరాబాద్:** వివిధ బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న 21 మంది ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశంలో ఈ మేరకు పదోన్నతుల అర్హుల జాబితాను వెల్లడించింది.

## ‘బీసీ ఓవర్సీస్’కు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద అర్హులైన బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఆగస్టు 1 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనితా రాజేంద్ర సూచించారు. అభ్యర్థుల వయస్సు 35 సంవత్సరాలకు మించరాదని, కుటుంబ వార్షికాదాయం ఐదు లక్షల్లోపు ఉండాలని తెలిపారు. టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీమ్యాట్‌లలో కనీస స్కోరు సాధించాలన్నారు. రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://www. telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రేపటి నుంచి ఇంజనీరింగ్ తరగతులు

- ఏర్పాట్లు చేస్తున్న వర్సిటీలు
- 15 రోజులపాటు ఇండక్షన్ ప్రోగ్రాం
- ఆ తర్వాత రెగ్యులర్ తరగతులు
- ఇంటర్న్‌షిప్‌కే ప్రాధాన్యం



**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభించేందుకు యూనివర్సిటీలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే ఇంజనీరింగ్ మొదటి దశ ప్రవేశాల కౌన్సెలింగ్ ముగిసిపోగా, రెండో దశ సీట్ల కేటాయింపు సోమవారం పూర్తయింది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో 69,544 సీట్లు అందుబాటులో ఉండగా, 49,012 మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. 16,432 సీట్లు మిగిలిపోయాయి. సీట్లు లభించిన వారిలో 37,257 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరగా, 11,755 మంది విద్యార్థులు చేరలేదు. విద్యార్థులు కాలేజీల్లో చేరకుండా, మిగిలిన సీట్లతో మిగిలిన మొత్తం 28,187 సీట్లను ఇటీవల ప్రారంభించిన చివరి దశ కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉంచగా, 12,700 మందికి సీట్లు లభించాయి. వారంతా మంగళ, బుధ వారాల్లో కాలేజీల్లో చేరాలని గడువు విధించింది. చివరి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారిలో మరో 10 వేల మంది విద్యార్థులే కాలేజీల్లో చేరే అవకాశముంది. దీంతో మొత్తంగా కన్వీనర్ కోటాలో 47 వేల మంది విద్యార్థులు కాలేజీల్లో చేరినట్లు అవుతుంది. వారికి ఆగస్టు 1 నుంచి ఆయా కాలేజీల్లో తరగతులను ప్రారంభించేందుకు యూనివర్సిటీలు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు ఉస్మానియా, జేఎన్‌టీయూలు కాలేజీ యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేశాయి. జేఎన్‌టీయూ పరిధిలోని చాలా కాలేజీలు ఆగస్టు 5 నుంచి తరగతులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాయి. ఆయా కాలేజీల్లో ఓరియెంటేషన్ కార్యక్రమాలతో తరగతులను ప్రారంభించనున్నాయి.

**తొలుత బేసిక్ అంశాలు..**

మరోవైపు మొదటి 15 రోజులు సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలు కాకుండా, విద్యార్థులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించి బేసిక్ అంశాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, క్రియేటివ్ ఆర్ట్స్, కల్చర్, మెంటరింగ్, యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్ తదితర అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. వాస్తవానికి మూడు వారాల పాటు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉన్నా.. మొదట 15 రోజుల పాటు ఈ కార్యక్రమాలను చేపట్టి, ఆ తర్వాత మరో వారం తరగతులను సాయంకాల వేళల్లో నిర్వహించేలా యూనివర్సిటీలు ఏర్పాటు చేశాయి.

**పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌కు ఏర్పాట్లు..**

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) జారీ చేసిన ఇంటర్న్‌షిప్ పాలసీ ప్రకారం ఇంజనీరింగ్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అందుకోసం అవసరమైన ఒప్పందాలను ముందుగానే కుదుర్చుకోవాలని కాలేజీలకు వర్సిటీలు ఆదేశాలు జారీ చేయనున్నాయి. ఇంటర్న్‌షిప్ పాలసీలో భాగంగా ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థి కోర్సు పూర్తయ్యే వరకు 600 నుంచి 700 గంటల పాటు ఇంటర్న్‌షిప్/ప్రాజెక్టు చేయాల్సి ఉంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని కాలేజీలకు ఏఐసీటీఈ స్పష్టం చేసింది. మొదటి సంవత్సరంలో రెండో సెమిస్టర్ తర్వాత 3–4 వారాల పాటు కాలేజీ పరిధిలోకి ఇంజనీరింగ్‌కు సంబంధించిన అంశాలపై ఇంటర్న్‌షిప్, రెండో సంవత్సరంలో నాలుగో సెమిస్టర్ పూర్తయ్యాక 4–6 వారాలు ఇండస్ట్రీలో ఇంటర్న్‌షిప్, మూడో సంవత్సరంలో ఆరో సెమిస్టర్ పూర్తయ్యాక 4–6 వారాలు ఇండస్ట్రీలో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. నాలుగో సంవత్సరంలో 8వ సెమిస్టర్‌లో 3–4 వారాలు ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలి. ఇందుకు అనుగుణంగా కాలేజీలు ఏర్పాట్లు చేయాలని జేఎన్‌టీయూకు చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

# ఐటీ జోష్

▶ మొదటి పేజీ తరువాయి

ఒక విద్యార్థికి గరిష్టంగా రూ.140 కోట్ల ఆఫర్ లభించింది. మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్‌శాక్స్, మెకెన్సీ నాలెడ్జ్ సెంటర్, టాటా స్టీల్, ఈసీ జపాన్, ఐబీఎం, ఉబర్ వంటి సంస్థలు ఇందులోని విద్యార్థులను ఎంచుకున్నాయి.

**నిట్ విద్యార్థులకూ భారీ ఆఫర్లు**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన (నిట్, న్యూఢిల్లీ) విద్యార్థికి ఓ కంపెనీ రూ.1.24 కోట్ల మేర వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. ఈ సంస్థలోని విద్యార్థులను నియమించుకోవడానికి మెకెన్సీ అండ్ కంపెనీ, జబాంగ్.కామ్, ఆర్ఐఎల్, జనరల్ మోటార్స్, ఈబే, సిటీ గ్రూప్ పోటీ పడ్డాయి. దక్షిణాది నిట్‌లలో అగ్రస్థానంలో ఉండే తిరుచిరాపల్లి నిట్ విద్యార్థికి రూ.89.5 లక్షల వార్షిక వేతనం ఆఫర్ లభించింది. తోషిబా, ఫ్లిప్‌కార్ట్, టాటా మోటార్స్, ఎర్నెస్ట్ అండ్ ఎంగ్ వంటి కంపెనీలు ఇక్కడ పోటీ పడ్డాయి. ఇక మోతీలాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్, అలహాబాద్) విద్యార్థుల్లో దాదాపు 55 మందికి రూ.25.5 లక్షల వార్షిక వేతనం లభించింది. ఇక్కడ విద్యార్థులను నియమించుకోవడానికి ఎల్ అండ్ టీ, ఏబీబీ లిమిటెడ్, హీరో మోటార్స్, బ్లూస్టార్ సంస్థలు ఉత్సాహం కనబరిచాయి. సూరత్‌కల్‌లోనూ దాదాపు 100 మంది విద్యార్థులకు రూ.29.15 లక్షల మేర వార్షిక వేతనాన్ని కంపెనీలు ఆఫర్ చేశాయి.

**హైదరాబాద్‌లో 5వేల మందికి అవకాశాలు**

ఈ ఏడాది హైదరాబాద్‌లో దాదాపు 5వేల మంది విద్యార్థులకు క్యాంపస్ నియామకాలు, జాబ్ మేళాల ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయని నాస్కామ్ (దక్షిణ భారత) డైరెక్టర్ ఒకరు వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా అనేక బహుళజాతి కంపెనీలు ద్వితీయ శ్రేణి ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ నియామకాల ప్రక్రియ చేపడుతున్నాయని ఆయన వెల్లడించారు. సీబీఐటీ హైదరాబాద్ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ రూ.41 లక్షల వార్షిక వేతనం ఆఫర్ చేసింది. జేపీ మోర్గాన్ చేజ్ కంపెనీ ఈ కాలేజీలో 40 మందికి పైగా విద్యార్థులకు భారీ వేతనాలను ఆఫర్ చేసింది. ఈ ఏడాది పెద్ద ఎత్తున కంపెనీలు రానున్నాయని, విద్యార్థులకు భారీ ఎత్తున అవకాశాలు ఉంటాయని, కంపెనీల నుంచి నియామక తేదీలు కావాలంటూ లేఖలు వస్తున్నా యని సీబీఐటీ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్ఎల్ఎన్ రెడ్డి తెలిపారు. గత మూడు నాలుగేళ్లుగా టాప్ టెన్ కాలేజీల్లో నియామకాలకు మాత్రమే పరిమితమైన ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్, విప్రో, యాక్సెంచర్ వంటి కంపెనీలు ఈ ఏడాది ద్వితీయ శ్రేణి కాలేజీల్లో నియామకాలకు ప్లాన్ చేసుకుంటున్నాయి.

**ఏ విద్యాసంస్థలో ఎంత ఆఫర్?**

| విద్యా సంస్థ | కంపెనీలు | అత్యధిక ఆఫర్ |
|---|---|---|
| ఐఐటీ వారణాసి | ఫ్లిప్‌కార్ట్, మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్‌శాక్స్ | 1.52 కోట్లు |
| ఐఐటీ ఢిల్లీ | మైక్రోసాఫ్ట్, ఉబర్, అమెజాన్, ఫేస్‌బుక్ | 1.4 కోట్లు |
| ఐఐటీ కాన్పూర్ | అమెజాన్, ఆదిత్య బిర్లా, కాగ్నిజెంట్, మారుతి సుజుకీ | 1.5 కోట్లు |
| ఐఐటీ బాంబే | మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్‌శాక్స్, టాటా స్టీల్, ఉబర్ | 1.40 కోట్లు |
| ఐఐటీ రూర్కీ | గూగుల్, మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మెన్ శాక్స్, సిటీ బ్యాంక్ | 1.40కోట్లు |
| ఎన్ఐటీ, ఢిల్లీ | మెకెన్సీ, జాబంగ్, పేటీఎం | 1.24 కోట్లు |
| ఐఐటీ ఖరగ్‌పూర్ | స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, ఇంటెల్. అబోడ్ | 1.0 కోటి |
| ఐఐటీ చెన్నై | హెచ్ఎస్‌బీసీ, హెచ్‌సీఎల్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ | 95.8 లక్షలు |
| ఎన్ఐటీ తిరుచురాపల్లి | టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, సిస్కో, ఒరాకిల్ | 89.5 లక్షలు |
| సీబీఐటీ హైదరాబాద్ | మైక్రోసాఫ్ట్. జేపీ మోర్గాన్ | 41 లక్షలు |
| వీఐటీ | పేపాల్, డీఈషా | 39.5 లక్షలు |
| ఐఐటీ గువాహటి | అమెరికన్ ఎక్స్‌ప్రెస్, మైక్రోసాఫ్ట్ | 37 లక్షలు |
| ఎంఐటీ అలహాబాద్ | సిటీ గ్రూప్, ఎల్ అండ్ టీ | 35.5 లక్షలు |
| ఎన్ఐటీ సూరత్‌కల్ | హెచ్ఎస్‌బీసీ, బ్లూస్టార్ | 29.15 లక్షలు |
| బిట్స్ పిలానీ | కేపీఎంజీ, యాక్సెంచర్ | 17.35 లక్షలు |



## దీనికి భయం మొదలైతే.. మనకు బ్యాడ్‌టైమ్ మొదలైనట్లే!!

చూడ్డానికి కలర్‌ఫుల్‌గా.. కాసింత కామెడీగా కనిపిస్తోంది కానీ.. ఇది ఖతర్నాక్ టైపు.. మన సినిమాల్లో కామెడీ విలన్లుంటారే.. పక్షుల్లో ఇది ఆ టైపన్నమాట.. పేరు కాసొవెరీ.. ఇంతకీ విలన్ అని ఎందుకు అన్నామంటే.. ఈమధ్యే ఓ మనిషిని ఇది ఫసాక్ చేసేసింది.. నమ్మడం లేదా.. దాని కాళ్ల వైపు ఓ లుక్కేసుకోండి.. చూశారుగా.. పిక్కలు ఎంత బలంగా ఉన్నాయో.. ఆ గోర్లు మినీ కత్తుల్లాగే.. అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ వ్యక్తిని గాడిదలాగ కాళ్లతో ఎగిరెగిరి తన్నడంతో అతడు ఆస్పత్రిలో కన్నుమూశాడు.. అందుకే వీటిని ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర పక్షుల్లో ఒకటిగా పిలుస్తారు. వీటిని పెంపుడు జంతువులుగా ఉంచుకోవాలంటే ప్రత్యేకమైన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దాని యజమానులు కొన్ని పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. అప్పుడే అధికారులు అనుమతిస్తారు. ఎగిరెగిరి తన్నింది కానీ.. నిజానికి ఇది ఎగరలేదు.. ఈమూ పక్షి టైపు. 6 అడుగుల 6 అంగుళాల ఎత్తు వరకూ పెరుగుతుంది. 60 కిలోల బరువుంటుంది. ఇండోనేసియా, నార్త్ ఈస్ట్ ఆస్ట్రేలియాతోపాటు ఆసియాలోని పలు దేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. తనకేదైనా ముప్పు ఉందని భావిస్తేనే.. అది దాడి చేస్తుందట. అంటే.. దానికి భయం మొదలైందంటే.. మనకి బ్యాడ్‌టైమ్ మొదలైనట్లే!





# మహా సుదర్శన యాగం

▶ మొదటి పేజీ తరువాయి

చినజీయర్ స్వామి ఆశ్రమాన్ని కేసీఆర్ మంగళవారం సందర్శించారు. స్వామి సీఎంను ఆశీర్వదించి జ్ఞాపికను, మంగళశాసనాలు అందజేశారు. ఈ సందర్భంగా యాగంపై ఇరువురూ చర్చించారు. వంద ఎకరాల యజ్ఞ వాటికలో 1048 యజ్ఞ కుండాలతో ఈ యాగంనిర్వహించాలని నిర్ణయించారు. 3వేల మంది రుత్విక్కులు, మరో 3వేల మంది సహాయకులతో మహా యాగాన్ని గొప్పగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కేవలం భారతదేశంలోనివి మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైష్ణవ పీఠాలతోపాటు బద్రీనాథ్, శ్రీరంగం, జగన్నాథ్, తిరుపతి వంటి మహాక్షేత్రాల నుంచి మతాధిపతులను, కేంద్ర ప్రభుత్వ పెద్దలను, అన్ని రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లు, మంత్రులను, అన్ని మతాలకు చెందిన గురువులను ఈ యాగానికి ఆహ్వానించాలని భేటీలో నిర్ణయించారు. కేసీఆర్ వెంట ఎంపీ సంతోష్‌కుమార్, మై హోం గ్రూప్ అధినేతలు జూపల్లి రామేశ్వర్‌రావు, జూపల్లి జగపతిరావు ఉన్నారు. జీయర్‌స్వామితో సీఎం కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడారు. అనంతరం కేసీఆర్ జూపల్లి బాలమ్మ మెమోరియల్ గార్డెన్‌లోని రామేశ్వర్‌రావు ఫాంహౌజ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడ ఉండి తిరుగు పయనమయ్యారు.

## ‘ఇలాంటి పుస్తకాలతో సమాజానికి మేలు’

**సాక్షి, హైదరాబాద్:** సెల్ఫీ ఆఫ్ సక్సెస్ లాంటి పుస్తకాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ప్రశంసించారు. ఈ పుస్తక రచయిత, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశాన్ని తాడూరి శ్రీనివాస్, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ సీఈఓ అలోక్‌కుమార్ మంగళవారం శాలువాతో సత్కరించారు. తక్కువ సమయంలో ఈ బుక్ రికార్డుస్థాయిలో అమ్ముడుపోవడం అభినందనీయమని తాడూరి కితాబిచ్చారు.

## గవర్నర్ విశ్వభూషణ్‌తో ఏపీ సీఎం జగన్ భేటీ

**సాక్షి, అమరావతి:** గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. శాసన సభ బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన వెంటనే సీఎం వైఎస్ జగన్ వెలగపూడి నుంచి నేరుగా విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4.00 గంటల నుంచి సుమారు గంటపాటు గవర్నర్‌తో సీఎం సమావేశమయ్యారు. హరిచందన్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆయనను జగన్ కలుసుకోవడం ఇదే తొలి సారి. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలు, అందులో ప్రజా సంక్షేమ పథకాలకు చేసిన కేటాయింపులు, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై వైఎస్ జగన్.. గవర్నర్‌కు వివరించారని సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్ జగన్ ఆగస్టు 1 నుంచి 4 వరకూ కుటుంబ సమేతంగా జెరూసలేం పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 3న గవర్నర్ జన్మదినం. ఈ నేపథ్యంలో తాను విదేశీ పర్యటనకు వెళ్తున్నందున గవర్నర్‌కు జగన్ ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ముఖేశ్‌గౌడ్‌కు కన్నీటి వీడ్కోలు

- గాంధీభవన్‌లో పార్థివ దేహానికి కాంగ్రెస్ శ్రేణుల నివాళి
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో భారీగా పాల్గొన్న అభిమానులు, నేతలు
- సహచరుడి మృతి కలచివేసింది: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్



ముఖేశ్‌గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దామోదర రాజనర్సింహ తదితరులు.

**సాక్షి, హైదరాబాద్:** మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ కన్నీటి వీడ్కోలు పలికింది. మంగళవారం మధ్యాహ్నం గాంధీభవన్‌కు ఆయన పార్థివ దేహాన్ని తీసుకువచ్చి పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. భౌతిక కాయంపై పార్టీ జెండా కప్పి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్, ఈరవత్రి అనిల్, వినోద్‌రెడ్డి, బొల్లు కిషన్, ఇందిరా శోభన్, కుమార్‌రావు తదితరులు ఆయనకు నివాళుర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖేశ్ పార్థివదేహాన్ని ప్రత్యేక వాహనంలో రాయదుర్గం గౌడ్స్ శ్మశాన వాటికకు తీసుకెళ్లారు.

**అండగా సిటీ నేతలు**

ముఖేశ్‌గౌడ్ మరణవార్త విన్న దగ్గర నుంచి పార్టీలకతీతంగా నగర నేతలు ఆయన కుటుంబాన్ని వెన్నంటే ఉన్నారు. బంజారాహిల్స్‌లోని నివాసంతో పాటు జాంబాగ్‌లోని ఆయన నివాసం వద్దా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నీ తానై నడిపించారు. శ్రీనివాసయాదవ్ కుమారుడు సాయి యాదవ్‌తో పాటు టీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు కూడా అంతిమయాత్రలో పాల్గొన్నారు. అయితే, బంజారాహిల్స్ నివాసం నుంచి నేరుగా గాంధీభవన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి జాంబాగ్‌లోని నివాసానికి పార్థివదేహాన్ని తీసుకెళ్లాల్సి ఉండగా, జాంబాగ్ నివాసం వద్ద సందర్శకులు భారీగా ఉండడంతో ముందుగా అక్కడికి తీసుకెళ్లి ఆ తర్వాత గాంధీభవన్‌కు తీసుకొచ్చారు. గాంధీభవన్ నుంచి ప్రత్యేక వాహనంలోకి ముఖేశ్ భౌతికకాయాన్ని తీసుకెళుతున్న సమయంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తనయుడు అనిల్‌కుమార్ యాదవ్ పాడె మోశారు. ముఖేశ్ తనయుడు, టీపీసీసీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్‌కు తోడుగా పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు, ముఖేశ్ అభిమానులు తరలిరాగా జనసందోహం మధ్య గాంధీభవన్ నుంచి ఆయన అంతిమయాత్ర సాగింది.

**చితికి నిప్పంటించిన కుమారుడు విక్రమ్‌గౌడ్**

ముఖేశ్‌గౌడ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య రాయదుర్గం గౌడ్స్ శ్మశాన వాటికలో నిర్వహించారు. కుమారుడు విక్రమ్‌గౌడ్ చితికి నిప్పంటించారు. నగరం నుంచి ముఖేష్‌గౌడ్ అంతిమయాత్ర ప్రత్యేక వాహనం మధ్యాహ్నం 2.20 గంటలకు రాయదుర్గం కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానికులు ముఖేష్ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. రాయదుర్గంకే చెందిన ముఖేశ్‌గౌడ్ నగరంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నప్పటికీ తన సొంతూరుతో ఉన్న అనుబంధంతో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో తెలంగాణ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, పార్లమెంటు సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ పార్లమెంటు సభ్యులు టి.దేవేందర్‌గౌడ్, వి.హనుమంతరావు, పొన్నం ప్రభాకర్, మధుయాస్కీ గౌడ్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ్మ, మాజీ మంత్రులు గీతారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంతోషకుమార్, కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆవుల సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్ యాదవ్, పెద్ద సంఖ్యలో కుటుంబసభ్యులు, రాయదుర్గం వాసులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అండగా ఉంటుంది: ఉత్తమ్**

ముఖేశ్ పార్థివదేహం గాంధీభవన్ నుంచి బయలుదేరిన అనంతరం పార్టీ నేతలతో కలిసి టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. తమతో కలిసి సుదీర్ఘ కాలం పనిచేసిన పార్టీ సభ్యుడు మరణించడం తీవ్ర బాధ కలిగించిందన్నారు. ఆయన మరణం పట్ల టీపీసీసీ విచారం వ్యక్తం చేస్తోందని, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రజల పక్షాన పార్టీలో మాట్లాడే చొరవ ముఖేశ్‌కుండేదని అన్నారు. ఆయన చొరవతోనే వరంగల్‌లో బీసీల గర్జన కార్యక్రమం జరిగిందని, తన సహచరుడి మృతి కలచివేసిందని చెప్పారు.

## పాఠశాలల అభివృద్ధికి విరాళాల సేకరణ

### అందుబాటులోకి వెబ్‌పోర్టల్

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు విరాళాలు అందజేసేందుకు విద్యాశాఖ ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌పోర్టల్ http://csredu. telangana. gov.inను విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. యాస్కీలో జరిగిన కార్యక్రమంలో ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చే వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమలు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

## కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

**శ్రీనగర్:** జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అనంతనాగ్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మంగళవారం ఎదురుకాల్పులు జరిగాయి. మరణించిన వారిలో జైషే మొహమ్మద్‌కు చెందిన కమాండర్ కూడా ఉన్నాడు. పుల్వామా ఉగ్రదాడిలో ఇతడిని సహ సూత్రధారిగా పోలీసులు భావిస్తున్నారు. పంజూ అలియాస్ ఫయాజ్ అహ్మద్ తోకర్ అలియాస్ హంజుల్లా బైగా అతన్ని గుర్తించారు. జూన్ 12న అనంతనాగ్‌లో సీఆర్‌పీఎఫ్ దళాలపై దాడి చేసి అయిదుగురిని చంపిన ఘటనలో కూడా ఇతడే ప్రధాన సూత్రధారి. కశ్మీర్‌లో ఉంటూ విదేశీ ఉగ్రవాదులకు సహాయం చేస్తున్నాడని, స్థానికంగా యువతను ఉగ్రవాదంలో చేరుస్తున్నాడని పోలీసులు తెలిపారు. మరణించిన మరో ఉగ్రవాదిని షాను షౌకెత్‌గా గుర్తించారు.

# 'కాళేశ్వరం'లో రివర్స్ పంపింగ్‌కు బ్రేక్

## పరీవాహకంలో వర్షాలతో ఎల్లంపల్లికి భారీగా వరద

- 20 టీఎంసీలకుగాను 7 టీఎంసీలకు చేరిన నిల్వ
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లలో మోటార్ల నిలిపివేత
- విద్యుత్ చార్జీల వృథా నివారణ కోసం అధికారుల నిర్ణయం
- మిడ్‌మానేరుకు నీటి తరలింపుపై దృష్టి పెట్టాలని సీఎం ఆదేశం
- ప్యాకేజీ–7 టన్నెల్ పనుల పూర్తికి సూచన
- టన్నెల్ పరిధిలో పర్యటించిన స్మితా సబర్వాల్, ఈఎన్‌సీ
- ఆగస్టు 5న ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు.. సీఎం హాజరయ్యే అవకాశం



నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు నీటి పరవళ్లు

**సాక్షి, హైదరాబాద్, కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టు మూడు పంప్‌హౌస్‌లలోని మోటార్లను తాత్కాలికంగా నిలిపివేశారు. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎల్లంపల్లికి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో మేడిగడ్డ నుంచి రివర్స్ పంపింగ్ ప్రక్రియను ఆపారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతోనే ఎల్లంపల్లి నిండే అవకాశాలుండటం రివర్స్ పంపింగ్ ద్వారా గోదావరి నీటిని మోటార్ల ద్వారా ఎల్లంపల్లికి ఎత్తిపోస్తే కరెంట్ చార్జీలు వృథా అయ్యే అవకాశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాజెక్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఎల్లంపల్లిలో చేరుతున్న నీటిని కాళేశ్వరంలోని మూడు ప్యాకేజీల ద్వారా మిడ్‌మానేరుకు తరలించే అవకాశాలపై దృష్టి పెట్టాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో ఆ దిశగా ఇంజనీర్లు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ప్యాకేజీ–7లోని టన్నెల్ పనులను పూర్తి చేసే కసరత్తు చేపట్టనున్నారు.

**వరద పెరిగింది..**

గత 25 రోజులుగా ప్రాణహిత నదికి 8 వేల క్యూసెక్కుల నుంచి 13 వేల క్యూసెక్కుల మేర మాత్రమే వరద ప్రవాహాలు కొనసాగాయి. వచ్చిన కొద్దిపాటి వరదకే అడ్డుకట్ట వేసి మేడిగడ్డ నుంచి నీటిని పంపింగ్ చేశారు. మంగళవారం వరకు మేడిగడ్డ పంప్‌హౌస్ నుంచి 1,500 గంటలపాటు మోటార్లను నడిపి 12 టీఎంసీలను ఎత్తిపోశారు. అన్నారం చేరిన నీటిలో 6 టీఎంసీలను నిల్వ చేశారు. సుందిళ్ల నుంచి నీటిని ఎల్లంపల్లికి ఎత్తిపోసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి ఫోర్ బేలోకి నీటిని పంపి సుందిళ్ల పంప్‌హౌస్‌లో మోటార్ల ద్వారా మంగళవారం నుంచి నీటిని ఎత్తిపోయాలని భావించారు. దీనికి అనుగుణంగా సుందిళ్లలో నాలుగు మోటార్లను సిద్ధం చేశారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరీవాహకం నుంచి కడెం, ఎల్లంపల్లిలోకి ప్రవాహాలు పెరిగాయి. కడెంలోకి మంగళవారం ఉదయం 60 వేల క్యూసెక్కుల ప్రవాహం రావడంతో 6 గేట్లు ఎత్తి 52 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో ఎల్లంపల్లిలోకి 30 వేల క్యూసెక్కుల మేర ప్రవాహాలు రాగా సాయంత్రానికి అవి 18 వేల క్యూసెక్కులకు తగ్గాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ 20 టీఎంసీలకుగాను 7 టీఎంసీలకు చేరింది. ఎగువ కడెంలోకి స్థిరంగా 29,810 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తుండటం, మరో 4 రోజులపాటు వర్షాలు కురిసే అవకాశాల నేపథ్యంలో ఎల్లంపల్లిలోకి మరో 3–4 రోజులు స్థిరంగా ప్రవాహాలు కొనసాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లిలో నిల్వలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌ల మోటార్లను పూర్తిగా నిలిపివేశారు. సుందిళ్లలోని ఒక పంప్‌హౌస్‌ను మంగళవారం సాయంత్రం కాసేపు నడిపి ఆపేశారు. ఎల్లంపల్లికి వరద నేపథ్యంలో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని పంపినా ఫలితం ఉండదు. ఒకవేళ ఎల్లంపల్లికి నీటిని తరలించినా అక్కడి నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపు ప్రక్రియ సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతం ఎల్లంపల్లి దిగువన ప్యాకేజీ–7 పనులు ఇంకా పూర్తికానందున ఈ ప్రక్రియ మొదలు కాలేదు. దీంతో మోటార్లను నిలిపివేశారు. మోటార్లు ఆపేసిన అనంతరం ప్రాణహిత నదిలోనూ వరద ఉధృతి పెరిగింది.

**వచ్చే నెల 5 నుంచి ఎల్లంపల్లి ఎత్తిపోతలు..**

ఎల్లంపల్లికి వరద ప్రవాహాలు మొదలవడం, ఒకవేళ ప్రవాహాలు ఆగినా సుందిళ్ల నుంచి నీటిని తరలించే వ్యవస్థ సిద్ధంగా ఉండటంతో ఈ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపు చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఎల్లంపల్లి దిగువన ప్యాకేజీ–6లో 7 మోటార్లకు 5 మోటార్లు సిద్ధంగా ఉండగా ఐదో మోటార్ వెట్ రన్ మంగళవారం విజయవంతమైంది. ఇక ప్యాకేజీ–7 టన్నెల్‌లో సివిల్ పనులన్నీ బుధ, గురువారాల్లో పూర్తి కానున్నాయి. పనులు పూర్తయితే అక్కడ క్లీనింగ్ ప్రక్రియ మొదలవుతుంది. దీనికి 4–5 రోజులు పట్టనుంది. ఈ పనులను మంగళవారం సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, ఈఎన్‌సీ మురళీధర్ పరిశీలించారు. ఎల్లంపల్లి నుంచి వచ్చే నెల 5న ఎత్తిపోతలు ప్రారంభించాలని, ఇందుకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్యాకేజీ–8లోని 7 మోటార్లకు 6 మోటార్లు సిద్ధంగా ఉండగా వాటిలో 5 మోటార్ల డ్రైరన్ పూర్తయింది. ఎల్లంపల్లి నుంచి ఈ మూడు ప్యాకేజీల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించనున్నారు. వచ్చే నెల 5న ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉందని నీటిపారుదల వర్గాలు తెలిపాయి.



కాళేశ్వరంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రవహిస్తున్న నీరు

### ప్రాణహితకు భారీ వరద

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నదికి వరద పోటెత్తింది. ఆ నీరంతా గడ్చిరోలి జిల్లా సిరొంచ మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తోంది. దీంతో మంగళవారం సాయంత్రం వరకు కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 8 మీటర్లకు చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి ప్రాణహిత వరద పెరగడంతో మంగళవారం ఉదయం 30 గేట్లు పైకి ఎత్తారు. దీంతో బ్యారేజీ వద్ద 4.10 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో తరలిపోతోంది. కాళేశ్వరం నుంచి వరద రూపంలో వచ్చే వరద ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కుల వరకు ఉందని అధికారులు తెలిపారు. వరద ఉధృతి పెరిగితే బ్యారేజీలోని మరిన్ని గేట్లను ఎత్తేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. బ్యారేజీలో ఆది, సోమవారాల్లో నీటి నిల్వ 4.5 టీఎంసీలు ఉండగా మంగళవారం అది 7 టీఎంసీలకు పెరిగింది. బ్యారేజీ పూర్తిస్థాయి సామర్థ్యం 16.17 టీఎంసీలు.

రామగుండం మండలంలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలను కలిపే వంతెన వద్ద నిండుగా గోదారమ్మ





ఎల్లంపల్లి దిగువన ప్యాకేజీ-6లో ఐదో మోటార్‌కు కొనసాగుతున్న వెట్‌రన్

# రేపు శ్రీశైలానికి కృష్ణా జలాలు

- జూరాలకు లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో
- ఎగువ నారాయణపూర్, ఆల్మట్టిలోనూ పెరిగిన ఉధృతి

**సాక్షి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్/గద్వాల టౌన్:** ఎగువ కర్ణాటక ప్రాజెక్టుల నుంచి భారీగా కృష్ణా నదీ జలాలు దిగువకు వస్తుండటంతో జూరాల నిండుకుండలా మారింది. ప్రాజెక్టులోకి ఏకంగా ఎగువ నుంచి లక్ష క్యూసెక్కులకుపైగా వరద వచ్చి చేరుతుండటంతో సాయంత్రం ఏడు గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వ 9.66 టీఎంసీలకుగాను 5.5 టీఎంసీలకు చేరింది. ఎగువ ఆల్మట్టిలోకి 2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో అంతే నీటిని దిగువ నారాయణపూర్‌కు వదులుతున్నారు. నారాయణపూర్ సైతం ఇప్పటికే నిండటంతో 20 గేట్లు ఎత్తి 1.90 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ జూరాలకు వదులుతున్నారు. ఈ నీరంతా జూరాలకు చేరి నిల్వ పెరగడంతో జూరాల నుంచి నీటి విడుదల మొదలైంది. నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 1,300 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ ద్వారా 315 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తుండగా కుడి, ఎడమ కాల్వలకు 900 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. దీంతోపాటు జూరాల విద్యుదుత్పత్తి ద్వారా 21 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో ఆ నీరంతా శ్రీశైలం దిశగా పరుగులు తీస్తోంది. వరద ఉధృతినిబట్టి జూరాల గేట్లు ఎత్తి దిగువకు మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. జూరాల నుంచి విడుదలైన జలాలు గురువారం ఉదయానికి శ్రీశైలం చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో 215 టీఎంసీలకుగాను 31 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వ ఉంది. అలాగే 885 అడుగుల నీటిమట్టానికిగాను 804 అడుగుల మట్టంలో నిల్వ ఉంది. ఇక్కడ నీటి నిల్వ 854 అడుగులకు చేరిన వెంటనే తెలంగాణ, ఏపీ నీటి వినియోగం మొదలు పెట్టనున్నాయి. ఇప్పటికే కల్వకుర్తి ద్వారా నీటి ఎత్తిపోతలకు పంపులు సిద్ధం చేసుకోవాలని సీఎం కేసీఆర్ ఇంజనీర్లను ఆదేశించారు.



మంగళవారం నిండు కుండలా జూరాల ప్రాజెక్టు

### 10 రోజులు ఆలస్యంగా జలవిద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

గతేడాదితో పోలిస్తే జూరాల జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి 10 రోజులు ఆలస్యంగా ప్రారంభమైంది. గతేడాది జూలై 19న విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాగా ఈ ఏడాది జూరాలకు కొంత ఆలస్యంగా వరద రావడంతో మంగళవారం ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రం ద్వారా ఆరు యూనిట్లు ప్రారంభించి 234 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. గతేడాది ఎగువ జూరాలలో 200 మిలియన్ యూనిట్లు, లోయర్ జూరాలలో 210 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని సీఈ సురేశ్ తెలిపారు. ఎగువ జూరాల జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని డైరెక్టర్ వెంకటరాజం, సీఈ సురేశ్ కుమార్, ఎస్‌ఈలు మంగేశ్‌కుమార్, శ్రీధర్‌లు మంగళవారం పరిశీలించారు.

# కుమురంభీం జిల్లాలో కుండపోత

- రవీంద్రానగర్‌లో అత్యధికంగా 26 సెం.మీ. వర్షపాతం
- బెజ్జూరులో 22 సెం.మీ., సిర్పూరులో 17 సెం.మీ
- నేడు పలు చోట్ల భారీ వర్షాలు
- రేపటి నుంచి మోస్తరు వర్షాలు



**సాక్షి, హైదరాబాద్:** కుమురంభీం–ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. ఈ సీజన్‌లో ఎన్నడూ లేనంతగా ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో ఆ జిల్లాలోని చింతలమానేపల్లి మండలం రవీంద్రానగర్‌లో అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాస్తవంగా సోమవారం రాత్రి వరకు అక్కడ 20 సెంటీమీటర్లు నమోదు కాగా, మంగళవారం ఉదయం 6 గంటల వరకు అది 26 సెంటీమీటర్లకు చేరింది. అలాగే బెజ్జూరులో సోమవారం రాత్రి వరకు 17 సెంటీమీటర్లు నమోదు కాగా, మంగళవారం ఉదయానికి 22 సెంటీమీటర్లకు చేరింది. సిర్పూరులో సోమవారం రాత్రి వరకు 9 సెంటీమీటర్లు నమోదు కాగా, మంగళవారం ఉదయానికి 17 సెంటీమీటర్లకు చేరుకుంది. ఆదిలాబాద్ జిల్లా జైనాడ్ మండలం భోరాజ్‌లో 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తామ్సి, జిన్నేదారి, జైనాడ్, కాగజ్‌నగర్‌లలో 11 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ గణనీయమైన వర్షపాతం నమోదైంది. ఇదిలా వుండగా తూర్పు మధ్యప్రదేశ్ దానిని ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో మంగళవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది ఎత్తుకి వెళ్లే కొద్దీ దక్షిణ దిశ వైపుకి వంపు తిరిగి ఉంది. అలాగే దక్షిణ గుజరాత్ దానిని ఆనుకుని ఉన్న ఉత్తర మహారాష్ట్ర నుంచి ఇంటీరియర్ ఒడిశా వరకు తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.

### 4న మరో అల్పపీడనం..

ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఆగస్టు 4న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. వాటి ప్రభావాలతో బుధవారం పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఆయన తెలిపారు. గురువారం నుంచి చాలా చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వివరించారు. మరోవైపు వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రమంతటా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. కొన్నిచోట్ల పగటి, రాత్రి ఉష్ణోగ్రతలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడం గమనార్హం.

# వారం రోజులకే ఎల్‌సీ..!

- విద్యుత్ కొనుగోళ్లకు బ్యాంకుల్లో ఎల్‌సీలను ఓపెన్ చేసిన ట్రాన్స్‌కో
- కేంద్ర కొత్త విధానానికి అనుగుణంగా ముందుకు..
- ఎన్ని సార్లు నిధులు కోరినా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ కొనుగోళ్లకు ఆగస్టు 1వ తేదీ నుంచి కేంద్రం ప్రతిపాదించిన కొత్త విధానానికి అనుగుణంగా ముందుకెళ్లాలని తెలంగాణ విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి. నిధుల లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో తొలిదశలో వారం రోజులకు సరిపడా కరెంట్ కొనుగోలు చేయడానికి అవసరమైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సీ)ని పలు బ్యాంకుల్లో మంగళవారం ఓపెన్ చేశాయి. బుధవారం వాటిని జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్‌లో సమర్పించనున్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్‌ఆర్‌పీసీ) సమావేశంలో కూడా వారం రోజులకే ఎల్‌సీలు ఓపెన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర కొత్త విధానానికి అనుగుణంగా ముందుకెళ్లాల్సిందేనని రాష్ట్రాలన్నీ నిర్ణయం తీసుకున్నాయి. దీనికి అనుగుణంగానే తెలంగాణ నడుచుకోనుంది. నిధులపై రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడంతో స్వతహాగా ఉన్న పరపతితో వారం రోజులకు సరిపడా నిధుల లభ్యతే ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నిజానికి నెలరోజులుగా నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని పదేపదే డిస్కమ్‌లు కోరుతున్నాయి. అయితే నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం విముఖత చూపింది. రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌లే ఎస్పీడీసీఎల్ (హైదరాబాద్), ఎస్పీడీసీఎల్ (వరంగల్) ఏటా రూ.23,473 కోట్ల దాకా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు పెడుతున్నాయి. ఇందులో జెన్‌కో వాటా రూ.8,478 కోట్లు కాగా, సింగరేణి వాటా రూ.2,780 కోట్ల దాకా ఉంటుంది. ఇవిపోనూ రూ.12 వేల కోట్ల దాకా ఏటా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ లెక్కల ప్రకారం నెలకు సరిపడా కరెంట్ ఎన్టీపీసీ, ఛత్తీస్‌గఢ్, సెమ్‌కార్ప్, సంప్రదాయేతర ఇంధన వనరుల నుంచి కొనుగోలు చేయాలంటే దాదాపు రూ.1,017 కోట్లు అవసరమైన ఎల్‌సీని బ్యాంకులో ఓపెన్ చేయాలి. దీనికోసం అంతమొత్తంలో బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే ఆయా బ్యాంకులు ఎల్‌సీని ఇస్తాయి.

**ఆ తర్వాత వేచి చూడాలని నిర్ణయం**

ఇక నెలరోజుల కరెంట్ కొనుగోలు అనంతరం నెల బిల్లు చెల్లించని పక్షంలో ఈ ఎల్‌సీలను 45 రోజుల తర్వాత నగదు రూపంలో మార్చుకునే అవకాశం కరెంట్ అమ్మే సంస్థలకు ఉంటుంది. ఈ నెల 31లోపు ఎల్‌సీలను ఎస్‌ఎల్‌డీసీ, ఆర్‌ఎల్‌డీసీలలో సమర్పిస్తేనే ఆగస్టు ఒకటి నుంచి కరెంట్ కొనొచ్చు. ప్రస్తుతం నిధులు లేకపోవడంతో రూ.240 కోట్ల దాకా పెట్టి వారం రోజులకు సరిపడా కరెంట్‌ను కొనుగోలు చేయాలని, ఆ తర్వాత ఏం జరుగుతుందో చూడాలని డిస్కమ్‌లు భావిస్తున్నాయి.

# సికింద్రాబాద్-వెలాంకని ప్రత్యేక రైలు

**సాక్షి, హైదరాబాద్:** వెలాంకని పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్–వెలాంకని ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–వెలాంకని (07060/07059) స్పెషల్ ట్రైన్ సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం 8.30కు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30కు వెలాంకని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 6.30కు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 7.30కు సికింద్రాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు.

# ముగిసిన ఫార్మర్స్ కోటా కౌన్సెలింగ్

**సాక్షి, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బీటెక్ అగ్రికల్చరల్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ఫార్మర్స్ కోటా కింద ఎంపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంసెట్–2019లో ర్యాంకులు పొంది, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బీటెక్ అగ్రికల్చరల్ సీట్లను భర్తీ చేశాక బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్లను భర్తీ చేశారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల కేంద్రంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో వర్సిటీ డీన్ డా.సదాశివరావు, పరీక్షల నియంత్రణ అధికారి డా.శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అయినవారే అధికం!

- నగరంలో ఏటా వందకు పైగా అపహరణలు
- వీటిలో 'నిజమైన'వాటి సంఖ్య చాలా తక్కువే

**సాక్షి, హైదరాబాద్:** వారం రోజల క్రితం సోనీ కిడ్నాప్.. రెండు రోజులకు ముందు గజేందర్ అపహరణ.. హైదరాబాద్‌లో ఇలా ఏదో ఓ చోటు కిడ్నాప్ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నగరంలో ప్రతి ఏటా వందకు పైగా కిడ్నాప్ కేసులు నమోదవుతుంటాయి. సిటీలో ఒకప్పుడు అపహరణలు చేసి, డబ్బు వసూలు చేసే వ్యవస్థీకృత నేరగాళ్లు ఉండేవారు. వేణు, గుంటూరు కామేశ్వరరావు, గౌరు సురేష్ తదితరులు ఈ కోవకు చెందుతారు. వివిధ సందర్భాల్లో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరు హతం కావడంతో అనేక ఆర్గనైజ్డ్ ముఠాలు కనుమరుగయ్యాయి. ఇటీవల కాలంలో డబ్బు కోసం జరుగుతున్న కిడ్నాపుల్లో 95 శాతం పరిచయస్తులే సూత్రధారులుగా ఉంటున్నారు. వీరు తెర వెనుక ఉండి, స్నేహితులు, పాత నేరగాళ్లతో కథ నడుపుతున్నారు. మంగళవారం కొలిక్కి చేరిన గజేంద్ర–అల్మాస్ వ్యవహారం ఈ కోవకు చెందినదే. ఈ తరహా కేసులు సిటీలో గరిష్టంగా 20 నుంచి 30 వరకు మాత్రమే నమోదవుతూ ఉంటాయి. మిగిలిన కిడ్నాప్ కేసుల్లో అత్యధికం మైనర్ల మిస్సింగ్‌కు సంబంధించినవే. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. చిన్నారులు మిస్సింగ్ అయిన సందర్భంలో కిడ్నాప్ కేసు నమోదు చేస్తుండటంతోనే ఈ సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంటుంది.

**2015–19 మధ్య హైదరాబాద్‌లో రిజిస్టరైన కిడ్నాప్ కేసులు...**

| ఏడాది | కేసులు |
|---|---|
| 2015 | 179 |
| 2016 | 352 |
| 2017 | 341 |
| 2018 | 378 |
| 2019 (జూన్ వరకు) | 129 |

### 'విశ్రాంత జీవితాన్ని సేవకు వినియోగించాలి'

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో అధికారిగా నిబంధనలు, పరిమితుల మధ్య ప్రజలకు సేవలందించిన ఉద్యోగులు విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని స్వేచ్ఛగా సమాజ సేవకు వినియోగించాలని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. బీసీ కమిషన్ కార్యాలయ ప్రత్యేకాధికారి పద్మజ పదవీ విరమణ కార్యక్రమాన్ని కమిషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన పద్మజను చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు ఆంజనేయులు గౌడ్, జూలూరు గౌరీశంకర్, బీసీ కమిషన్ సభ్య కార్యదర్శి అనితారాజేంద్రతోపాటు సహోద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం తాను రచించిన కాలం తెచ్చిన మార్పు పుస్తకాన్ని బీఎస్ రాములు ఆమెకు బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని, విశ్రాంత జీవితాన్ని సమాజ సేవకు వినియోగించాలన్నారు. పనిలో నిజాయితీగా ఉంటూ పద్మజ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

# సంప్రదాయ సాగుపై అ'సెస్'మెంట్

- జహీరాబాద్ మహిళారైతుల సేద్యంపై అధ్యయనం
- మెట్టరైతుల జ్ఞానంతోనే ఆహారభద్రత

**సాక్షి, హైదరాబాద్:** 'మెట్ట రైతులు అనాదిగా అనుసరిస్తున్న సమీకృత సంప్రదాయ వ్యవసాయకజ్ఞానం ప్రతికూల వాతావరణంలో సైతం పౌష్టికాహార, ఆదాయ భద్రతను అందిస్తుంది. రైతుల భావోద్వేగాలు, ఆచారాలు, సంస్కృతితో ఈ వ్యవసాయం ముడిపడి ఉంది. వర్షం ఉన్నప్పుడు ఏ పంటలు వేయాలి, కరువొచ్చినప్పుడు ఏ యే భూముల్లో ఏ యే పంటలు కలిపి వేసుకోవాలన్న సంప్రదాయ విజ్ఞానం జీవవైవిధ్య సంప్రదాయ సేంద్రియ వ్యవసాయంలో అంతర్భాగం'అని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) తదితర సంస్థలు సంయుక్తంగా చేపట్టిన అధ్యయనం చెబుతోంది. జహీరాబాద్ ప్రాంతంలో దళిత మహిళారైతుల జీవవైవిధ్య సమీకృత వ్యవసాయ సంస్కృతి నుంచి ఆధునిక వ్యవసాయ శాస్త్రం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఈ అధ్యయనం సూచించింది. సెస్, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డి.డి.ఎస్.), న్యూఫీల్డ్ ఫౌండేషన్(యు.ఎస్.) ఆధ్వర్యంలో గత ఏడాది ఖరీఫ్, రబీల్లో జహీరాబాద్ ప్రాంత రైతుల సాగు, జీవన స్థితిగతులపై తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ పరిశోధనా సంచాలకులు ఆర్.ఉమారెడ్డి, సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ బి.సురేశ్‌రెడ్డి, డీడీఎస్ కమ్యూనిటీ మీడియా ట్రస్టు అధిపతి చిన్న నరసమ్మ, డీడీఎస్ కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ దంతలూరి తేజస్వి, డీడీఎస్ డైరెక్టర్ పి.వి.సతీశ్ అధ్యయనం చేశారు. ఆ వివరాలను వారు మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.



**ఇంతకీ ఆదాయం ఎంత?**

జహీరాబాద్ ప్రాంతంలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను సేంద్రియంగా పండిస్తున్న ప్రతి మహిళారైతు ఏడాదికి రూ.45 వేల ఆదాయం పొందుతున్నట్లు డీడీఎస్ ప్రతినిధి తేజస్వి తెలిపారు. ఈ రైతుల జీవవైవిధ్య వ్యవసాయం ప్రపంచానికే ఆదర్శప్రాయమని డీడీఎస్ డైరెక్టర్ పి.వి.సతీశ్ అన్నారు.

### ఎన్నో తెలుసుకున్నాం..

జహీరాబాద్ ప్రాంతంలోని 11 గ్రామాల్లో 20–30 మంది రైతులను 2017 జూన్ నుంచి 2018 మే వరకు అనేక దఫాలుగా కలుసుకొని, వారి సాగువిధానాన్ని సునిశితంగా పరిశీలించామని సెస్ అసోసియేట్ ప్రొఫెసర్, వ్యవసాయ శాస్త్రవేత్త సురేశ్‌రెడ్డి తెలిపారు. తాము వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేర్చుకోని విషయాలెన్నో ఆ రైతుల వద్ద నుంచి తెలుసుకున్నామన్నారు. 'విత్తనాన్ని బుట్టల్లో బూడిద, వేపాకు, ఎర్రమట్టి కలిపి దాచుకుంటారు. దిగుబడి ఎన్ని బస్తాలు? అనేది ఒక్కటే కాదు, పశువులకు మేత, భూమికి బలిమినిచ్చేవి ఏ పంటలు అని వాళ్లు చూసుకుంటారు. వాళ్ల పొలాల్లో సాగు చేయకుండా పెరిగే మొక్కలు పోషక, ఔషధ విలువలున్న అద్భుతమైన ఆకుకూరలు, వాళ్ల భూములు కూడా జవజీవాలతో ఉన్నాయి. వీళ్ల వ్యవసాయం జూదప్రాయం కాదు. అప్పులు, ఆత్మహత్యలుండవు. వ్యవసాయ సంక్షోభం నివారణకు ఇది అనుసరణీయం'అని సురేశ్‌రెడ్డి అన్నారు.

**ఎప్పుడు ఏ పంట పెట్టాలో మాకు తెల్సు..**

'రెండు నెలలుగా వర్షం లేదు. ఇప్పుడు పడుతున్న వర్షాలకు పచ్చజొన్న, ఉలవ, సజ్జలు, గడ్డి నువ్వులు వేస్తున్నాం. సజ్జ మంచుకు పండుతుంది. నెలరోజులు వాన లేకపోయినా ఎండదు' –చంద్రమ్మ, ఝరాసంఘం మండలం, బిడకన్నె

తెలంగాణ ప్రభుత్వం
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
NIT No.EE/14, 27 & 32/Tender Notice/2019 తేది : 27.07.2019(2వ పిలుపు)
రంగారెడ్డి, కామారెడ్డి & కరీంనగర్ జిల్లాలలో దేవాలయాల అభివృద్ధి కోసం దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : రూ. 495.90 లక్షలు. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ & ముగింపు తేది (దాఖలు) : NIT No.14 కోసం 31.08.2019. నుండి 07.09.2019 వరకు, NIT No.27 కోసం 31.07.2019. నుండి 07.08.2019 వరకు, NIT నం.32 కోసం : 28.08.2019 నుండి 11.09.2019 వరకు మరింత సమాచారం కోసం https://tender.telangana.gov.in ను దర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
DIPR RO. No.771-DP/CL/ADVT/1/2019-20, Dt: 30.7.2019

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం & మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
e-Proc.Notice No.51/SE/TS/TUFIDC/Narsampet/General/2019-20/78 తేది: 27.07.2019
పనిపేరు: నర్సంపేట్ మున్సిపాలిటీలో CHEలో ప్రస్తుతమున్న CEMONC సెంటర్ వద్ద పల్లియేటివ్ కేర్ సెంటర్ నిర్మాణం మరియు RDO ఆఫీస్ రోడ్‌లో RDO నివాసానికి ప్రక్కన ఆనుకొని ఉన్న ప్రహరీ గోడతో సహా కమ్యూనిటీ హాల్ నిర్మాణము. ECV: రూ. 60.00లక్షలు. బిడ్స్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 01.08.2019 బిడ్స్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 08.08.2019. తదుపరి వివరాల కోసం www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), TUFIDC, UNIT-I, వరంగల్
DIPR RO. No.770-DP/CL/Advt/1/2019-20, Dt: 30.07.2019

తెలంగాణ ప్రభుత్వం
చీఫ్ ఇంజినీర్-II కార్యాలయం, మిషన్ భగీరథ శాఖ, హైదరాబాద్
సవరణ
No. AEE I/DEE I/CE-II/O&M Aug Segment/2019 తేది : 27.07.2019
టెండరు ప్రకటన నం.12/CE-II/MB/2019, తేది : 16.07.2019కు సవరణ. సవరణ ప్రకారం దిగువ విధంగా చదువు కోవలెను : పనిపేరు : టెయిల్‌పోండ్‌తో 4 నియోజకవర్గాలకు నీటి సరఫరా చేయు ప్రధాన పని క్రింద నల్గొండ మరియు సూర్యాపేట జిల్లాలలో CPWS స్కీమ్‌ల O&M. (నల్గొండ జిల్లాలో వరుసగా కృష్ణానది) సుమారు ECV : రూ.1380.00 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్లు లభించు తేది : 01.08.2019 నుండి 21.08.2019న మ.3.00గం.వరకు. టెండరు స్వీకరణ తేదీలు : 01.08.2019 నుండి 21.08.2019 మ.3.00గం.వరకు. సాంకేతిక బిడ్లు తెరుచు తేది : 21.08.2019న సా.4.00గం.కు. ఆర్థిక బిడ్ తెరుచు తేది : 27.08.2019న ఉ.11.30గం.కు. సంప్రదించు నం. SE, 9100120082. డిప్యూటీ EE : 9100122293
సం/- చీఫ్ ఇంజినీర్ - II, MB, హైదరాబాద్
DIPR RO. No.768-DP/CL/ADVT/1/2019-20, Dt: 30.7.2019

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ (e-టెండరు కమ్ e-రివర్స్ వేలం) ప్రకటన
మెసర్స్ MSTC ప్లాట్‌ఫారం ద్వారా ఆరు (6) నెలల కాలానికి దిగువ ఐటంల సేకరణ కోసం e-టెండరు కమ్ e-రివర్స్ వేలం కోరబడుతోంది. ఆసక్తి గల బిడ్డర్లు టెక్నో-కమర్షియల్ డాక్యుమెంట్లు, బయానా మరియు ట్రాన్సాక్షన్ రుసుమును రివర్స్ ఆక్షన్ తేదీకి కనీసం ఒక పని రోజు ముందు MSTC యొక్క ఏదేని కార్యాలయంకు దాఖలు చేయాలి. సాంకేతికంగా అర్హులైన బిడ్డర్లు e-రివర్స్ వేలంలో పాల్గొనుటకు అనుమతించబడతారు.

| క్ర. సం. | ఐటమ్ పేరు | పరిమాణం | బయానా రూ. | టెండర్ అప్‌లోడింగ్ & డౌన్‌లోడింగ్ తేది |
|---|---|---|---|---|
| 1. | అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్‌తో ఆవునెయ్యి (ట్యాంకర్ల ద్వారా)-AP డెయిరీలు | 4,36,000 కి.గ్రా.లు | రూ.38,05,000/- | 30-07-2019 07-08-2019 |

వివరమైన వేలం కేటలాగ్: NIT నిబంధనలను MSTC వెబ్‌సైట్: www.mstcecommerce.com/eprochome/ttd నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కోసం సంప్రదించండి: ఫోన్ నంబర్లు: 0877-2264079. MSTC: మొబైల్ నం. 9666040607/9441487624.
Roc.No.PR4/13908/Adv.No.188/PRO/2019, Dt:30-07-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

## నేడు కర్ణాటకలో రేపు తెలంగాణలో..

### అధికారం మాదేనన్న బీజేపీ



**సాక్షి, హైదరాబాద్:** నేడు కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం వచ్చిందని, రేపు తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. నేడు కర్ణాటక, రేపు తెలంగాణ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక బీజేపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మురళీధర్‌రావును సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుతో దక్షిణాదిలో జరిగే విస్తరణ వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం, పోరాటం అంటే ఏంటో చూపిస్తామన్నారు. మున్సిపల్ బిల్లు నిలబడదని తాము ముందే చెప్పామన్నారు. గవర్నర్‌ను కలిశామని, అదృష్టవశాత్తూ గవర్నర్ మేల్కొన్నారని పేర్కొన్నారు. టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని అనుకుంటున్న నేతలు బీజేపీలో చేరాలనుకుంటున్నారని చెప్పారు. బీజేపీకి ఎవరి సపోర్ట్ అవసరం లేదన్నారు. తెలంగాణలో సక్సెస్ అయ్యే పార్టీ బీజేపీనేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, విజయరామారావు, పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి, ఎం.ధర్మారావు, ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, మీడియా కన్వీనర్ సుధాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఆర్డినెన్స్ స్వయం ప్రతిపత్తికి విఘాతమే: జీవన్‌రెడ్డి, పొన్నాల


జీవన్‌రెడ్డి


పొన్నాల

**సాక్షి, హైదరాబాద్:** బలహీన వర్గాల హక్కులను టీఆర్ఎస్ కాలరాస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభిప్రాయపడ్డా రు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును మెప్పించి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా బీసీల రిజర్వేషన్లను తగ్గించాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించే విధంగా మున్సిపల్ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కూడా ప్రభుత్వం తీసుకునే వెసులుబాటును మాత్రమే మార్చి ఆర్డినెన్స్ తీసుకొచ్చారని, కలెక్టర్లకు మున్సిపాలిటీలపై పెత్తనాన్ని అలానే ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్లకు అధికారాలివ్వడం స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని తీసేయడమేనని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోర్టులు ఎన్నో సార్లు మొట్టికాయలు వేశాయని, కానీ తొలిసారి ప్రభుత్వం సభలో ఆమోదించిన బిల్లును గవర్నర్ వెనక్కు పంపారని టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య ఎద్దేవా చేశారు. ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకోటి ఉండదని వ్యాఖ్యానించారు.

## 'కర్ణాటక స్పీకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'



**సాక్షి, హైదరాబాద్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే విషయంలో కర్ణాటక స్పీకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మంథని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా స్పీకర్ స్థానంలో ఉన్న రమేశ్‌కుమార్ 14 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం అభినందనీయమని మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. స్పీకర్ వ్యవస్థ స్వతంత్రమైందని రమేశ్‌కుమార్ నిరూపించారని, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కూడా అదే కోవలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. పక్కరాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని కోరారు. అసెంబ్లీలో తాము మున్సిపల్ చట్టానికి సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకోకుండా రాజ్యాంగ విరుద్ధంగా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు.

## ప్రచారకర్తలను కూడా బాధ్యులను చేయండి

### కేంద్రానికి ఎంపీ రంజిత్‌రెడ్డి సూచన



**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో మోసపూరిత ప్రకటనలకు ఉత్పత్తి, అమ్మకాల సంస్థలనే కాకుండా ఆ ప్రకటనల ప్రచారకర్తలను కూడా బాధ్యులను చేయాలని కేంద్ర ప్రభుత్వానికి టీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం లోక్‌సభలో వినియోగదారుల రక్షణ బిల్లు–2019పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్లో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రచారకర్తలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నారని, వారి ప్రకటనలు చూసే ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో కొన్ని మోసపూరిత ప్రకటనల వల్ల వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. వీటిని నివారించేందుకు ఉత్పత్తి, అమ్మకందారులతోపాటు ప్రచారకర్తలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా వినియోగదారుల హక్కులను రక్షించగలమని, అందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం, పాన్‌మసాల, సిగరెట్ల అమ్మకాలకు సంబంధించి ఎలాంటి పరోక్ష ప్రకటనలను అనుమతించకూడదని కోరారు.

## లాభాలకు అనుగుణంగా బోనస్ ఇవ్వాలి

### వేతన బిల్లుపై చర్చలో ఎంపీ నామా



**సాక్షి, న్యూఢిల్లీ:** కంపెనీలు 8.33 శాతం బోనస్ ఇవ్వడంతోపాటు ఆర్జించిన లాభాలకు అనుగుణంగా బోనస్ చెల్లిస్తే ఉద్యోగులు, కార్మికులు సంస్థను తమదిగా భావిస్తారని టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. వేతన బిల్లుపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చక్కటి వేతనాలు కల్పిస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే విధంగా అందేలా చూడాలని ఆయన కోరారు. వేతన చెల్లింపు చట్టం, కనీస వేతన చట్టం, బోనస్ చెల్లింపు, సమాన గణన తదితర ఒక్కో అంశంలో ఒక్కో సమస్య ఉందన్నారు. వీటన్నింటినీ అనుసంధానం చేసి సమస్యకు ఎలా పరిష్కారం చూపుతారో కేంద్రం వివరించాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, సమయానుసారం కనీస వేతనాలను పునఃసమీక్షించాలన్నారు. రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఉద్యోగులు, కార్మికులు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

### కేంద్ర మంత్రులకు ఎంపీ బీబీపాటిల్ వినతి



**సాక్షి, న్యూఢిల్లీ:** వీరశైవ లింగాయత్, లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డిలకు టీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ వినతిపత్రం ఇచ్చారు. తాము గతంలో ఇచ్చిన వినతిపై ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో 22 ద్వారా బీసీ–డీ జాబితాలో చేర్చిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా 2015లో ఈమేరకు జీవో విడుదల చేసిందని గుర్తుచేశారు. తెలంగాణలో రిజర్వేషన్లు వర్తిస్తున్నా.. కేంద్ర ఓబీసీ జాబితాలో లేకపోవడం వల్ల రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని తెలిపారు. ఎంపీతో పాటు వీరశైవ లింగాయత్ సమాఖ్య సభ్యులు కూడా మంత్రులను కలిసి విన్నవించారు.

## చర్చకు ఎందుకు రాలేదు?: మల్లు రవి



**సాక్షి, హైదరాబాద్:** రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చలో టీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదో ప్రజలకు వివరణ ఇవ్వాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లు మెజారిటీ లేక ఆగిపోయిందని, అయితే టీఆర్ఎస్ పరోక్ష మద్దతుతో ఎన్డీయే ప్రభుత్వం బిల్లు పాస్ చేసుకుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ముస్లింలకు టీఆర్ఎస్ ఏం సమాధానాలు చెబుతుందని ప్రశ్నించారు. తమకు టీఆర్ఎస్ మిత్ర పార్టీ అని గొప్పలు చెబుతున్న ఎంఐఎం ట్రిపుల్ తలాక్ విషయంలో ప్రస్తుత టీఆర్ఎస్ తీరుపై ఏమని బదులిస్తుందని నిలదీశారు.

# పేల్చి.. కూల్చేద్దాం!

- సచివాలయ భవనాలను బ్లాస్టింగ్ ద్వారా కూల్చివేయాలని అధికారుల యోచన
- పాత పద్ధతిలో కూల్చివేస్తే తీవ్ర జాప్యం జరిగే అవకాశం
- కంట్రోల్ బ్లాస్టింగ్‌తో ఒకటి రెండు రోజుల్లోనే పని పూర్తి
- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో తుది నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** సచివాలయ పాత భవనాలను కంట్రోల్ బ్లాస్టింగ్ పద్ధతిలో పేలుడు పదార్థాలు ఉపయోగించి కూల్చివేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సచివాలయం ఉన్న స్థలంలోనే కొత్త సెక్రటేరియట్ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం కొత్త భవన సముదాయానికి డిజైన్లు కూడా సిద్ధమవుతున్నాయి. త్వరలో వాటిని ఖరారు చేసి నిర్మాణానికి వీలుగా టెండర్లు ఖరారు చేయబోతున్నారు. శ్రావణ మాసంలో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. దాదాపు 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక హంగులతో కొత్త భవనాల సముదాయం రూపుదిద్దుకోనుంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న పాత భవనాలను కూల్చివేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను కూడా శ్రావణ మాసంలోనే మొదలుపెట్టాలని భావిస్తున్నారు.



**15 రోజుల్లో కార్యాలయాల తరలింపు...**

ప్రస్తుతం సచివాలయంలో దాదాపు 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలున్నాయి. ఒక్కో భవనం ఒక్కో బ్లాకుగా మొత్తం పది భవనాలున్నాయి. ఇందులో జీ బ్లాకుగా ఉన్న నిజాం హయాంలో నిర్మించిన సైఫాబాద్ ప్యాలెస్ అన్నింటికంటే పురాతనమైంది. ప్రస్తుతం మంత్రుల కార్యాలయాలున్న డి బ్లాక్ భవనం కొత్తది. మిగతావి ఎన్టీ రామారావు, చెన్నారెడ్డి తదితరులు ముఖ్యమంత్రులుగా ఉండగా నిర్మించినవి. ఇప్పుడు ఈ భవనాలన్నింటినీ కూల్చివేయనున్నారు. తొలుత ఎ, బి, సి, డి బ్లాకుల్లోని కార్యాలయాలను హెచ్, జే, కే బ్లాకుల్లోకి తరలించి వాటిని కూల్చి కొత్త భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. కానీ అదే ప్రాంగణంలో కార్యాలయాలుంటే, కూల్చివేతల సమయంలో దుమ్ము ధూళితో ఇబ్బంది పడాల్సి వస్తుందని భావించారు. దీంతో వేరే చోటకు కార్యాలయాలను తరలించి మొత్తం భవనాలన్నింటినీ ఒకేసారి కూల్చి కొత్త భవన సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు వీలుగా బీఆర్‌కే భవన్‌ను ఎంపిక చేసి అందులోని కార్యాలయాలను ఖాళీ చేయించారు. వచ్చే పక్షం రోజుల్లో సచివాలయ కార్యాలయాలు అందులోకి తరలిపోనున్నాయి.

**పాత విధానంలో దుమ్ము ధూళి సమస్య**

సచివాలయం మొత్తం ఖాళీ కాగానే ఆ భవనాల కూల్చివేతలు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. పది బ్లాకులుగా పెద్దపెద్ద భవనాలున్నందున వాటిని సంప్రదాయ పద్ధతిలో కూల్చివేయటానికి చాలా సమయం పడుతుండటమే కాకుండా, పనులు జరుగుతున్నన్ని రోజులు దుమ్ము ధూళి సమీప ప్రాంతాలను ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్నందున ఆధునిక పద్ధతిలో కూల్చివేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం పేలుడు పదార్థాలు అమర్చి ఒకేసారి భవనం మొత్తాన్ని నేలకూల్చే బ్లాస్టింగ్‌ను ఎంచుకోనున్నట్టు సమాచారం. దీంతో ఒకటి రెండు రోజుల్లోనే అన్ని బ్లాకులను కూల్చివేసి శిథిలాలను తరలించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సంబంధిత నిపుణులను పిలిపించి చర్చించనున్నారు. ఈ విధానం హైదరాబాద్‌లో పెద్దగా చేపట్టిన దాఖలాలు లేవు. గతంలో మూడునాలుగు పర్యాయాలు కొన్ని భవనాలను కూల్చారు. అయితే, వాటిలో కొన్ని పూర్తిగా విజయవంతం కాలేదు. దీంతో ఈ విధానంలో నైపుణ్యం ఉన్నవారికే ఈ బాధ్యత అప్పగించాలని యోచిస్తున్నారు. త్వరలో జరిగే మంత్రివర్గ ఉపసంఘం భేటీలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



మంగళవారం హైదరాబాద్‌లోని గుర్రంగూడ వద్ద ఆరోగ్య సంజీవని పార్కును ప్రారంభించిన అనంతరం ట్రాక్‌పై సైకిల్ నడుపుతున్న సీఎస్ ఎస్‌కే జోషి

## మొక్కల్ని బతికించడంపై దృష్టిపెట్టాలి

### ఐదో విడత హరితహారంపై అధికారులకు సీఎస్ సూచనలు

**సాక్షి, హైదరాబాద్:** హరితహారంలో భాగంగా నాటిన మొక్కల్ని బ్రతికించడంలోనే ప్రధానంగా దృష్టిపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి పేర్కొన్నారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున హరితహారం కార్యక్రమం ముమ్మరంగా సాగేలా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. తగిన ఎత్తున్న మొక్కల్ని నాటడంతో పాటు వాటి రక్షణకు, నీటి వసతి కల్పనకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఐదో విడత హరితహారంపై సచివాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ వీడియో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ సామాజిక బాధ్యత కింద హరితహారంలో తమవంతు పాత్ర పోషించేలా వివిధ సంస్థల్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు. ఉపాధి హామీ నిధులతో మొక్కల రక్షణ కోసం వాచర్లను నియమించాలన్నారు.

## రాష్ట్రాల హక్కులను హరించేలా ఉంది

### జాతీయ నూతన విద్యా విధానంపై విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** జాతీయ నూతన విద్యా విధానం ముసాయిదాలో ప్రమాదకర అంశాలు ఉన్నాయని, అవి రాష్ట్రాల హక్కులను హరించేలా రూపొందించారని విద్యాశాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యారంగం కేంద్రీకరణ దేశానికే ప్రమాదకరమని తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం –2019 ముసాయిదాపై మంగళవారం హైదరాబాద్‌లోని ఆస్కీలో విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక, మాధ్యమిక విద్యారంగాన్ని ప్రధాని పర్యవేక్షించడం తగదన్నారు. ఆదిలాబాద్, అలంపూర్, భద్రాచలం వంటి మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలను నియంత్రించడం, సిలబస్ రూపకల్పన వంటి పనులు ప్రధాని నేతృత్వంలో జరగాలనుకోవడం దురదృష్టకరమన్నారు. కేంద్రం ప్రతిపాదించిన ఈ విధానం ప్రగతిశీలంగా ఉంటుందని అంతా భావించారని, కానీ ఏదో దాచిపెట్టినట్లు కనిపిస్తోందని, రహస్య ఎజెండా ఉందన్నారు. విధానాలు, చట్టాలు ప్రజలతో చర్చించి చేస్తేనే బాగుంటుందన్నారు. విద్యారంగంలో ఉన్న అంతరాలపై ఈ కమిటీ ప్రస్తావించలేదన్నారు. సీఎం కేసీఆర్ త్వరలోనే విద్యారంగంపై వర్క్‌షాప్ నిర్వహిస్తారన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను తెలియజేసే గడువు ఈనెల 31తో ముగుస్తున్నందున, ఆ గడువును మరో నెల రోజులు పొడిగించాలని కోరామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జాతీయ విద్యావిధానం ముసాయిదా రూపకల్పన జరిగిందని విమర్శించారు. రాజ్యాంగంలో ఉన్న లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారం, సమానత్వం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ముసాయిదా రూపకల్పన శాస్త్రీయంగా లేదన్నారు. సంస్కృతం నేర్చుకొని కంప్యూటర్ యుగంలో ప్రపంచంతో విద్యార్థులు పోటీపడగలరా? అని ప్రశ్నించారు. కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. విద్యారంగానికి 20 శాతం వరకు నిధులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వొకేషనల్ విద్యను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, వైస్ చైర్మన్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాటయోధుడు గట్టికొప్పుల కన్నుమూత



**హైదరాబాద్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సీపీఎం సీనియర్ నేత గట్టికొప్పుల రాంరెడ్డి(90) కన్నుమూశారు. ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్లకు చెందిన రాంరెడ్డికి భార్య వరలక్ష్మి, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు వెంకటనర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యంలతో కలిసి తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. తన మేనమామ దేవిరెడ్డి లక్ష్మీనర్సింహారెడ్డి స్ఫూర్తితో విద్యార్థిదశలోనే రాజకీయాల్లోకి ప్రవేశించి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. సాయుధ పోరాటంలో భాగంగా అజ్ఞాతంలో ఉన్న నేతలకు కొరియర్‌గా సేవలు అందించారు. ముల్కపట్నం గ్రామానికి సర్పంచ్‌గా రాజకీయ జీవితం ప్రారంభించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

## పురపోరు కోసం 'సామాజిక అస్త్రం'

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యూహం
- బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 70–75 శాతం సీట్లు
- టీఆర్ఎస్ తెచ్చిన ఆర్డినెన్స్‌పై కోర్టుకు వెళ్లాలని నిర్ణయం
- కలెక్టర్ల అధికారాలను సవాల్ చేయనున్న ప్రధాన ప్రతిపక్షం

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సామాజిక అస్త్రాన్ని సంధించనుంది. ముఖ్యంగా బీసీ ఓట్లను రాబట్టుకోవడమే లక్ష్యంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 70–75 సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీలకు 50 శాతం సీట్ల కేటాయింపుపై సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేలా టికెట్ల కేటాయింపు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులకు ఆదేశాలు జారీచేశారు. మున్సిపాలిటీని యూనిట్‌గా తీసుకుని ప్రతి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 70–75 శాతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని, మిగిలిన స్థానాల్లోనే ఇతరులను బరిలోకి దింపేలా కసరత్తు చేయాలని డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. బీసీ సంఘాలు, ఆ వర్గాల నేత డిమాండ్ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచకుండానే టీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్ బిల్లును ఆమోదించిన నేపథ్యంలో బీసీల ఓట్లను కొల్లగొట్టే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్గాలంటున్నాయి.

**మున్సిపల్ బిల్లుపై 'సవాల్'**

రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త మున్సిపల్ చట్టాన్ని న్యాయస్థానంలో సవాల్ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మున్సిపాలిటీలపై కలెక్టర్ల పెత్తనం స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని హరించడమేనని, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా దఖలు పడ్డ హక్కులను కాలరాయడమేనని, ఈ అంశాన్ని కోర్టులో సవాల్ చేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**రిజర్వేషన్ల పెంపుపై..**

బీసీలకు రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరించాలని కోర్టును కోరుతామంటున్నారు. ముఖ్యంగా 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు విషయంలో మహారాష్ట్రలో 52 శాతం రిజర్వేషన్లకు తోడు, మరో 16 శాతాన్ని మరాఠాలకు రిజర్వేషన్లు ఇచ్చిన విషయాన్ని లేవనెత్తాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మహారాష్ట్రలో 64 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ఇదే విషయాన్ని కోర్టుకు చెప్పి బీసీలకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

## హీరాగోల్డ్ కేసుల వివరాలివ్వండి

### పోలీసులకు హైకోర్టు ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** హీరాగోల్డ్ చైర్‌పర్సన్ నౌహీరా షేక్‌పై నమోదైన కేసుల వివరాలు అందజేయాలని పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఒకే తరహా ఆరోపణలతో వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయని, ఆమెను 2018 అక్టోబర్ 15 నుంచి అన్యాయంగా జైల్లో ఉంచారని, తమ కంపెనీ విచారణ పరిధి రాష్ట్రానికి లేదంటూ దాఖలైన 4 రిట్లను న్యాయమూర్తి విచారించారు. ఆగస్టు 7లోగా నౌహీరా షేక్‌పై ఎన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారో, ఎన్నింటిలో చార్జిషీట్లు దాఖలు చేశారో వాటి పూర్తి వివరాలను నివేదించాలని పోలీసుల్ని ఆదేశించారు. ఒకే తరహా కేసులు వివిధ పోలీస్ స్టేషన్లల్లో నమోదు చేసి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని నౌహీరా షేక్ తరఫున సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ వాదించారు. విచారణ ఆగస్టు 7కి వాయిదా పడింది.

## 'ఎర్రమంజిల్' కూల్చివేతపై స్టే ఇవ్వండి

- హైకోర్టును కోరిన పిటిషనర్ తరఫు న్యాయవాది
- విచారణ నేటికి వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చరాదంటూ దాఖలైన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఎర్రగడ్డలోని చారిత్రక భవనం 'ఇరానుమా'ను కూల్చి సచివాలయం నిర్మించాలనే ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకున్నట్లుగానే ఎర్రమంజిల్ భవనం కూల్చివేత విషయంలోనూ స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది నళిన్ కుమార్ హైకోర్టును కోరారు. రెగ్యులేషన్ 13ను హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో చేర్చారని, దీని ద్వారానే హెరిటేజ్ కన్సర్వేటివ్ కమిటీ ఏర్పడిందని తెలిపారు. ఒకసారి వారసత్వ జాబితాలో భవనాల్ని చేర్చినా, తిరిగి ఆ జాబితా నుంచి ఏదైనా భవనాన్ని తొలగించాలన్నా ఆ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం చేయాలన్నారు. ఆ తరహా భవనాలకు మరమ్మతులు చేయాలంటే కూడా ఆ కమిటీ అనుమతి అవసరమని, ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమంజిల్ భవన ప్రదేశంలో చట్టసభల భవన సముదాయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించడం చట్ట వ్యతిరేకం అవుతుందన్నారు. ఎర్రగడ్డలోని ఛాతీ వ్యాధుల ఆస్పత్రి (చెస్ట్ హాస్పటల్) నిర్వహిస్తున్న ఇరానుమా భవనం కూల్చివేయరాదన్న కేసులో హైకోర్టు.. హెరిటేజ్ కన్సర్వేటివ్ కమిటీ ఏర్పాటు చేయాలని 2015లో జారీ చేసిన ఆదేశాల్ని ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. దీనిపై ధర్మాసనం కల్పించుకుని.. ఈ అంశాన్ని లోతుగా విచారించాల్సి ఉందని పేర్కొంది. గత విచారణ సమయంలో హెచ్ఎండీఏ చట్టంలోని రెగ్యులేషన్ 13ను తొలగించినప్పటికీ జోనల్ రెగ్యులేషన్‌లో ఉన్నందున మాస్టర్ ప్లాన్‌లో అది కొనసాగుతుందని వాదించారని తెలిపింది. ఇప్పుడేమో జోనల్ రెగ్యులేషన్‌కు స్వయం ప్రతిపత్తి ఉందని, హెచ్ఎండీఏ చట్టంలోని 13వ నిబంధన తొలగింపు ప్రభావం లేదని అందుకు విరుద్ధంగా ఎలా చెబుతున్నారో వివరణ ఇవ్వాలని కోరింది. హెచ్ఎండీఏ చట్టాన్ని 2008లో రూపొందించినప్పుడు 13వ నిబంధన లేదని, తర్వాత చేర్చిన ప్రభుత్వం తిరిగి 2015లో తొలగించిందని, కొత్త చట్టంలో 13వ నిబంధన ఏ విధంగా ఉనికిలో ఉంటుందో చెప్పాలని, దీనిపై పిటిషనర్ల వాదనలు తెలియజేయాలని కోరింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## నేడు పీసీసీఎఫ్ ఝా పదవీ విరమణ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణాధికారి (పీసీసీఎఫ్)గా ప్రశాంత్ కుమార్ ఝా నేడు పదవీ విరమణ చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరణ్యభవన్‌లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొనే అవకాశాలున్నాయి. మూడేళ్లకు పైగా పీసీసీఎఫ్‌గా పనిచేసిన ఝా అటవీశాఖకు కొత్త రూపునిచ్చారు. రాష్ట్రంలో 35 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో నిర్వహించిన విధుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మూడేళ్లకు పైగా పీసీసీఎఫ్‌గా విధులు నిర్వహించడం, అటవీశాఖలో తాను ఆశించినమేర మార్పులు తీసుకురాగలగడం ఆనందాన్ని కలిగించిందని ఝా చెప్పారు. కొత్త పీసీసీఎఫ్‌గా ప్రభుత్వం ఎవరిని నియమిస్తుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

# టీఆర్ఎస్‌ను ఓడించేది మేమే

- వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- విలేకరులతో ఇష్టాగోష్టిలో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధీమా
- తెలంగాణలో కాంగ్రెస్‌కే సంస్థాగత బలం
- బీజేపీకి రాష్ట్రంలో పట్టు లేదు
- టీఆర్ఎస్–బీజేపీది నకిలీ యుద్ధం




మంగళవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో అధికార టీఆర్ఎస్‌ను ఓడించగల శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'తెలంగాణలో కాంగ్రెస్‌కు మాత్రమే సంస్థాగత బలం ఉంది. మా పార్టీ స్వరూపం కూడా చాలా భద్రంగా ఉంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చి లక్కీ లాటరీలో నాలుగు ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన బీజేపీకి రాష్ట్రంలో పట్టు లేదు. సంప్రదాయంగా ఆ పార్టీకి బలం ఉన్న నాలుగైదు పట్టణాల్లో కొంత ప్రభావం కనిపిస్తుంది. అంతకుమించి క్షేత్రస్థాయిలో ఆ పార్టీ ఎక్కడా లేదు. మీడియానే బీజేపీని ఎక్కువ చేసి చూపిస్తోంది. తెలంగాణ ప్రజలు స్వభావికంగానే లౌకికవాదులు. మతతత్వ సిద్ధాంతంతో రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం తెలంగాణలో కుదరదు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో గులాబీ దళాన్ని చిత్తు చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరుతాం'అని వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీ భవన్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులతో కలసి ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీ బలమేంటో స్థానిక సంస్థల ఎన్నికల్లోనే తేలిపోయిందని ఎద్దేవా చేశారు. పరిషత్, పంచాయతీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికలకు కూడా సిద్ధమవుతున్నామని, ఈ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామన్నారు.

**అంతర్గతంగా కమలం–గులాబీ కలిసే...**

సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేలా బీజేపీ తెచ్చిన సవరణ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు పలికిందని, ఆ పార్టీ ఎంపీలు ఓటేసినందుకే రాజ్యసభలో ఆ బిల్లు గట్టెక్కిందని ఉత్తమ్ గుర్తుచేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, వారిద్దరిదీ బయట నకిలీ యుద్ధమని, లోపల మాత్రం కలిసే పనిచేస్తున్నారని విమర్శించారు. బీజేపీ పెట్టిన బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు పలకడమే ఇందుకు నిదర్శనమన్నారు.

**నియంత పాలన కోసమే మున్సిపల్ బిల్లు...**

రాష్ట్రంలో నియంత పాలనను నడిపించాలనే ఉద్దేశంతోనే స్థానిక సంస్థలపై కలెక్టర్లకు అధికారాన్ని కట్టబెట్టి సీఎం కేసీఆర్ మున్సిపల్ బిల్లు తీసుకొచ్చారని ఉత్తమ్ విమర్శించారు. 85 శాతం మొక్కలు పెరగకపోతే వార్డు సభ్యులను సస్పెండ్ చేస్తామని చట్టంలో పెట్టారని, మరి తెలంగాణలో ఇప్పటివరకు నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కలు పెరగలేదని, అందుకు సీఎం, మంత్రులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. ఈ చట్టం నిలబడేది కాదని, తాము కూడా చట్టపరంగా సవాల్ చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమాన్ని వచ్చే నెల 4వ తేదీ వరకు వాయిదా వేస్తున్నట్టు ఉత్తమ్ చెప్పారు. కొన్ని ఆకస్మిక ఘటనలు, వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు.

**పోలీసు రాజ్యంగా మారుస్తున్నారు...**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని పోలీసు రాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఉత్తమ్ ఆరోపించారు. గతంలో టెర్రరిస్టు సంస్థలపై నిఘా ఉంచేవారని, ఇప్పుడు తెచ్చిన చట్టం ద్వారా దేశంలోని ఏ వ్యకినైనా టెర్రరిస్టు పేరుతో అదుపులోకి తీసుకొని ఆరు నెలల వరకు బెయిల్‌కు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా చేశారని మండిపడ్డారు. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని పదేపదే బీజేపీ నేతలు చెబుతున్నారని, అలా జరగాలంటే ఇప్పటివరకు కనీసం రైతు ఆదాయం అందులో సగమైనా పెరగాలి కదా అని ప్రశ్నించారు. నామమాత్రంగా కనీస మద్దతు ధర పెంచి వదిలేశారని, మరోవైపు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయని, వ్యవసాయ వృద్ధి పడిపోయిందని ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు.



వారణాసిలో సంబరాలు చేసుకుంటున్న ముస్లిం మహిళలు

# ట్రిపుల్ తలాక్ ఇక రద్దు

## రాజ్యసభలోనూ గట్టెక్కిన బిల్లు

- సభ నుంచి వాకౌట్ చేసిన జేడీయూ, అన్నా డీఎంకే
- బీజేడీ మద్దతుతో పాసైన బిల్లు • వ్యతిరేకంగా ఓటేసిన వైఎస్సార్‌సీపీ
- ముస్లిం దేశాలే మారాయి, మనం మార్చకూడదా?: రవిశంకర్ ప్రసాద్
- ఇండియా సంతోషిస్తోంది: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** ముస్లిం పురుషులు తక్షణం మూడు సార్లు తలాక్ చెప్పి తమ భార్యలకు విడాకులు ఇవ్వడాన్ని (ట్రిపుల్ తలాక్ లేదా తలాక్–ఏ–బిద్దత్‌ను) నేరంగా పరిగణించేలా కేంద్రం తీసుకొచ్చిన బిల్లును రాజ్యసభ మంగళవారం ఆమోదించింది. ట్రిపుల్ తలాక్ బిల్లును లోక్‌సభ గతవారమే ఆమోదించడంతో ఈ బిల్లు పార్లమెంటులో పాస్ అయ్యింది. తలాక్–ఏ–బిద్దత్‌ను ఎస్‌ఎంఎస్, వాట్సాప్, రాతపూర్వకంగా, నోటి మాటతో లేదా ఇతర ఏ మార్గం/పద్ధతిలోనైనా.. ఎలా చెప్పినా ఆ చర్యను ఈ బిల్లు నేరంగా పరిగణిస్తుంది. 'ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ)' పేరిట తెచ్చిన ఈ బిల్లును ఎన్డీయేలో భాగమైన జేడీయూ, అన్నా డీఎంకే పార్టీలు కూడా వ్యతిరేకించినప్పటికీ, తటస్థ పార్టీ అయిన బీజేడీ బిల్లుకు మద్దతు తెలిపింది. బిల్లును ఆమోదించడంపై ఓటింగ్ నిర్వహించగా 99 ఓట్లు అనుకూలంగా, 84 ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. దీంతో రాజ్యసభలోనూ ట్రిపుల్ తలాక్ బిల్లు గట్టెక్కింది. ఇక రాష్ట్రపతి సంతకం చేసిన అనంతరం ట్రిపుల్ తలాక్ బిల్లు చట్టరూపం దాల్చి, కేంద్రం గతంలో ఇచ్చిన ఆర్డినెన్స్ రద్దవుతుంది. బిల్లును ఆమోదించడంపై ఓటింగ్‌కు ముందు.. అసలు ఈ బిల్లును రాజ్యసభ ఎంపిక కమిటీకి పంపాలా? వద్దా? అన్న దానిపైనా ప్రతిపక్షాల బలవంతంతో ఓటింగ్ నిర్వహించారు. ఎంపిక కమిటీకి పంపవద్దని 100 ఓట్లు, పంపాలని 84 ఓట్లు పడ్డాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని గత ప్రభుత్వమే తీసుకొచ్చి, లోక్‌సభలో ఆమోదింపజేసుకున్నప్పటికీ, రాజ్యసభలో అది తిరస్కరణకు గురైంది. దీంతో రెండోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాకా ఈ బిల్లును మరోసారి తీసుకురాగా, పార్లమెంటు ఆమోదం లభించింది.

**20 ఇస్లాం దేశాలు కూడా నియంత్రించాయి**

బిల్లుపై నాలుగున్నర గంటలు సాగిన చర్చలో న్యాయశాఖ మంత్రి రవిశంకర్ మాట్లాడుతూ తక్షణ ముమ్మారు తలాక్‌ను 20 ఇస్లాం దేశాలే నియంత్రించాయనీ, ముస్లిం మహిళల మంచి కోసం ప్రజాస్వామ్య దేశమైన మనం ఎందుకు ఆ పని చేయకూడదని ప్రశ్నించారు. హిందువుల్లోనూ బహుభార్యత్వం, వరకట్నం తదితర నేరాలకు జైలుశిక్ష ఉందని గుర్తుచేసిన రవిశంకర్.. ట్రిపుల్ తలాక్ చెప్పే వారికి జైలు శిక్ష విధించడాన్ని సమర్థించారు. ముస్లిం ఇళ్లలో గొడవలు పెట్టడానికి రాజకీయ దురుద్దేశంతో ఈ బిల్లును తెచ్చారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ ఆరోపించడంపై రవిశంకర్ సమాధానమిస్తూ, ముస్లిం మహిళల హక్కులను పట్టించుకోనందునే ఆ పార్టీకి 1984 తర్వాత ఇంకెప్పుడూ ఎన్నికల్లో సాధారణ మెజారిటీ కూడా రాలేదని విమర్శించారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగబద్ధం కాదని 2017లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందునే తాము ఇప్పుడు ఈ బిల్లు తీసుకురాలేదనీ, వాట్సాప్‌లో కూడా విడాకులిచ్చే భర్తల నుంచి ముస్లిం మహిళల హక్కులకు రక్షణ కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఈ బిల్లును తెచ్చిందని రవిశంకర్ చెప్పారు. ట్రిపుల్ తలాక్ బిల్లును రాజకీయ కోణంలో కాకుండా, మానవత్వం, లింగ సమానత్వం, మహిళా సాధికారత కోణంలో చూడాలని కోరారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్

**టీడీపీ, టీఆర్‌ఎస్ ఓటింగ్‌కు గైర్హాజరు**

బీజేపీ మిత్రపక్షమైన అన్నాడీఎంకేతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన టీఆర్‌ఎస్, తెలుగుదేశం పార్టీలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. బీజేపీ నేత అరుణ్ జైట్లీ సైతం ఓటింగ్‌కు రాలేకపోయారు. ఇక ఆస్కార్ ఫెర్నాండెజ్‌తో సహా కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు, ఎన్సీపీ ఎంపీలు శరద్‌పవార్, ప్రఫుల్ పటేల్, ఐదుగురు ఎస్పీ నేతలతో సహా మొత్తం 20 మంది ప్రతిపక్ష ఎంపీలూ ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు చెందిన 11 మంది సభ్యుల అన్నాడీఎంకే, ఆరుగురు సభ్యుల జనతాదళ్, ఆర్జేడీకి చెందిన జెత్మలానీ ఓటింగ్‌లో పాల్గొనలేదు. దీంతో మొత్తం 57 మంది సభ్యులు ఓటింగ్‌కు దూరమైనట్లయింది. ఫలితంగా సభ్యుల సంఖ్య 183కు చేరి బిల్లు ఆమోదానికి కావాల్సిన ఓట్ల సంఖ్య 92కు పరిమితమయింది.

### బిల్లులో ఏముంది?

తలాక్–ఏ–బిద్దత్(తక్షణం మూడు సార్లు తలాక్ చెప్పడం)ను ఎస్‌ఎంఎస్, వాట్సాప్, రాతపూర్వకంగా, నోటి మాటతో లేదా ఇతర ఏ మార్గం/పద్ధతిలో చెప్పినా ఆ చర్య నేరమని ఈ బిల్లు చెబుతోంది. తక్షణం మూడుసార్లు తలాక్ చెప్పి భార్యలకు విడాకులిచ్చే ముస్లిం పురుషులకు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా నిబంధనలున్నాయి. ఎవరైనా ముస్లిం పురుషుడు తలాక్–ఏ–బిద్దత్ పద్ధతిలో భార్యకు విడాకులిచ్చాడని ఫిర్యాదు వస్తే, వారంట్ లేకుండానే అతణ్ని అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఈ బిల్లు కల్పిస్తోంది. అయితే బాధిత మహిళ లేదా ఆమె రక్త సంబంధీకులు లేదా అత్తింటివారు ఫిర్యాదు చేస్తే మాత్రమే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బాధిత మహిళ వాంగ్మూలాన్ని కూడా పరిశీలించిన తర్వాతనే జడ్జీలు అవసరం అనుకుంటే నిందితుడికి బెయిలు మంజూరు చేయవచ్చు. విడాకుల అనంతరం తాను, తన పిల్లలు బతకడానికి అవసరమైన భరణం ఇవ్వాలని భర్తను అడిగేందుకు మహిళలకు హక్కు ఉంటుంది.

### ట్రిపుల్ తలాక్ బిల్లు ఓటింగ్‌లో ప్రధాన పార్టీల వైఖరి

| అనుకూలం | వ్యతిరేకం | గైర్హాజరు |
|---|---|---|
| 1. బీజేపీ | 1. కాంగ్రెస్ | 1. అన్నాడీఎంకే |
| 2. శివసేన | 2. డీఎంకే | 2. జేడీయూ |
| 3. బీజేడీ | 3. ఎస్పీ | 3. టీఆర్‌ఎస్ |
| 4. అకాలీదళ్ | 4. వైఎస్సార్‌సీపీ | 4. టీడీపీ |



(కొన్ని పార్టీలు బిల్లును వ్యతిరేకించినా ఆ పార్టీలకు చెందిన కొందరు సభ్యులు గైర్హాజరయ్యారు)

### వ్యతిరేకంగా ఓటేసిన వైఎస్సార్‌సీపీ

బీజేపీకి 114 మంది సభ్యుల బలం ఉన్నా 11 మంది సభ్యులున్న అన్నాడీఎంకే, ఆరుగురు సభ్యుల జనతాదళ్ వ్యతిరేకిస్తూ బయటకు వెళ్లిపోవటం, మరికొందరు హాజరుకాకపోవటంతో సభ్యుల సంఖ్య 92కు తగ్గింది. ఇద్దరు సభ్యులున్న వైఎస్సార్‌సీపీ తొలి నుంచీ కనబరుస్తున్న వైఖరికి తగ్గట్టుగానే ఈ బిల్లును వ్యతిరేకించింది. సభలో ఉన్న పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. తటస్థ వైఖరితో ఉన్న ఏడుగురు సభ్యుల బిజూ జనతాదళ్ ఆఖరి క్షణంలో ఈ బిల్లుకు మద్దతిచ్చింది. దీంతో మద్దతిచ్చిన సభ్యుల సంఖ్య 99కి చేరింది. దీంతో బిల్లుకు అనుకూలంగా 99 – వ్యతిరేకంగా 84 ఓట్లు వచ్చాయి. బిల్లు గట్టెక్కింది.

### ముస్లింలపై దాడుల్లో ఓ భాగం: ఒవైసీ



**సాక్షి, న్యూఢిల్లీ:** ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ మంగళవారం ఆమోదం తెలపడంపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. 2014 నుంచి దేశంలో ముస్లింల పౌరసత్వం, గుర్తింపుపై జరుగుతున్న దాడుల్లో ఈ బిల్లు ఆమోదం ఒక భాగం మాత్రమేనని ఆయన విమర్శించారు. మూకదాడులు, పోలీసుల దురాగతాలు, సామూహిక ఖైదు తమను నిస్సహాయులను చేయలేవని పేర్కొన్నారు. రాజ్యాంగంపై ఉన్న బలమైన నమ్మకంతో అణచివేతకు, అన్యాయానికి, హక్కుల తిరస్కరణకు వ్యతిరేకంగా పోరాడతామని ఆయన ట్విట్టర్‌లో వెల్లడించారు. భారత రాజ్యాంగ బహుళత్వం, వైవిధ్య తను కాపాడేందుకు ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ చట్టం ముస్లిం మహిళలకు వ్యతిరేకమనీ, వారిని మరింత దీనావస్థలోకి నెడుతుందని ఒవైసీ అన్నారు.

### చారిత్రక తప్పిదాన్ని సరిచేశాం: మోదీ

ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదింపజేసుకోవడం ద్వారా పురాతన, మధ్యయుగ కాలం నాటి నుంచి ముస్లిం మహిళలకు జరుగుతున్న చారిత్రక తప్పిదాన్ని తాము సరిచేశామని ప్రధాని మోదీ అన్నారు. ఇకపై ట్రిపుల్ తలాక్ చెత్తబుట్టకు పరిమితమవుతుందన్నారు. బిల్లు ఆమోదం పొందిన అనంతరం మోదీ ఓ ట్వీట్ చేస్తూ 'ఈ రోజు ఇండియా సంతోషిస్తోంది. సమాజంలో లింగ సమానత్వం సాధనలో ఇదో విజయం. బిల్లుకు మద్దతు తెలిపిన ఎంపీలందరికీ ధన్యవాదాలు. బిల్లుకు అనుకూలంగా ఓటేసిన పార్టీల చర్య భారత చరిత్రలో నిలిచిపోతుంది. పురాతన, మధ్యయుగం నాటి విధానమొకటి ఎట్టకేలకు చెత్తబుట్టలోకి చేరింది. ముస్లిం మహిళలు సాధికారత సాధించడంలో, సమాజంలో వారికి సముచిత గౌరవాన్ని సంపాదించుకోవడంలో ఈ చట్టం సహాయపడుతుంది' అని వివరించారు.

### చందమామ ముందే పుట్టాడు



**బెర్లిన్:** చంద్రుడు ఉద్భవించిన కాలం గురించి ఇప్పటివరకు మనకి తెలిసినదంతా వాస్తవం కాదని తాజా పరిశోధనలో వెల్లడైంది. సౌర వ్యవస్థ ఏర్పడిన సుమారు 5 కోట్ల ఏళ్ల తర్వాత చంద్రుడు ఉద్భవించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇంతకు ముందు పరిశోధనల్లో సౌర వ్యవస్థ ఏర్పడిన సుమారు 15 కోట్ల ఏళ్ల తర్వాత చంద్రుడు పుట్టినట్లు అంచనా వేశారు. అయితే అది నిజం కాదని జర్మనీలోని కొలోన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అధ్యయనపూర్వకంగా కనుగొన్నారు. దీని ప్రకారం సుమారు 456 కోట్ల ఏళ్ల కింద సౌర వ్యవస్థ ఆవిర్భవించిందని, ఆ తర్వాత అంటే సౌర వ్యవస్థ ఏర్పడిన సుమారు 5 కోట్ల ఏళ్లకు చంద్రుడి ఉనికిలోకి వచ్చాడని వారు వెల్లడించారు. దీనికోసం అపోలో మిషన్ సమయంలో సేకరించిన రసాయనాలను విశ్లేషించారు. 1969 జూలై 21న మొదటిసారి చంద్రుడిపై అపోలో–11 మిషన్ ద్వారా మనిషి అడుగుపెట్టాడు. అక్కడ గడిపిన కొన్ని గంటల్లోనే వారు సుమారు 21.55 కిలోల మట్టిని తీసుకొచ్చారు. ప్రస్తుతం దీనిని విశ్లేషించే చంద్రుడి పుట్టుక గురించి కనుగొన్నారు. అలాగే చంద్రుడి వయసుని కనుగొనడం ద్వారా భూ గ్రహం ఎప్పుడు.. ఎలా పుట్టిందనే విషయాన్ని తెలుసుకోవచ్చని చెబుతున్నారు.

### ఉద్యోగాల కోత యోచన లేదు: రైల్వే

**న్యూఢిల్లీ:** రైల్వేలో 55 ఏళ్లు పైబడిన లేదా 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకునే ఉద్యోగులను ముందస్తు పదవీ విరమణ ద్వారా తొలగిస్తారని వస్తున్న వార్తలపై రైల్వే శాఖ స్పందించింది. ఉద్యోగులను తొలగించే ఉద్దేశమేమీ లేదని, సాధారణ సమీక్షలో భాగంగానే ఉద్యోగుల పనితీరును తెలుసుకునేందుకు జోనల్ కార్యాలయాలకు లేఖలు రాసినట్లు స్పష్టంచేసింది. దీంతో తప్పనిసరి పదవీ విరమణ చేయించడం ద్వారా రైల్వే పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగిస్తుందన్న ఊహాగానాలకు తెరపడింది. 'ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రైల్వే పాలనాయంత్రాంగం ఈ సమీక్ష చేపట్టింది. ఉద్యోగుల పనితీరును తెలుసుకునేందుకు చేపట్టే సాధారణ సమీక్షే ఇది. ఇందులో భాగంగానే జోన్, ప్రొడక్షన్ యూనిట్లకు లేఖలు రాశాం. గత సంవత్సరాల్లో కూడా ఇలాంటి రివ్యూలు జరిపాం' అని రైల్వేశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

### మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీలకు ఝలక్

**ముంబై:** మహారాష్ట్రలో కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లకు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు మంగళవారం తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. సెప్టెంబర్–అక్టోబర్‌లో జరగనున్న ఎన్నికల్లో వీరంతా బీజేపీ తరఫున పోటీ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. నవీ ముంబై ఎన్సీపీ నాయకుడు గణేశ్ నాయక్ కుమారుడు సందీప్, సతారా ఎమ్మెల్యే శివేంద్రసిన్హ్ భోసలే, ఎన్సీపీ నాయకుడు మధుకర్ పిచాడ్ కుమారుడు వైభవ్ పిచాడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కాళిదాస్‌లు తమ రాజీనామాలను అసెంబ్లీ స్పీకర్ హరిభౌ బగాడేకు సమర్పించారు.

### సీటెట్‌లో 3.52 లక్షల మందికి అర్హత

**న్యూఢిల్లీ:** సీబీఎస్‌ఈ నిర్వహించిన కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్)లో 3.52 లక్షల మంది అర్హత సాధించినట్లు సీబీఎస్‌ఈ బోర్డు వెల్లడించింది. ఈ పరీక్షకు 29.22 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా, జూలై 7న జరిగిన పరీక్షకు 23.77 లక్షల మంది హాజరయ్యారు. అందులో 2.15 లక్షల మంది పేపర్ 1 (1 నుంచి 5 తరగతులకు)లో అర్హత సాధించగా పేపర్ 2 (6 నుంచి 8 తరగతులకు)లో 1.37 లక్షల మంది అర్హత సాధించారు. వీరి మార్క్ షీట్లను డిజి లాకర్ ద్వారా అందుబాటులో ఉంచుతామని బోర్డు తెలిపింది.

### పాక్‌లో ఇళ్లపై కూలిన విమానం



విమానం కూలి ధ్వంసమైన ఇళ్లు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ సైన్యానికి చెందిన ఒక చిన్న సైనిక విమానం మంగళవారం తెల్లవారుజామున రావల్పిండిలోని నివాస ప్రాంతంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఐదుగురు సైనిక సిబ్బంది సహా 19 మంది మృతి చెందారు. పాకిస్తాన్ ఆర్మీ ఏవియేషన్ విమానం మోరా కలు గ్రామ శివారులో కూలడంతో ఐదారు నివాస గృహాలు ధ్వంసం అయ్యాయని పాకిస్తాన్ మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ తెలిపింది. ప్రమాదంలో ఇద్దరు పైలట్లతో సహా మొత్తం ఐదుగురు సిబ్బంది మరణించారని వెల్లడించింది. అయితే 19 మంది మృతదేహాలను ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు స్థానిక సహాయ ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో అగ్ని ప్రమాదం సంభవించింది.

# వినియోగదారులకు రక్షణ

**బిల్లుకు లోక్‌సభ ఆమోదం**





**న్యూఢిల్లీ:** వినియోగదారులకు మరిన్ని హక్కులు కల్పించేందుకు ఉద్దేశించిన కన్జ్యూమర్ ప్రొటెక్షన్ బిల్లు–2018కు మంగళవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా వస్తువులు, సేవల్లో లోపాలకు సంబంధించి వినియోగదారుల ఫిర్యాదులపై వెంటనే స్పందించేందుకు ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వినియోగదారుల ఫిర్యాదులపై నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కారం, వివాదాలకు మధ్యవర్తిత్వం అవకాశం కల్పించింది. లోక్‌సభ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఆహారం, వినియోగదారుల వ్యవహారాల మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ మాట్లాడుతూ..వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణ, సులభ పరిష్కారమే ఈ బిల్లు అంతిమ లక్ష్యమన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు వీలుగా 'వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మరియు ఫోరంలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పాటు కానున్నాయి. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, అమలు, ప్రోత్సాహం లక్ష్యంగా సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ(సీసీపీఏ) రూపుదాల్చనుంది. వినియోగదారులకు హాని కలిగించే ఉత్పత్తులను మార్కెట్ నుంచి ఉపసంహరించడం, సేవలు సరిగా లేని సందర్భాల్లో వినియోగదారునికి డబ్బు వాపసు చేయడం, వినియోగదారు కోరుకున్న వస్తువు లేదా ఉత్పత్తిని మాత్రమే తక్షణం అందేలా చూడటం సీసీపీఏ బాధ్యత. వినియోగదారులను ప్రకటనల ద్వారా తప్పుదోవ పట్టిస్తే ఆ ప్రకటన ఇచ్చిన వారిపై, ఉత్పత్తిదారుపై కఠిన చర్యలను ఈ బిల్లులో ప్రతిపాదించింది. ఏదైనా వస్తువు, ఉత్పత్తిలో లోపం లేదా సేవల కారణంగా వినియోగదారునికి నష్టం వాటిల్లినా సంబంధిత సంస్థలపై చర్యలుంటాయి. అంతేకాదు, ఫోన్లలో కాల్ డ్రాప్స్, కరెంట్ కోతలకు కారణమైన సంస్థలపైనా చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించారు. లాయర్లతో అవసరం లేకుండా వినియోగదారులు ఇంటి నుంచే ఫిర్యాదు చేసేందుకు ఈ బిల్లులో ప్రతిపాదనలున్నాయి. ఈ–కామర్స్ విధానంలో కొనుగోలు చేసిన వస్తువులు, ఉత్పత్తులకు రక్షణలున్నాయి. ప్రకటనలతో తప్పుదోవ పట్టించిన ఉత్పత్తి దారునికి రూ.10 లక్షల వరకు జరిమానాతోపాటు రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించే అధికారం సీసీపీఏకు ఉంది. వినియోగదారుల వివాదాల పరిష్కారానికి ఏర్పాటయ్యే జిల్లా కమిషన్లు రూ.కోటి, రాష్ట్ర కమిషన్లు రూ.10 కోట్ల వరకు, జాతీయ కమిషన్ రూ.10 కోట్ల పైబడిన వివాదాలను పరిశీలిస్తాయి.



60 నిమిషాల్లోపు 400లకుపైగా హాట్ ఎయిర్‌బెలూన్లను ఎగరేసి ప్రపంచ రికార్డు సృష్టించే ప్రయత్నంచేస్తున్న ఫ్రాన్స్ వాసులు. తూర్పు ఫ్రాన్స్ హాగ్‌విల్లేలో తీసిందీ ఫొటో.

### సీజేఐకి 'ఉన్నావ్' బాధితురాలి లేఖ

**నిందితున్ని ఇప్పటికే పార్టీ నుంచి బహిష్కరించాం: బీజేపీ**

**న్యూఢిల్లీ/లక్నో:** ట్రక్కు ప్రమాదానికి ముందే, తనకు ప్రాణహాని ఉందంటూ 'ఉన్నావ్' బాధితురాలు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది. బాధితురాలు, ఆమెకు చెందిన ఇద్దరు బంధువులు కలసి ఉత్తరప్రదేశ్ ఉన్నతాధికారులు, అలహాబాద్ కోర్టుతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయానికి లేఖ పంపిన విషయం వాస్తవమేనని సుప్రీంకోర్టు అధికారి స్పష్టం చేశారు. జూలై 12న హిందీలో వచ్చిన ఆ లేఖను నోట్ రూపంలో తనకు ఇవ్వాల్సిందిగా చీఫ్ జస్టిస్ గొగోయ్ సెక్రటరీ జనరల్‌ను కోరారన్నారు. యూపీ, ప్రభుత్వ విజ్ఞప్తిమేరకు ఈ కేసు విచారణను కేంద్రం సీబీఐకి అప్పగించింది.

**ఇప్పటికే బహిష్కరించాం: బీజేపీ**

'ఉన్నావ్' కేసులో ప్రధాన నిందితుడైన ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌ను 2018లోనే పార్టీ నుంచి బహిష్కరించామని ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు స్వతంత్ర దేవ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ బాధితురాలి వైపే ఉన్నాయన్నారు. మరోవైపు, ట్రక్ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన బాధితురాలు, ఆమె తరఫు లాయర్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ట్రక్ ప్రమాద ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే సెంగార్ సహా 10 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదైన సంగతి తెలిసిందే.

### బీజేపీలోకి కాంగ్రెస్ ఎంపీ సంజయ్ సిన్హ్

**రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా**



**న్యూఢిల్లీ:** గాంధీల కుటుంబానికి సన్నిహితుడు, అమేథీ రాజవంశానికి చెందిన సంజయ్ సిన్హ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజయ్ సిన్హ్ ప్రస్తుతం అస్సాం నుంచి కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయన పదవీకాలం మరో 9 నెలల్లో (2020 ఏప్రిల్‌కు) ముగియనుంది. అయితే కాంగ్రెస్ పార్టీతోపాటు తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసినట్లు సంజయ్ సిన్హ్ మంగళవారం ప్రకటించారు. బుధవారమే బీజేపీలో చేరతానని వెల్లడించారు. సంజయ్ సిన్హ్ గతంలోనూ బీజేపీలో ఉండి, కాషాయ పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికయ్యారు. అమేథీ ప్రాంతంలో సంజయ్ సిన్హ్‌కు చెప్పుకోదగ్గ పలుకుబడి ఉంది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ నియోజకవర్గం కూడా ఈ ప్రాంతం కిందకే వస్తుంది. ఇప్పుడు సంజయ్ బీజేపీలో చేరుతుండటంతో అమేథీ ప్రాంతంలో తమకు బలం పెరుగుతుందని బీజేపీ విశ్వసిస్తోంది. రాజ్యసభ ఎన్నికల్లోనే సంజయ్ సిన్హ్‌ను మళ్లీ గెలిపించి, రాజ్యసభలోనూ తమ సంఖ్య పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది.

## 'టిప్పు జయంతి' రద్దు

**కర్ణాటకలో యడియూరప్ప ప్రభుత్వం కీలక నిర్ణయం**

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో అధికారంలోకి వచ్చీ రాగానే యడియూరప్ప ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 18వ శతాబ్దంలో మైసూరు సామ్రాజ్యాన్ని పాలించిన రాజు టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. టిప్పు సుల్తాన్ జయంతి నాడు గతంలో కొడగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో హింస చెలరేగిందని.. భవిష్యత్‌లో ఇలా జరగకుండా ఉండాలంటే దీనిని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యే కె.బోపయ్య ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు లేఖ రాశారు. దీనిపై కేబినెట్‌లో చర్చించిన అనంతరం టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను రద్దు చేయాలని నిర్ణయించినట్లు యడియూరప్ప తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మాజీ సీఎం సిద్ధరామయ్య మండిపడ్డారు. మైసూరు అభివృద్ధికి పాటుపడిన గొప్ప వ్యక్తి టిప్పు అని.. ఆయన జయంతిని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. టిప్పు మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. కాగా, సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏటా నవంబర్ 10న రాష్ట్రంలో టిప్పు జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకలను రద్దు చేయాలంటూ 2015 నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే టిప్పు జయంతిని రద్దు చేస్తున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించడం చర్చనీయాంశమైంది.

**తదుపరి స్పీకర్ విశ్వేశ్వర్ హెగ్డే!**



హెగ్డేతో యడియూరప్ప

కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేష్ రాజీనామా చేయడంతో కొత్త స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. సభాధ్యక్ష స్థానానికి నామినేషన్ దాఖలు చేయడానికి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు గడువు ఉండగా బీజేపీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ హెగ్డే కాగేరి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. నామినేషన్ వేసే సమయంలో ఆయనతోపాటు రాష్ట్ర సీఎం యడియూరప్ప, తదితరులు ఉన్నారు. బీజేపీకి తగినంత మెజారిటీ ఉండడంతో కాంగ్రెస్, జేడీఎస్‌లు స్పీకర్ పదవికి ప్రయత్నం చేయలేదు. అంకోలా నియోజక వర్గం నుంచి హెగ్డే 1994 నుంచి ఆరుసార్లు వరుసగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

# స్పీకర్ అధికారం మాకెందుకు?

**'ఎమ్మెల్యేలపై అనర్హత' అంశంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించేందుకు స్పీకర్‌కు ఉన్న అధికారాన్ని లాగేసుకునే సాహసం తామెందుకు చేయాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద రాజ్యాంగమే ఆ అధికారాన్ని శాసనసభ స్పీకర్‌లకు ఇచ్చిందని తెలిపింది. తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం సహా 11 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ డీఎంకే నేత చక్రపాణి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం..'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపులకు పాల్పడిన వారిని అనర్హులుగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంది. ఈ అధికారాన్ని న్యాయస్థానం ఎలా తీసుకుంటుంది' అని ప్రశ్నించింది. అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోని పరిస్థితుల్లో కోర్టులే నిర్ణయించాలంటూ పిటిషనర్ తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ వాదించగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేసింది. గత ఏడాది విశ్వాస పరీక్ష సందర్భంగా సీఎం పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసిన పన్నీరుసెల్వంతోపాటు మరో 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని చక్రపాణి తన పిటిషన్‌లో కోరారు. మరోవైపు, ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు రిజర్వేషన్ కోటాను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి పంపాలా వద్దా అనేది వాదనల తర్వాత నిర్ణయిస్తామని మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల కోసం ప్రభుత్వం చేసిన 103వ రాజ్యాంగ సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం మంగళవారం వాదనలు వింది.



### ఇంతకంటే ముఖ్యమైంది మరేదీ లేదు

**న్యాయవ్యవస్థలో ఖాళీల భర్తీపై...**

దేశవ్యాప్తంగా దిగువ కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మించిన ముఖ్య విషయం మరేదీ లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో ఉన్న 24 హైకోర్టులు పోస్టుల భర్తీపై చేపట్టిన చర్యలను సమీక్షిస్తూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దేశంలోని వివిధ కోర్టుల్లో 5 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 'ఇంతకంటే ముఖ్యమైంది మరేదీ లేదు. అవసరమైతే రోజంతా విచారణ జరుపుతాం' అని ధర్మాసనం పేర్కొంది. యూపీ, మహారాష్ట్ర, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాల్లో ఖాళీల పరిస్థితిని సమీక్షించింది. ఈ సందర్భంగా కొందరు రిజిస్ట్రార్ జనరళ్లు మరింత సమయం కావాలని కోరడంతో ధర్మాసనం నిరాకరించింది. గడువులోగా భర్తీ చేయాలని తేల్చింది. యూపీలో 329 మంది అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జీల భర్తీ ప్రక్రియకు పోలీస్ వెరిఫికేషన్ మాత్రమే మిగిలి ఉందని, మరో మూడు నెలల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అందుకు ధర్మాసనం ససేమిరా అంది.

సాక్షి
బుధవారం, జూలై, 31

# ఇంత దారుణమా!

ప్రభుత్వాలు ఏం చెబుతున్నా, నాయకులు ఎలాంటి హామీలిస్తున్నా వాస్తవంలో జరిగేదేమిటో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార బాధితురాలి కుటుంబంపై గత రెండేళ్లనుంచి నిరంతరాయంగా సాగుతున్న అఘాయిత్యాలు గమనిస్తే తేటతెల్లమవుతుంది. ఆ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది మొదలుకొని ఆ కుటుంబం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆమె తన తండ్రిని, బాబాయిని కోల్పోయింది. నిరంతరం బెదిరింపులు ఎదుర్కొంటూనే ఉంది. చివరికిప్పుడు ఆ బాలిక న్యాయస్థానానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా 'రోడ్డు ప్రమాదం'లో చిక్కుకుని చావు బతుకుల్లో ఉంది. ఆమెతో పాటు ప్రయాణిస్తున్న పిన్ని, మేనత్త ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మరణించగా వారి న్యాయవాది పరిస్థితి సైతం ఆందోళనకరంగా ఉంది. ఆ కుటుంబంపై ఇంత వరకూ జరిగిన నేరాలూ, ఘోరాలు గమనిస్తే అసలు మనం ఏ యుగంలో ఉన్నామన్న అనుమానం తలెత్తుతుంది. మన దేశంలో మైనర్లపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు విధించే పోక్సో చట్టం ఉంది. తమ ప్రాణాలకు ముప్పు ఉన్నదని అత్యాచార బాధితులు ఫిర్యాదు చేసిన పక్షంలో ఉన్నత స్థాయి పోలీసు అధికారులు దాన్ని స్వయంగా పరిశీలించి, వెనువెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మార్గదర్శకాలున్నాయి. కానీ ఆ నిస్సహాయ బాలిక కుటుంబానికి ఏదీ అక్కరకు రాలేదు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా మన నేతల నోట 'చట్టం తన పని తాను చేసుకుపోతుంద'న్న గంభీరమైన పలుకులు వినిపిస్తాయి. ఈసారీ అవే వినిపించాయి. నిజమే... ఉత్తరప్రదేశ్‌లో గత రెండేళ్లుగా అది తనకలవాటైన పద్ధతిలోనే 'పని' చేస్తూ పోతోంది. ఆ బాలిక కుటుంబం మాత్రం బిక్కుబిక్కుమంటూ బతుకుతోంది.

ఈ ఘటనల క్రమం గమనిస్తే ఎవరికైనా దిగ్భ్రాంతి కలుగుతుంది. మొదట 2017 జూన్‌లో ఆ బాలికను అపహరించి పది రోజుల తర్వాత వేరే ఊళ్లో ఎక్కడో దుండగులు వదిలేసి పోయినప్పుడు ఆమె స్థానిక ఎమ్మెల్యే కులదీప్ సెంగార్ మనుషులు తనను అపహరించారని ఆరోపించింది. తనపై ఆ ఎమ్మెల్యే, అతని సోదరుడు రోజుల తరబడి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారని రోదించింది. ఎక్కడా నోరెత్తకుండా ఉంటే ఉద్యోగం చూపిస్తామన్నారని తెలిపింది. ఇవన్నీ ఆమె కుటుంబం ఫిర్యాదులో పొందుపరిస్తే పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్‌లో వేరేవిధంగా నమోదు చేశారు. ఆమెను అపహరించడం (ఐపీసీ సెక్షన్ 363), బలవంతంగా పెళ్లాడేందుకు ప్రయత్నించడం(ఐపీసీ సెక్షన్ 366) వంటి ఆరోపణలు మాత్రమే అందులో ఉన్నాయి. ఆ ఫిర్యాదు చేసింది మొదలు ఆ కుటుంబం నరకాన్ని చవిచూసింది. స్థానిక పోలీసులు కుమ్మక్కయ్యారన్న అనుమానంతో సీఎం మొదలుకొని ఉన్నతాధికారుల వరకూ ఆ బాలిక లేఖలు రాస్తూనే ఉంది. గత్యంతరం లేక ఆ బాలిక తల్లి న్యాయస్థానంలో కేసు దాఖలు చేస్తే ఆ తర్వాత కూడా జరిగిందేమీ లేదు. చివరకు న్యాయస్థానానికెళ్లొస్తున్న ఆ కుటుంబంపై 'గుర్తు తెలియని వ్యక్తులు' దాడి చేసి తండ్రిని తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత పోలీసులకు అప్పజెప్పారు. వారు అతని దగ్గర అక్రమ ఆయుధాలున్నాయంటూ కేసు పెట్టారు. ఎమ్మెల్యే సోదరుడి నాయకత్వంలోని గూండాలు తనపై దాడి చేసి కొట్టారని నెత్తురు కక్కుకుంటూ ఆయన చెప్పిన మాటలు వీడియోలో రికార్డయ్యాయి. అవి మీడియాలో వెల్లడై నిరసనలు పెల్లుబికాక ఎమ్మెల్యే సోదరుణ్ణి అరెస్టు చేశారు. నిరుడు ఏప్రిల్‌లో యోగి ఆదిత్యనాథ్ ఇంటి ముందు ఆమె ఆత్మహత్యాయత్నం చేశాక ఈ ఘోరాలన్నీ మీడియాలో ప్రముఖంగా వచ్చాయి. ఆ తర్వాతగానీ ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదు కాలేదు. ఈలోగా తీవ్రంగా గాయపడిన ఆమె తండ్రి సరైన వైద్యసాయం అందక మరణించాడు. ఈ కేసు రోజురోజుకీ తీవ్రమవుతున్నదని అర్థమయ్యాక రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఆ తర్వాత చాన్నాళ్లకు ఎమ్మెల్యే అరెస్టయ్యాడు. ఎమ్మెల్యేకు సహకరించి, అత్యాచారానికి తోడ్పడిందన్న ఆరోపణపై ఒక మహిళను కూడా అరెస్టు చేశారు. ఇంతలోనే కేసులో సాక్షిగా ఉన్న ఒకరు అనుమానాస్పద స్థితిలో మరణించారు.

నిజమే... ఆరోపణలొచ్చినంత మాత్రాన ఎవరూ దోషి కాదు. అవి కోర్టులో రుజువయ్యేవరకూ ఎవరైనా నిర్దోషే అని మన చట్టాలు చెబుతాయి. కానీ అసలు ఫిర్యాదులొచ్చినప్పుడు కేసు నమోదు చేయకపోతే, నిందితుడిని కనీసం అదుపులోనికి తీసుకుని ప్రశ్నించకపోతే ఏమనాలి? బాధితురాలి కుటుంబానికి నిరంతరం బెదిరింపులు రావడం, ఆ కుటుంబంలోనివారిపై వరసగా దాడులు జరగడం ఎలా అర్థం చేసుకోవాలి? తనపై అత్యాచారం జరిగిందని ఆ బాలిక ఆరోపించేనాటికే పోక్సో చట్టం ఉనికిలో ఉంది. దాన్ని మరింత కఠినం చేస్తూ రెండు దఫాలు చట్ట సవరణలు కూడా తీసుకొచ్చారు. నిర్దిష్ట వ్యవధిలో ఇలాంటి కేసుల విచారణ పూర్తయి నిందితులకు శిక్షపడాలని అందులో నిర్దేశించారు. కానీ బాలిక కుటుంబం వరస దాడులతో తల్లడిల్లుతూనే ఉంది. వీటన్నిటికీ పరాకాష్టగా ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితురాలికి రక్షణగా ఉండాల్సిన పోలీసులు ఆ వాహనంలో లేకపోవడం, అందుకు పొంతన లేని కారణాలు చెబుతుండటం గమనిస్తే ఇది హత్యాయత్నమని ఎవరికైనా అనుమానం కలగకమానదు. ఎమ్మెల్యేపై హత్య, హత్యాయత్నం కేసులు కూడా నమోదయ్యాయి. కానీ ఆ రాష్ట్ర అదనపు డీజీపీకి మాత్రం ఇది ప్రమాదంగానే కనబడుతోంది! ఏడేళ్లక్రితం దేశ రాజధాని నగరంలో నిర్భయ ఉదంతం జరిగాక నేరగాళ్లకు కఠినమైన శిక్షలతో నిర్భయ చట్టం వచ్చింది. కానీ ఆచరణలో బాధిత కుటుంబాలకు న్యాయం ఎండమావే అవుతోందని ఉన్నావ్ ఉదంతం నిరూపిస్తోంది. ఎమ్మెల్యేపై వెనువెంటనే కేసు నమోదయ్యేలా, ఆయన అరెస్టయ్యేలా చర్యలు తీసుకోవడంలో యోగి సర్కారు మొదట్లో తాత్సారం చేయడంవల్లే ఇన్ని దారుణాలు చోటుచేసుకున్నాయి. ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని తగిన ఆదేశాలిచ్చి బాధిత కుటుంబానికి రక్షణగా నిలవాలి. న్యాయం దక్కేలా చూడాలి.

# కరుగుతున్న హిమనదాలు

**ఐస్‌లాండ్ ప్రాంతంలో కనుమరుగైపోయిన తొలి హిమానీనదానికి స్మారక స్థూపం ఏర్పాటు చేయనుండటం, 200 ఏళ్లలో మంచుదిబ్బలన్నింటికీ ఇదే గతి పట్టనుందని చెప్పడం ప్రమాద హెచ్చరికే. మన హిమాలయాలు భూమ్మీద లభిస్తున్న స్వచ్ఛమైన జలంలో 40 శాతాన్ని కలిగి ఉంటున్నాయి. కానీ ఇక్కడ 50,000 కంటే ఎక్కువ సంఖ్యలో మంచుదిబ్బలు శరవేగంతో కరిగిపోతున్నాయని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వారి అంచనా. ఇవి అంతరిస్తున్న వేగాన్ని చూస్తుంటే, ఈ అత్యున్నత పర్వత శ్రేణికి ఇరువైపులా నివసిస్తున్న 130 కోట్లమంది ప్రజల జీవితాల్లో విధ్వంసం సృష్టించడం ఖాయమనే తెలుస్తోంది. హిమానీనదాలు కరిగిపోతుండటం జాతికి షాక్ కలిగించాల్సి ఉండగా రాజకీయనేతలు, పత్రికలు, ప్రజలు ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరం. చెన్నయ్‌లో తాజా జల సంక్షోభం అందరికీ గుణపాఠం కావాలి.**

విశ్లేషణ



దేవీందర్ శర్మ

అంతరించిపోయిన హిమానీనదానికి ఒక విషాద భావగీతం. అవును. ప్రస్తుతం ఐస్‌లాండ్ శాస్త్రజ్ఞులు సరిగ్గా దీనికే పథకం రచిస్తున్నారు. పశ్చిమ ఐస్‌లాండ్ ప్రాంతంలో కనుమరుగైపోయిన మొట్టమొదటి హిమానీనదానికి గుర్తుగా ఆగస్టు 18న ఒక స్మారక స్తూపం ఏర్పర్చడానికి రైస్ యూనివర్సిటీ, ఐస్‌లాండ్ దేశం కలిసి ప్లాన్ చేస్తున్నాయి. ఆ మంచుదిబ్బ పేరు 'ఒకే'. ఆ స్మారకచిహ్నం ఫలకంపై పొందుపరుస్తున్న సందేశం మనందరినీ తీవ్రంగా హెచ్చరిస్తోంది. 'హిమానీనదంగా తన ప్రతిపత్తిని కోల్పోతున్న మొదటి ఐస్‌లాండ్ మంచుదిబ్బ ఒకే. రాబోయే 200 ఏళ్లలో మన హిమానీనదాలన్నీ ఇదే మార్గం అనుసరించనున్నాయి. మనకు ఏం జరగబోతోందో, మనం ఏం చేయాల్సి ఉందో మనకు స్పష్టంగా తెలుసని ఈ స్మారకస్తూపం గుర్తు చేస్తోంది. మనం దాన్ని చేస్తామా అన్నది లేదా అనేది కూడా మనకే తెలుసు''

### మంచుదిబ్బలు కాదు కరుగుతున్నది భవిష్యత్తు!

ఐస్‌లాండ్ దేశంలోని ఒకే హిమానీనదం ఆ దేశం నుంచి అంతరించిపోతున్న తొలి మంచుదిబ్బ. కానీ ఇది చివరిదేమీ కాదు. వచ్చే 200 సంవత్సరాల్లో ఐస్‌లాండ్ దేశంలోని మంచుదిబ్బలన్నీ అంతర్ధానం కానున్నాయని ఆ స్మారక స్తూప ఫలకం ప్రకటిస్తోంది. అయితే 30 ఏళ్ల తర్వాత అంటే 2050లో ఈ స్మారక స్తూప సందేశాన్ని చూడబోయే ప్రజలందరూ ఒకే హిమానీనదానికి ఆ గతి పట్టించినందుకు ప్రస్తుత తరాన్ని శపించడం ఖాయం. మంచుదిబ్బను కరగదీయడం ద్వారా అత్యంత వేడి, పొడి వాతావరణం కలిగిన భూగ్రహాన్ని మనం భవిష్యత్ తరాలవారికి అందించనున్నాం. ఈ ప్రపంచంలో సంతోషభరితంగా జీవించే అవకాశాన్ని, వారికి దక్కాల్సిన వాటాను మనం దూరం చేసేస్తున్నాం.

అంతరించిపోతున్న హిమానీనదాలకు స్మారకస్తూపాలను నెలకొల్పడం నిజంగానే అద్భుతమైన ఆలోచన. అలా మంచుదిబ్బలకు స్మారక స్తూపాలను నిర్మించడం సరైనదే అయినట్లయితే, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, భారతదేశం, నేపాల్, భూటాన్, చైనా దేశాల్లో విస్తరించిన హిమాలయ పర్వత శ్రేణుల పొడవునా మనం అనేక స్మారకస్తూపాలను నిర్మించవలసి ఉంటుంది. ప్రపంచంలోనే అతి పెద్ద జలగోపురంగా పేరొందిన హిమాలయాలు భూమ్మీద లభిస్తున్న స్వచ్ఛమైన జలంలో 40 శాతాన్ని కలిగి ఉంటున్నాయి. కానీ ఇక్కడ 50,000 కంటే ఎక్కువ సంఖ్యలో మంచుదిబ్బలు శరవేగంతో కరిగిపోతున్నాయని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌డీపీ) వారి అంచనా. ఇవి అంతరిస్తున్న వేగాన్ని చూస్తుంటే, ఈ అత్యున్నత పర్వత శ్రేణికి ఇరువైపులా నివసిస్తున్న 130 కోట్లమంది ప్రజల జీవితాల్లో విధ్వంసం సృష్టించడం ఖాయమనే తెలుస్తోంది.

### మూడో ధ్రువం కరిగితే పెనుముప్పే

అంటార్కిటికా, ఆర్కిటిక్ ఖండాల తర్వాత అతిపెద్ద స్థాయిలో మంచును కలిగి ఉన్న మూడో భూభాగంగా హిమాలయాలు గుర్తింపు పొందాయి కాబట్టి దీనిని మూడవ ధ్రువ ప్రాంతం అని పిలుస్తున్నారు. అందుచేత భూగ్రహంలోని అంటార్కిటికా, ఆర్కిటిక్ ధ్రువప్రాంతాలే కాకుండా హిమాలయాలు కూడా వాటికి సమాన స్థాయిలో కరిగిపోయే ప్రమాదం స్పష్టంగానే కనిపిస్తోంది. అయితే హిమాలయాలు యూరోపియన్ ఆల్ప్స్ పర్వతాలతో సమాన వేగంలో కరిగిపోవడం లేదు. గత దశాబ్దకాలంలో ఆల్ప్స్ పర్వత శ్రేణిలోని అనేక హిమానీనదాలు పూర్తిగా



అంతరించిపోయాయి. దక్షిణాసియాలో కంటే యూరప్‌లో చాలా త్వరగా ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభించడమే దీనికి కారణం కావచ్చు.

కాకపోతే, 2000 సంవత్సరం నుండి హిమాలయాలు ప్రతి సంవత్సరం ఒకటిన్నర అడుగు కంటే ఎక్కువ స్థాయిలో మంచును కోల్పోతున్నాయని ఇటీవలే కొలంబియా యూనివర్సిటీకి చెందిన లేమోంట్–డొహెర్టీ ఎర్త్ అబ్జర్వేటరీ నిర్వహించిన సమగ్ర అధ్యయనం భారత్‌లో ఆగ్రహావేశాలను ప్రేరేపిస్తుందని నేను ఊహించాను. దీనికి ముందుగా 1975 నుంచి 2000 సంవత్సరం వరకు హిమాలయాల్లో ప్రతి ఏటా 10 అంగుళాల మేరకు మంచు కరుగుతూ వచ్చింది. అయితే తాజా అధ్యయనం ఆసియాలోని పామిర్, హిందూ కుష్, టియాన్ షాన్ అత్యున్నత పర్వత శ్రేణులను తన పరిశీలనాంశంగా చేర్చలేదు. ఈ స్థాయిలో హిమాలయాలు కరుగుతూ రావడం మొత్తం ఆసియా ప్రాంతానికి విధ్వంసకరంగా పరిణమించనుంది. హిమాలయాల్లో హిమానీనదాలు ప్రమాదకరంగా కరిగిపోవడం జాతికి వాస్తవంగా షాక్ కలిగించాలి. ప్రత్యేకించి హిందీ ప్రాబల్య ప్రాంతంలోని ప్రజలకు ఇది భారీ నష్టాన్ని కలిగించనుంది. కానీ అరుదుగా కొన్ని పతాక శీర్షికల్లో ప్రస్తావించడం తప్పితే దేశప్రజల్లో ఈ పరిణామం ఎలాంటి ఆగ్రహాన్ని కలిగించలేదు. ఈ సమస్యను తమ సంపాదకీయాల్లో ప్రస్తావించడానికి తగినదేనని వార్తా పత్రికలు కనీసం ఆలోచించలేదు. ఇక టీవీ చానెల్స్ అయితే అసందర్భమైన రాజకీయ ప్రకటనలతో చొంగకార్చుకోవడంలో బిజీగా ఉండిపోయాయి.

### చెన్నై జల సంక్షోభం నుంచి నేర్చుకోమా?

హిమాలయ ప్రాంతంలో విస్తరించిన 650 హిమానీనదాలపై సాధారణంగా ఉపగ్రహాలు తీసే ఫొటోలతోపాటు, అమెరికన్ గూఢచర్య ఉపగ్రహాలు తీసిన ఫొటోలను కూడా వర్గీకరించి చేసిన పై అధ్యయనం ప్రకారం ప్రతి సంవత్సరం హిమాలయాలు 800 కోట్ల లీటర్ల నీటిని కోల్పోతున్నాయని తెలిసింది. అంటే ప్రతి సంవత్సరం ఒలింపిక్ పరిమాణంలోని 32 లక్షల స్విమ్మింగ్ పూల్స్‌లలోని నీటికి సమానమైన నీటిని హిమాలయాలు కోల్పోతున్నాయి. దక్షిణ భారతదేశంలోని చెన్నయ్‌లో ఇటీవల సంభవించిన జల సంక్షోభం కలిగించిన షాక్‌ని చూస్తే హిమాలయాల్ని కప్పి ఉంచిన మంచు కరిగిపోతుండటం పట్ల మనందరం కూర్చుని ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఇది మనందరి భవిష్యత్తుతో ముడిపడిన సమస్య కాబట్టి, మన పిల్లలకు మనం విడిచివెళుతున్న జల రహిత ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి ప్రజలు తప్పకుండా ఆందోళన చెందాల్సి ఉంటుంది. బలమైన ప్రజాభిప్రాయం జాతి మొత్తాన్ని ప్రకంపింపచేయాలి. ఈ విషయమై భారత పార్లమెంటు కూడా అత్యవసర అర్ధరాత్రి సెషన్‌కు కూర్చోవాలి.

కానీ ఏమీ జరగలేదు. లభ్యమవుతున్న సాగునీటిలో 78 శాతం నీటిని వ్యవసాయ రంగం దుర్వినియోగపరుస్తోందని దెప్పడం మినహా, జీవితం సజావుగానే సాగిపోతోంది. ఈలోగా హిమాలయాల్లో భాగంగా ఏర్పడిన అతి ముఖ్యమైన సింధు, గంగ, బ్రహ్మపుత్ర నదీపరివాహక ప్రాంతాల్లో నీరు క్షీణించిపోతోందని కేంద్ర జల కమిషన్ అధ్యయనం హెచ్చరిస్తోంది. ఇవి ఈశాన్య భారత్, కొంతవరకు మధ్యభారత్ ప్రాంత ప్రజాజీవనానికి అత్యవసర వనరులు. కానీ ఇక్కడ కూడా నీటి లభ్యత తగ్గిపోతుండటం ఎవరూ గుర్తించడం లేదు. ఈ మూడు నదీ పరివాహక ప్రాంతాల్లో సగటున నీటి లభ్యత ఇప్పటికే 40 శాతం క్షీణించిపోయింది. ఇక నదీ పరివాహకప్రాంతం క్షీణించిపోవడంతో తూర్పు, ఉత్తర భారత ప్రాంతంలో 628 చదరపు కిలోమీటర్ల పొడవునా అడవులు హరించుకుపోయినట్లు 2015 అటవీ నివేదిక తెలిపింది.

### ఈ తరం తప్పులతో భవిష్యత్ తరాల బలి

ఇలాంటి పరిస్థితుల్లో ఎండిపోతున్న నదుల దిగువ ప్రాంతంలో వ్యవసాయాన్ని, పరిశ్రమలను, తాగునీటి వసతులను దెబ్బతీస్తున్న జల సంక్షోభం నేపథ్యంలో జీవనం సాగిస్తున్న వందల కోట్లమంది ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో హిమాలయన్ రాష్ట్రాలుగా పేరొందిన జమ్మూ– కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్, మేఘాలయ, అసోం, త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్‌లు తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న కొండ ప్రాంతాల పరిరక్షణకు కలిసికట్టుగా ఒక విధానాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయిదేళ్ల క్రితం కేదార్‌నాథ్‌లో సంభవించిన విధ్వంసం పునరావృతం కాకుండా అనువైన పథకాలు రూపొందించడం, నదీపరివాహక ప్రాంతాల పరిరక్షణ కోసం సామూహికంగా మదుపులు పెట్టడంపై ఈ రాష్ట్రాలన్నీ దృష్టి సారించాల్సి ఉంది. పర్వతాలు అందించే పర్యావరణ వ్యవస్థ సేవలకు చెందిన ఆర్థిక విలువను మదింపు చేస్తున్న క్రమంలో నీరు, వృక్షాల పరిరక్షణ, నేల కోత నివారణ, వన్యమృగాల పరిరక్షణ వంటి సేవలను తప్పకుండా మిళితం చేయాలి. వీటిని అంతిమంగా రాష్ట్రాల బడ్జెట్ అంచనాల్లో భాగం చేయాలి. పర్వతాలు అందించగలిగే ఆర్థిక సంపదను కొలిచే కొలమానం ఇదే. అభివృద్ధి పేరుతో ఇంతకాలంగా సాగిస్తూ వచ్చిన కొండల్ని కొల్లగొట్టే ప్రక్రియలకు వెంటనే చెల్లుచీటీ చెప్పాలి. పర్వత ప్రాంత రాష్ట్రాల అభివృద్ధికి ఇది నిజంగానే ఒక వినూత్న మార్గంగా ఉపయోగపడుతుంది. ప్రకృతి, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంపైనే పర్వత ప్రాంత రాష్ట్రాలు మనగలుగుతాయి. దీనికి తోడుగా మన పరిశోధనా విధానాలు కూడా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. మైదాన ప్రాంతాల్లో సాగించే పరిశోధనా పద్ధతులను నకలు చేస్తూ పర్వతప్రాంతంలో మన యూనివర్సిటీలు యథాతథంగా అమలు చేయడంలో ఎలాంటి సంబద్ధతా లేదు.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### ట్రిపుల్



"ట్రిపుల్ తలాక్ బిల్ పాసైంది. ముస్లిం మహిళల జీవితాలకు సంబంధించి ఇదొక చారిత్రక సందర్భం. సమాజం ఒక డుగు ముందుకు వేసినట్టయ్యింది. నేను చిన్నప్పుడు చూసిన నిఖా అనే సినిమా గుర్తుకు వస్తోంది. 'తలాక్ తలాక్ తలాక్' అనే మాటలు ఒక మహిళను ఎంత మానసిక వేదనకు గురిచేస్తాయో తెలిసి చాలా ఆందోళన చెందా"

– సధావి ఖోస్లా, హక్కుల కార్యకర్త

### సేమ్ టు సేమ్



"విదేశంలోని ఒక హోటల్ నుంచి అనేక వస్తువులు దొంగతనంగా తీసుకువెళుతూ దొరికిపోయిన భారతీయుల వీడియో చూసి చాలామంది బాలీవుడ్ సెలబ్రిటీలు తాము సిగ్గుపడుతున్నామనీ, అవమానకరంగా భావిస్తున్నామని వ్యాఖ్యానిస్తున్నారు. వీళ్లు విదేశీ సినిమాల నుంచి, మ్యూజిక్ నుంచీ దొంగతనానికి పాల్పడినప్పుడు మనమంతా కూడా అలాగే ఫీలవుతామని ఎప్పుడు తెలుసుకుంటారో"

– ఏకిత, దంత వైద్యురాలు

### చట్టం



"అత్యాచారానికి గురైన బాలికను, ఆమె కుటుంబ సభ్యులను కాపాడటంలో ప్రభుత్వం, చట్టం విఫలమయ్యాయనడానికి ఇదొక ఉదాహరణ. రాజకీయాలు, నైతికత, మానవత్వం దిగజారుడుతనానికి ఈ సంఘటన నిదర్శనం. ధనాన్ని, నేరాల్ని రాజకీయాల నుంచి విడదీయాల్సిఉంది"

– కైలాష్ సత్యార్థి
బాలల హక్కుల కార్యకర్త

### కమిటీలు



"పని స్థలాల్లో లైంగిక వేధింపుల కమిటీ, మూక దాడుల నిరోధం కమిటీలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వం వహిస్తున్నారు. భవిష్యత్‌లో ఆయన ఎన్‌కౌంటర్‌లను అదుపు చేసే కమిటీ, న్యాయమూర్తుల రక్షణ కమిటీ వంటి వాటికి కూడా నాయకత్వం వహించే అవకాశం ఉంది"

– శ్రీవత్స, కాంగ్రెస్ నేత

### సంతోషం



"ప్రపంచ సంతోష సూచిక–2019 విడుదలైంది. ఆ సూచిక ప్రకారం సంతోషకరమైన దేశాల్లో పాకిస్తాన్ 67వ స్థానంలో ఉండగా, భూటాన్ 95, నేపాల్ 100, బంగ్లాదేశ్ 125, శ్రీలంక 130 స్థానాల్లో ఉన్నాయి. ఘనత వహించిన మనదేశం మాత్రం 140వ స్థానంలో ఉంది. ద్వేషాన్ని చిమ్మి సంతోషంగా ఉండటంలో మనమే నంబర్ వన్"

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢమాసం, తిథి బ.చతుర్దశి ఉ.11.05 వరకు తదుపరి అమావాస్య, నక్షత్రం పునర్వసు ప.2.54 వరకు తదుపరి పుష్యమి, వర్జ్యం రా.10.29 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ప.11.41 నుంచి 12.30 వరకు అమృతఘడియలు... ప.12.35 నుంచి 2.05 వరకు.

**సూర్యోదయం :** 5.41
**సూర్యాస్తమయం :** 6.31
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

## ఉపాధ్యాయ అర్హత పరీక్షకు గ్రహణం

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు గ్రహణం పట్టింది. రెండేళ్లుగా ప్రభుత్వం టెట్‌ను నిర్వహించడంలేదు. ఓవైపు టీఆర్‌టీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతినివ్వడంతో పాటు మరోవైపు బీసీ గురుకులాల్లోనూ టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటోంది. కానీ, ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు తప్పనిసరిగా క్వాలిఫై కావాల్సిన టెట్ గురించి మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కలిపి ఆరుసార్లు టెట్ నిర్వహించారు. ఒక్కసారి టెట్‌లో అర్హత సాధిస్తే ఏడేళ్లపాటు చెల్లుతుంది. అయితే ఆరు టెట్‌లలో మొదటి మూడింటి చెల్లుబాటు గడువు ఇప్పటికే ముగిసింది. పైగా తెలంగాణలో టెట్ నిర్వహించి సోమవారంతో రెండేళ్లు పూర్తయినా, విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. దీంతో టెట్ నిర్వహించకుండానే గురుకుల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తారేమోనని నిరుద్యోగుల ఆందోళన. కాగా ప్రభుత్వం ఇటీవల టీఆర్‌టీ ద్వారా 1698 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. దాంతో ప్రస్తుతం గురుకుల టీచర్ పోస్టులకైనా ప్రిపేర్ కావాలనే ఉద్దేశంలో అభ్యర్థులు ఉన్నారు. కానీ మొదటి మూడు టెట్‌లలో కలిపి తెలంగాణలో రెండు లక్షల మంది అభ్యర్థులు టెట్ వ్యాలిడిటీని కోల్పోయారు.

తెలంగాణలో మొదటిసారిగా 2016 మే, 2017లో టెట్ నిర్వహించారు. తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఈ రెండేళ్లలో బీఎడ్, డీఎడ్ పాసయిన వారి సంఖ్య 50 వేలకు పైగా ఉంటుంది. టెట్ వ్యాలిడిటీ కోల్పోయిన వారు, కొత్తగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసుకున్న వారు కలిపి సుమారు 2.30 లక్షల మంది ఉన్నారు. వీరంతా టెట్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఎస్‌జీటీ పోస్టులకు బీఎడ్ కోర్సు పూర్తి చేసినవారు కూడా అర్హులేనని సుప్రీంకోర్టు 2018లో తీర్పునిచ్చింది. అయితే ఎస్‌జీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలంటే టెట్ పేపర్–1లో అర్హత సాధించాల్సి ఉంటుంది. దీంతో బీఎడ్ చేసి గతంలో టెట్ పేపర్–2లో క్వాలిఫై అయినవారు కూడా టెట్ కోసం నిరీక్షిస్తున్నారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి 6 నెలలకు ఒకసారి జాతీయ స్థాయిలో సీటెట్, రాష్ట్ర స్థాయిలో టెట్ నిర్వహించాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఇది అమలు కాగా.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక దానిని ఏడాదికి ఒకేసారి నిర్వహించేలా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కానీ, రెండుసార్లు టెట్ నిర్వహించాక.. రెండేళ్లుగా ఆగిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టెట్ పరీక్షను క్రమం తప్పకుండా నిర్వహించాలి.

రావుల రాజేశం,
లెక్చరర్, జమ్మికుంట

## ఒక్క చిన్న కేసు చాలు

సందర్భం



రాజేందర్ జింబో

కవుల మీద కుట్రకేసులు సహజం. ఎందుకంటే వాళ్లు 'రాజ్యాన్ని' ప్రశ్నిస్తారు. ప్రశ్నించే వాళ్లను లొంగదీసుకోవాలంటే వాళ్ల మీద 'ఒక్క కేసు చాలు'. ఈ విషయం ఎందుకు రాయాల్సి వస్తుందంటే అస్సాంలో పౌరసత్వం మీద గొడవ జరుగుతుంది. ఆ సంక్షోభానికి వ్యతిరేకంగా అక్కడి కవులు గొంతెత్తారు. అలా గొంతు ఎత్తినందుకు గాను వాళ్ల మీద క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. తెలుగు కవి 'ఒక్క కేసు చాలు' కవితలో ఇలా అంటాడు.

*'ఒక్క చిన్న కేసు చాలు / వాడి సున్నితత్వాన్ని బట్టి వాడి మనస్తత్వాన్ని బట్టి /ఏదో ఒక కేసు'*

అసోంలో పౌరసత్వం సంక్షోభం ఏర్పడింది. ఈ సంక్షోభానికి వ్యతిరేకంగా కవులు కవిత్వం రాస్తున్నారు. వాళ్లు ఆ కవిత్వాన్ని మియా కవిత్వం అంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మూలాలు ఉన్న ముస్లింలని 'మియా'లని అంటారు. భాజీ ఎలియాల్ భాజీ సరోవర్ హుస్సేన్ రాసిన కవిత్వాన్ని సలామ్ ఎం హుస్సేన్ అనే వ్యక్తి ఇంగ్లిష్‌లోకి అనువాదం చేశాడు. ఆ కవిత వైరల్ అయిపోయింది. దీంతో రాజ్యం మేలుకున్నది. ఆ కవిత్వం రాజ్యం భద్రతకి భంగం కలిగిస్తోందని, మతతత్వాన్ని రేకెత్తిస్తుందని రాజ్యం భావించింది. ఆ కవుల మీద భారతీయ. శిక్షాస్మృతి లోని సె.120 (బి), 153 (ఎ), 295 (డి), 188ల ప్రకారం కేసు నమోదు చేసింది. ఆ కవిత్వాన్ని ప్రథమ సమాచార నివేదికలో కూడా పొందుపర్చారు.

ఆ కవుల అదృష్టం చూడండి. వారికి గౌహతి హైకోర్టు ముందస్తు బెయిల్‌ని మంజూరు చేసింది. ఆ కవిత ఇలా కొనసాగుతుంది.

*''నేను 'మియా'నని రాయండి*
*ఎన్.ఆర్.సి (జాతీయ వారసత్వ రిజిస్టర్)లో*
*నా క్రమసంఖ్య 20,543*
*నాకు ఇద్దరు పిల్లలు*
*ఇంకొకరు ఈ ఎండా కాలంలో వస్తారు.*
*నన్ను అసహ్యించుకున్నట్లుగా వాడిని కూడా*
*అసహ్యించుకుంటారా?*
*రాయండి, రాయండి నేను 'మియా'నని*
*ఈ లౌకిక, ప్రజాస్వామ్య రిపబ్లిక్ దేశంలో*
*ఎలాంటి హక్కులు లేని పౌరుడిని నేను*
*మా అమ్మ ఒక డి–ఓటరు (సందిగ్ధ ఓటరు)*
*ఆమె తల్లిదండ్రులు భారతదేశీయులు*
*అయినా ఆమె సందిగ్ధ ఓటరే!*
*రాయండి, రాయండి నేను బ్రహ్మపుత్రకు*
*చెందిన 'మియా'నని*
*మీ చిత్రహింసలు నా శరీరాన్ని నలుపుగా*
*మార్చివేశాయి.*
*నా కళ్లను ఎరుపుగా మార్చివేశాయి.*
*రాయండి నేను 'మియా'నని...''*

..... ....

*''ఈ భూమి మా తండ్రిని*
*విదేశీయున్ని చేస్తుంది*
*బుల్లెట్లతో మా సోదరుడిని చంపేస్తుంది*
*మా సోదరిని సామూహిక*
*అత్యాచారానికి గురి చేస్తుంది*
*ఈ భూమి మా అమ్మ గుండెల్లో*
*అగ్నిని రాజేస్తుంది''*

ఈ కవితని యథాతథంగా ప్రథమ సమాచార నివేదికలో పొందుపర్చారు. ఈ కవిత చదివినప్పుడు అందులో ఏ నేరం ఉన్నట్లు కన్పించదు. విద్వేషాలను రెచ్చగొట్టినట్లు అనిపించదు. సాహిత్య పరమైన ఊహలకి, ఆలోచనలకు అది ప్రతిరూపం. ఈ కవిత వల్ల ఎంతో కొంత చర్చ జరిగే అవకాశం ఉంది. అంటే, ఇదే విషయాన్ని ఈ కవుల న్యాయవాది కోర్టుకి విన్నవించాడు. కోర్టు అతని వాదనతో ఏకీభవించింది.

పోలీసులకు ఈ సమాచారం ఇచ్చిన వ్యక్తి అహగాహన, విశ్లేషణ, అభిప్రాయం అతనికి నేరంగా కనిపించింది. కానీ ఇందులో నేరం ఏమీ కనిపించడం లేదని గౌహతి హైకోర్టు న్యాయమూర్తి మీర్జా అల్పాజ్ అలీ తన ఉత్తర్వుల్లో అభిప్రాయపడినారు. ముద్దాయిలను అరెస్టు చేస్తే వారిని పూచీకత్తు తీసుకుని విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ముద్దాయిలు బెయిలు కోసం హైకోర్టుని ఆశ్రయించారు. ప్రథమ సమాచార నివేదికనే రద్దు చేయాలని ఆశ్రయిస్తే బాగుండేది. ఏమైనా హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడం ముద్దాయిలకు, కవులకే కాదు ప్రజాస్వామ్యవాదులందరికీ ఉపశమనాన్ని ఇచ్చింది.

కేసులు పెట్టడం గురించి తెలుగు కవి ఇలా అంటాడు.

*''కేసులు నిలుస్తామని పెట్టరు*
*కేసులు నిలవాలని పెట్టరు*
*కేసులు కేసుల కోసమే పెడతారు*
*మనిషిని వంగదీయడానికి పెడతారు*
*మనిషిని లొంగదీయడానికి పెడతారు*
*కోర్టుని దీపం చేసి*
*మనిషిని పురుగుని చేసి*
*వినోదించడానికి పెడతారు*
*ఇదీ అంతే!''*

వ్యాసకర్త గతంలో జిల్లా జడ్జిగా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ సభ్యులుగా పనిచేశారు । 94404 83001

## ఏక భక్తి

లోకంలో మనుషులలో నాలుగు తరగతుల వాళ్లు భగవంతుడిపట్ల ఆసక్తీ, భక్తీ ప్రదర్శించేటంత పుణ్యఫలం కలిగినవాళ్లు ఉంటారు. అయిదో రకం వాళ్లకు, వాళ్ల పాపకర్మల ఫలంచేత బుద్ధి మాయాగ్రస్తమై ఉంటుంది. హింస, అసత్యం మొదలైన రాక్షస లక్షణాల మీద తప్ప, భగవంతుడి వైపు మళ్లదు అంటుంది గీతా శాస్త్రం.

నాలుగు తరగతులలో మొదటి తరగతి వాళ్లు ఎక్కువ. వీళ్లు ఏదో ఆపదలో, కష్టంలో ఉండి, 'భగవాన్! నా మీద దయ ఉంచి, నీ మహిమ చూపించి ఈ కష్టం నుంచి గట్టెక్కించవయ్యా!' అని మొక్కేవారు. వీళ్లు ఆర్తులు. గజేంద్ర మోక్షం కథలో గజేంద్రుడి లాంటివారు. మూడవ తరగతి వాళ్లు అర్థార్థులు. వీళ్లకి ఇప్పటికిప్పుడు ప్రత్యేకంగా ఏ బాధా కష్టమూ లేదు. కానీ మరింత ధనమో, కనకమో, వస్తు సంపదో, సంతానమో యశస్సో మరేదో లభిస్తే జీవితం మరింత సంతోషకరంగా సాగుతుందన్న భావనతో, ఇతోధిక వృద్ధి ప్రసాదించమని భగవంతుడిని కోరేవారు.

రెండవ తరగతి వాళ్లు జిజ్ఞాసువులు. జిజ్ఞాస అంటే తెలుసుకోవాలనే కోరిక. 'నేనెవరిని? ఎలా వచ్చాను? ఏమై పోతాను? ఈ జగత్తునూ, నన్నూ ఎవరు సృష్టించారు? భగవత్తత్త్వమేమిటి?' అనే ప్రశ్నలకు సమాధానం అన్వేషించాలనే ఆధ్యాత్మిక జిజ్ఞాసవల్ల వీళ్లు భగవద్భక్తి కలిగి ఉంటారు. మన పురాణాలలో పరీక్షిత్తూ, ఉద్ధవుడూ జిజ్ఞాసువులకు ఉదాహరణగా కనిపిస్తారు. నాలుగో తరగతి వాళ్లు జ్ఞానులు. వీళ్ల సంఖ్య చాలా చాలా స్వల్పం. చాలా జన్మల సాధన తరువాత, 'సర్వం వాసుదేవుడే' అన్న జ్ఞానం పొంది, 'నేనూ–నేను కానిది' అన్న భేద భావనే అంతరించిపోయిన వాళ్లు. నారదుడూ, శుకుడూ లాంటి వారు జ్ఞానులు.




ఈ నాలుగు తరగతులలో కూడా భగవంతుడికి ప్రియమైన వాళ్లు జ్ఞానులు. అందుకు కారణం పక్షపాతం కాదు. జ్ఞానులు నిత్యయుక్తులూ, ఏక భక్తులూ కనుక వాళ్ల మార్గం శ్రేష్ఠమైన మార్గం అంటుంది గీత. నిత్యయుక్తులు ఎందుకంటే, వాళ్లకు భగవంతుడితో సంబంధం తాత్కాలికంగా, తాత్కాలిక ప్రయోజనాలు సిద్ధించేందుకు ఏర్పరచుకున్నది కాదు. జ్ఞాని చిత్తం నిరంతరం నిష్కామంగా భగవంతుడి మీద లగ్నమై ఉంటుంది కనుక జ్ఞాని నిత్యయుక్తుడు.

అలాగే జ్ఞానిది భగవంతుడిపట్ల ఎలాంటి చంచలతా, సడలింపూ, సంశయమూ లేని అనన్య భక్తీ, తదేక భక్తీ కనుక ఆయన ఏకభక్తుడు. మిగిలినవారు ఇష్టులు కాదా అంటారేమో. ఎవరు ఏ ప్రయోజనం కోసం ఏ దేవతను శ్రద్ధగా పూజించినా, వాళ్ల కోరికలు నావల్ల తీరతాయి అని గీతాచార్యుడు హామీ ఇస్తాడు. కాకపోతే అల్పబుద్ధితో అల్పమైన ఫలాలు కోరుకుంటే వాటి ప్రయోజనం తాత్కాలికమే సుమా అని హెచ్చరిస్తాడు.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



నిజం ఒప్పుకుంటాను – సినిమా పేజీలో



**గుండెలో తడి ఉండాలంటే గుండె పదిలంగా ఉండాలి కదా!
కానీ ప్రేమశాంతి గుండెకు రంధ్రం ఉంది.
ఆయుష్షును మింగేస్తున్న రంధ్రం అది.
కానీ తను ఆ రంధ్రంలో నుంచి
ప్రపంచంలోని తనలాంటి అభాగ్యులను చూసింది.
ధైర్యంతో, మనోబలంతో, ఆత్మవిశ్వాసంతో
తనలాంటి ఎంతోమంది అభాగ్యుల ఆయుష్షు తగ్గకుండా
చెయ్యి అడ్డు పెడుతోంది. ప్రేమను పంచుతోంది.**

# గుండె రంధ్రం నుంచి చూస్తే...

ఎవరి కోసం వారు బతకడం సహజం. మరొకరి కోసం బతకడం మానవత్వం. బతికి ఉన్నంతకాలం వారిని కాపాడుకుంటాను... నేను చనిపోయినా వారు మాత్రం నిండునూరేళ్లు జీవించాలని కోరుకోవడం దైవత్వం. మానసికంగా, శారీరకంగా పిన్న వయసులోనే జీవితంలో చితికిపోయిన తిరుపతికి చెందిన ప్రేమశాంతి రెడ్డి అలాంటి దైవత్వాన్నే పదుగురికీ పంచుతోంది. 'ఏ క్షణాన్నైనా నేను చనిపోవచ్చు... అయితే నన్ను నమ్ముకున్న రోగులు మాత్రం తమ జీవన ప్రయాణాన్ని కొనసాగించాలి. ఇందుకు దయార్ద్ర హృదయులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి'' అని ముకుళిత హస్తాలతో ఆమె వేడుకుంటున్నారు.

తిరుపతి మల్లంగుంటకు చెందిన పార్లపల్లి చిన్న స్వామిరెడ్డి, సుదర్శనమ్మ దంపతుల కుమార్తె ప్రేమశాంతికి తిరుపతి పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలోనే వివాహం అయింది. ఆ కొత్తల్లోనే ఆమె గర్భం ధరించింది. ఐదో నెలలో వైద్య పరీక్షలు చేయించుకున్న సమయంలో ప్రేమశాంతికి పుట్టినప్పుడే గుండెలో రంధ్రం ఉన్న సంగతి బయటపడింది. వేలూరు సీఎంసీలో చేర్చగా 'తల్లో, బిడ్డో ఎవరో ఒకరే' అని వైద్యులు సూచించారు. దీంతో ప్రేమ శాంతి తల్లిదండ్రులు తమ కుమార్తె దక్కితే చాలని చెప్పడంతో అబార్షన్‌కు అవసరమైన చికిత్స ప్రారంభించారు. ప్రేమ శాంతి శారీరక పరిస్థితుల వల్ల శస్త్ర చికిత్స చేయకుండానే బిడ్డను బయటకు తీయాల్సి ఉండడంతో వైద్యులు కృత్రిమ నొప్పులతో నార్మల్ డెలివరీ కోసం ఇంజక్షన్ ఇచ్చారు. 52 గంటల పాటు నొప్పులను భరించిన ప్రేమశాంతి ఏడోనెల ఆరంభంలో అతి కష్టం మీద.. గర్భంలోనే మరణించిన మగ బిడ్డను ప్రసవించింది. ఆమె కూడా ఇక కొన్నిరోజుల్లో చనిపోతుందని వైద్యులు చెప్పినా ఆత్మస్థైర్యంతో కోలుకుంది. వైవాహిక జీవితానికి పూర్తిగా దూరమై ఒంటరిగా మిగిలింది. భవిష్యత్తు శూన్యంగా గోచరించింది. అయినప్పటికీ తల్లిదండ్రులు, అన్నదమ్ముల ఒత్తిడి మీద ఏడు నెలల పాటు చికిత్స తీసుకుంది.

**వెయిటింగ్ రూమ్‌లో తనలాంటి వారెందరో!**

అలా నాలుగు గోడలకు పరిమితమై దిగాలుతో కృంగిపోతున్న దశలో ఆమె ఇంటికి సమీపంలో ఒకరు స్కూల్‌ను ప్రారంభించారు. ప్రైవేటుగా ఎం.ఏ పూర్తి చేసి మానసికవ్యథ నుంచి బయటపడేందుకు ఆ స్కూల్‌లో టీచర్‌గా చేరారు ప్రేమశాంతి. మరోవైపు స్విమ్స్ కార్డియాలజీ విభాగం స్పెషలిస్ట్ డాక్టర్ వనజ వద్దకు వైద్యపరీక్షలకు వెళుతున్న సమయంలో గుండె రంధ్రాలతో బాధపడుతున్న రోగులు ప్రేమశాంతికి తారసపడేవారు. తనలా ఇంకా ఎందరో ఉన్నారని

హృద్రోగ మహిళకు సపర్యలు చేస్తున్న ప్రేమశాంతి. ఇలాంటి ఎందరికో ఆమె సేవలు చేయడమే కాక వైద్యచికిత్సలకు అయ్యే ఖర్చునూ భరిస్తున్నారు.



ప్రేమశాంతి

తెలిసి తల్లడిల్లిపోయింది. తాను పడిన కష్టం మరొకరికి రాకూడదని నిర్ణయానికి వచ్చి వారిని ఆదుకోవడం ప్రారంభించింది. వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరుకు చెందిన జగదీష్, చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన రమేష్ అనే రోగులకు అవసరమైన మందులను ప్రతినెలా కొరియర్‌లో పంపడం మొదలైంది. పాకెట్‌మనీగా ఇంట్లో ఇచ్చే డబ్బును వారి మందుల కొనుగోలుకు ఖర్చు చే సేది. 2015లో తండ్రి చనిపోయిన తర్వాత ఆయనకు వచ్చే రూ.23 వేల పింఛన్ మొత్తాన్ని తల్లి, సోదరులు ఆమెకే ఇచ్చేస్తున్నారు. ఈ డబ్బుతో మందులు కొని ఇంటికి తెచ్చి రోగుల వారీగా విభజించి ప్యాకెట్లు కట్టి మూడు నెలలకొకసారి కొరియర్ ద్వారా రోగుల ఇళ్లకు పంపుతోంది. క్రమంగా ఆమెను నమ్ముకున్న రోగుల సంఖ్య క్రమేణా 46 కు చేరుకుంది. ఇలా కడప, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు చెందిన రోగులు గత పద్నాలుగేళ్లుగా ఆమె నుంచి ఉచితంగా మందులు పొందుతున్నారు. ఈ విధంగా తన గుండెలోని రంధ్రాన్ని ఆపరేషన్‌తో కాక పరులకు పంచే ప్రేమ, శాంతి, సేవా కార్యక్రమాలతో పూడ్చుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న తిరుపతిలో జరిగిన స్విమ్స్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో స్విమ్స్ డైరక్టర్ రవి కుమార్ ప్రేమశాంతిని సన్మానించి ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు.

**అర్థిస్తున్నా... అక్కున చేర్చుకోండి**

''1995లో పెళ్లయిన కొత్తల్లోనే గర్భం దాల్చగా తల్లి ప్రాణాలకు ముప్పు అని వైద్యులు చెప్పారు. దీంతో కడుపులోని బిడ్డను చేజేతులా చంపుకోవాల్సి వచ్చింది. అబార్షన్ జరిగిన అరగంటలో నేనూ చనిపోతానని వైద్యులు తెలిపినా అదృష్టవశాత్తూ ఓ మేరకు కోలుకున్నాను. మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌లోని డాక్టర్ వనజ మేడమ్ వద్దకు వెళుతున్నపుడు నాలాంటి ఎందరో రోగులు ఎదురయ్యేవారు. ఎలాగోలా పరీక్షలు చేయించుకున్నా మందులు కొనే స్థోమతలేక అల్లాడిపోయేవారు. తోచినంతలో వారిని ఆదుకోవాలనే నిర్ణయానికి వచ్చి మందులు పంపడం ప్రారంభించాను. అయితే మందులు కొనలేని స్థితిలో ఇంకా యాభై మందికి పైగా ఉన్నారు. మాది మధ్యతరగతి కుటుంబం కావడం వల్ల వారందరికీ సాయం చేయడం వీలు కాలేదు. అలాగని వారిని వదిలివేయలేను. పాతికేళ్ల క్రితం చనిపోవాల్సిన నేను వైద్యుల అండదండలు, దేవుడి ఆశీర్వాదం, రోగుల అభిమానంతో ఇంకా బతికి ఉన్నాను. వైవాహిక జీవితం, సంతానం లేదనే చింతలేదు, నన్ను ఎంతో ప్రేమగా చూసుకునే నలభై ఆరు మంది పిల్లలున్నారని గర్వపడుతున్నాను. ఈ రోగం ఏ క్షణాన నా ప్రాణాన్ని కబళిస్తుందో చెప్పలేను. నేను అకస్మాత్తుగా చనిపోతే నా ద్వారా మందులు పొందుతున్న రోగుల పరిస్థితి ఏమిటని ఆందోళన ఇటీవలే మొదలైంది. నేను గతించినా వారు జీవించాలని నా ఆశయం. దాతల కోసం పలువురు రోగులు ఎదురు చూస్తున్నారని లోకానికి తెలియజేయడం కోసమే పద్నాలుగేళ్లుగా గోప్యంగా ఉంచిన నా జీవితాన్ని బహిరంగపరుస్తున్నాను. దేశంలో ఎందరో దయార్ద్ర హృదయులున్నారు. వారందరికీ ఇలాంటి రోగుల వివరాలు చేరాలంటే ఒక వెబ్‌సైట్ తీసుకురావడం మంచిదని తలంచాను. జీవితాంతం నన్ను కంటికి రెప్పలా కాపాడి, చనిపోయిన తరువాత కూడా పింఛన్ రూపంలో నాసేవలకు సహకరిస్తున్న కన్న తండ్రి పేరున pcrsevasamstha.com అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించాను. విశాల హృదయం కలిగిన దాతలు ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమకు తోచిన రోగిని దత్తత తీసుకోవాలని కోరుతున్నాను. అవసరమైన మందులు రోగి చిరునామాకు నేరుగా పంపడం ద్వారా వారి ప్రాణాలు కాపాడాలని ప్రార్థిస్తున్నాను. రోగులకు సేవాహస్తం అందించే దాతలకు ఏమైనా సందేహాలుంటే 76808 70322 సెల్‌ఫోన్‌లో అందుబాటులో ఉంటాను'' అని విజ్ఞప్తి చేస్తున్నారు.

– కొట్రా నందగోపాల్,
సాక్షి ప్రతినిధి, చెన్నై

**పేదల భారం మోస్తున్న ప్రేమశాంతి**



గుండెలో రంధ్రంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడం పేదలకు ఎంతో కష్టం. కనీసం నెలకు రూ.5వేల వరకు మందులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్విమ్స్‌కు రోగులు రాగానే ప్రేమశాంతిరెడ్డికి సమాచారం ఇస్తాం. హోల్‌సేల్‌లో 30 శాతం రాయితీతో కొనుగోలు చేస్తూ సాటి రోగులకు మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో రోగులకు స్వచ్ఛందంగా ఆమె సేవచేయడం ప్రశంసనీయం.

– డాక్టర్ రాజశేఖర్, స్విమ్స్ హెచ్‌వోడీ

**సేవలే ఆమెకు ఆరో ప్రాణం**



పలమనరి ఆర్టరీ హైపర్ టెన్షన్ అనేది గుండె జబ్బులలో ఒకటి. ఊపిరితిత్తుల్లో ఒత్తిడివల్ల (బీపీ) ఇది పెరుగుతుంది. ఈ వ్యాధికి అనేక కారణాలు. గుండెలో రంధ్రాలు ప్రధాన కారణం. పలు రకాల వ్యాధు వల్ల ప్రెజర్ వస్తుంది. రంధ్రాలను ఆపరేషన్ చేసుకున్నా, లేకున్నా బీపీ వస్తుంది. రెండు మూడేళ్లలో చనిపోతారు. 2002కు ముందు సిల్డన్ ఆఫిల్ అనే మాత్ర విదేశాల్లో ఉండేది. 2003 నుంచి అందుబాటులోకి వచ్చింది. ప్రేమశాంతి పుట్టుక నుండి.. అంటే 44 ఏళ్లగా ఈ వ్యాధితో బాధపడుతున్నా పాతికేళ్ల క్రితమే ఈ విషయాన్ని ఆమె గుర్తించింది. సంతోషం సగం బలం అన్నట్టుగా రోగులకు సేవచేయడం ద్వారా సంతోషాన్ని పొందడం వల్లనే ప్రేమశాంతి ఆరోగ్యంగా ఉండగలుగుతోంది.

– డాక్టర్ వి.వనజ, కార్డియాలజిస్టు

**ఆచారం | కన్వర్ యాత్ర**

# శివుడి ప్రీతి కోసం కావడి వ్రతం

**కావడి వ్రతం ఎన్ని వందల ఏళ్ల క్రితం మొదలైంది అనడానికి సరైన ఆధారాలు లేవు. తల్లిదండ్రులను కావడిలో పెట్టుకుని పుణ్యక్షేత్రాలకు తిరిగిన శ్రావణ కుమారుడు వారిని హరిద్వార్‌లో పుణ్యస్నానం చేయించి తిరిగి వస్తూ ఘటంలో గంగాజలం తెచ్చుకున్నాడట. అలా ఈ ఆచారం మొదలైందని అంటారు.**



ఉత్తరాదిన శ్రావణ మాసం జూలై ద్వితీయార్థం నుంచే మొదలైపోతుంది. శ్రావణ మాసం రాగానే 'హరిద్వార్', 'గోముఖి', 'గంగోత్రి' వంటి పుణ్యక్షేత్రాలు 'కన్వరీయల'తో కిటకిటలాడతాయి. 'కన్వరీయులు' శివ భక్తులు. వీరు శ్రావణ మాసంలో గంగా నదీ తీరంలో ఉన్న పుణ్యక్షేత్రాలను చేరుకుని అక్కడి గంగాజలాలను కావడిలో నింపుకుని చుట్టుపక్కల ఉన్న ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు చేరుకుని ఆ జలాలతో శివుని అభిషేకం నిర్వహించడం ద్వారా వ్రతాన్ని ముగిస్తారు. లేదా తమ సొంత ఊరి వరకూ చేరుకుని ఊళ్లోని శివుని గుడిలో అభిషేకం ముగిస్తారు. 'కన్వర్ యాత్ర', 'కావడి యాత్ర'గా పేరుగడించిన ఈ యాత్ర ప్రస్తుతం ఆచరణలో ఉంది. కొందరు భక్తులు శ్రావణ మాసంతో మొదలుపెట్టి శివరాత్రి మధ్య కాలంలో ఎప్పుడైనా కావడి యాత్రను చేస్తారు. కాని ఎక్కువగా శ్రావణమాసంలోనే ఈ వ్రతం ఆచరించడం పరిపాటి.

**శివుడికి ఇష్టమైన మాసం**

శ్రావణ మాసం శివునికి ఇష్టమైన మాసం అనీ ఈ మాసంలోనే శివుడు పార్వతిని పరిగ్రహించాడని భక్తుల నమ్మకం. అందువల్ల ఉత్తరాదిన ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, హర్యాణా, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హరిద్వార్‌కు లేదా గంగానది పరివాహక పుణ్యక్షేత్రానికి చేరుకుంటారు. అక్కడ కాషాయ వస్త్ర ధారణ చేస్తారు. ఆ తర్వాత ఒక కావడి బద్దకు ఇరువైపులా స్టీలు, ఇత్తడి, లేదా ప్లాస్టిక్ ఘటాలను కట్టుకుని వాటిలో గంగాజలం నింపుకుంటారు. ఈ వ్రతం పూర్తయ్యేవరకు కావడి పవిత్రమైనది. దానిని భుజాన మోస్తూ బోసి పాదాలకు దగ్గరిలోని ప్రసిద్ధ శైవ క్షేత్రానికి గానీ, లేదా తమ సొంత ప్రాంతంలోని శైవ క్షేత్రానికి గాని చేరుకుంటారు. తీసుకొచ్చిన గంగాజలంతో శివుడికి అభిషేకం జరిపిస్తారు. ఈ వ్రతాన్ని ఒక్కరుగా చేస్తారు. లేదా బృందాలుగా చేస్తారు. ఈ కావళ్లలో రకాలు ఉన్నాయి. 'వ్యక్తి కావళ్లు', 'వాహన కావళ్లు' అనే విభజనలు ఉన్నాయి. వ్యక్తి కావళ్లు పట్టిన వాళ్లు దారి మధ్యలో కావడిని దించవచ్చు. విశ్రాంతి, కాలకృత్యాలకు విరామం తీసుకోవచ్చు. కాని కొన్ని రకాల కావడి వ్రతంలో కావడిని కిందకు దించకూడదు. అందువల్ల ఆరుమంది సభ్యుల బృందం మార్చుకొని మార్చుకొని కావడి మోస్తూ గమ్యం చేరుకుంటుంది.



**ఎప్పుడు మొదలైంది**

కావడి వ్రతం ఎన్ని వందల ఏళ్ల క్రితం మొదలైంది అనడానికి సరైన ఆధారాలు లేవు. తల్లిదండ్రులను కావడిలో పెట్టుకుని పుణ్యక్షేత్రాలకు తిరిగిన శ్రావణ కుమారుడు వారిని హరిద్వార్‌లో పుణ్యస్నానం చేయించి తిరిగి వస్తూ ఘటంలో గంగాజలం తెచ్చుకున్నాడట. అలా ఈ ఆచారం మొదలైందని అంటారు. కాని పరశురాముడు ఈ ఆచారాన్ని మొదలెట్టాడని అనేవారు కూడా ఉన్నారు. పురాణ ఉదాహరణ తీసుకుంటే క్షీరసాగర మథనంలో వెలువడ్డ హాలాహలాన్ని శివుడు కంఠాన నిలిపాక ఆయన కంఠం నీలంగా మారింది. దాంతో పాటు ఒక సన్నటి శిఖ ఆ హాలాహలం నుంచి రేగి శివుడిని ఇబ్బంది పెట్టసాగింది. ఇది తెలిసిన దేవతలు గంగానదికి వెళ్లి గంగాజలాన్ని తెచ్చి ఆయనకు అభిషేకం జరిపించారు. అలా చేయడం వల్ల ఆ శిఖ చల్లబడి శివుడికి సౌకర్యం కలుగుతుందని భావించారు. అప్పుడు అలా మొదలైన ఆచారం ఇప్పటికీ కొనసాగుతుందని భక్తులు నమ్ముతారు. కాలకూట విషాన్ని గొంతులో మోస్తున్న శివుడిని చల్లబరిచే ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల ఆ బోళా శంకరుడు ప్రసన్నమై భక్తుల కోర్కెలు నెరవేరస్తాడని భావిస్తారు.

**చాలా పెద్ద ఉత్సవం**

కావడి వ్రత సమయంలో ఉత్తరాఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు వ్రతబద్ధులు అయిన కన్వరీయుల సౌకర్యం కోసం మార్గమధ్యంలో ఎన్నో ఏర్పాట్లు చేస్తాయి. వారికి ఆహారం ఉచితంగా ఇవ్వబడుతుంది. తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు ఉంటాయి. కావడి నేల మీద పెట్టకుండా ఉండేందుకు ప్రత్యేకమైన స్టాండ్లు కూడా అందుబాటులోకి తెస్తారు. అలహాబాద్, వారణాసి, దియోఘర్ (జార్ఖండ్), సట్లజ్‌గంజ్ (బీహార్) వంటి క్షేత్రాలలో కూడా కన్వరీయులు దీక్ష బూనడం ఈ శ్రావణ మాసంలో కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనవైపు అయ్యప్ప దీక్షతో సమానంగా ఉత్తరాదిన కావడి దీక్ష ఆచరణలో ఉంది.




**ఈ విధంగా పాల్గొనండి**

- కోటి రూపాయల విలువ చేసే బహుమతులు గెలిచి పెట్టే కూపన్ల ఫార్మాట్ ను కత్తిరించి మీ దగ్గర భద్రంగా దాచుకోండి
- జూలై 10 నుండి అక్టోబరు 10 వరకు 60 స్టాండర్డ్ కూపన్లు మరియు 10 మాస్టర్ కూపన్లు సాక్షి పత్రికలో ప్రచురించబడును.
- ఇందులో నుండి పాఠకులు కేవలం 45 స్టాండర్డ్ కూపన్లను మరియు 5 మాస్టర్ కూపన్లను తీసి భద్రంగా దాచిన కూపన్ల ఫార్మాట్ లో అతికించాలి.
- అతికించడానికి నిబంధనలు ఏమి లేవు, ఉదా -: పేపర్లో ప్రచురితమయ్యే స్టాండర్డ్ కూపన్ కానీ మాస్టర్ కూపన్ కానీ, నంబరుతో నిమిత్తం లేకుండా కూపన్లను సాక్షి ప్రచురించిన కూపన్ల ఫార్మాట్ లో కానీ, బ్రోచర్లో ఉన్న కూపన్ల ఫార్మాట్ లో కానీ కూపన్లను కత్తిరించి ఎక్కడైనా అతికించవచ్చు, ఇంకెందుకు ఆలస్యం అందుకున్న కూపన్ ని వెంటనే అతికించేయండి.
- కూపన్ల ఫార్మాట్ లో మొత్తంగా 50 కూపన్లు అతికించాలి, అందులో ఏ ఒక్కటీ రిపీట్ అవ్వకూడదు మరియు కూపన్లను ఫొటో కాపీ చేసి అతికించరాదు.
- అన్ని కూపన్లు సాక్షి పత్రికలోనే ప్రచురించబడతాయి.
- అతికించిన కూపన్ల ఫార్మాట్ ను దగ్గరలోని సాక్షి కార్యాలయంలో కానీ, సాక్షి పేపర్ ఏజెంట్ కి గానీ సమర్పించాలి.
- కూపన్ల ఫార్మాట్ ను సమర్పించాల్సిన చివరి తేదీనీ సాక్షి పత్రికలోనే చూడగలరు.
- విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయబడును.

**బహుమతుల్ని గెలవడానికి – చదువుతూనే ఉండండి సాక్షి, కొత్తగా చందాదారులవ్వడానికి ఏజెంట్, హాకర్, పేపర్ బాయ్ ని సంప్రదించండి లేదా కాల్ చేయండి 1800-270-1083**

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ బుధవారం
31-7-2019

## లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్య! నేనొక అమ్మాయిని ఐదేళ్లుగా లవ్ చేస్తున్నాను. తను కూడా నన్ను లవ్ చేసింది. 'మన లవ్ విషయం మీ పేరెంట్స్‌కి చెప్పి మన పెళ్ళికి ఒప్పించు' అని నాతో చెప్పింది. దాంతో మా పేరెంట్స్‌కి చెప్పి ఒప్పించాను. నేను మా వాళ్లని ఒప్పించాక.. తను వాళ్ళ పేరెంట్స్ మాట విని నాకు దూరం అయిపోయింది. ఇప్పటికే రెండేళ్లు అవుతోంది. నాకు తన మీద ప్రేమ ఇంకా పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. తను నాకు కావాలి అన్నయ్య ప్లీజ్. తను లేకుంటే నేను చచ్చిపోతాను ఏదైనా మంచి సలహా ఇవ్వండి.

- ప్రమోద్

గుడ్ బాయ్ నువ్వు!

ప్రేమించావు కాబట్టి ఇంకా మనసు అలాగే ఉంది!

నీ లవ్ ప్యూర్ కాబట్టి పాడైపోకుండా అలాగే ఫ్రెష్‌గా ఉంది!

నీ ప్రేమలో సారం ఉంది కాబట్టి రోజురోజుకీ పెరుగుతూపోతుంది!

'ఏంటి సార్ బయాలజీ క్లాస్ చెబుతున్నట్టు ప్రేమ మొక్కలా ఎదుగుతూ పోతుందని చెబుతున్నారు. ఏదైనా సొల్యూషన్ చెప్పండి సార్!'

అమ్మాయి జంప్ అన్నా!

'సింపుల్‌గా చెప్పమంటే రఫ్‌గా చెప్పారేంటి సార్?'

అవును నీలూ..! ఇంట్లో చెప్పగానే మేడమ్‌కి కళ్లెం పడి ఉంటుంది. ఆ తర్వాత పేరెంట్స్ బ్రెయిన్‌ని వైట్‌వాష్ చేసి.. సెంటిమెంట్‌తో కలరింగ్ ఇచ్చి.. అమ్మాయినీ, అమ్మాయి లవ్‌నీ టోన్ డౌన్ చేసి.. బెటర్ బాయ్ నిచ్చి చేసేద్దామనుకుంటున్నారు.

'మరి వాట్ టు డూ సార్?'

అస్సలు 'లో'గా ఫీల్ అవ్వకూడదు. స్ట్రాంగ్ అయిపోవాలి. ఒకసారి వీలైతే అమ్మాయి పేరెంట్స్‌తో మాట్లాడాలి. అదీ కుదరకపోతే తన మీద తనకు కాన్ఫిడెన్స్ వచ్చే పనులు చెయ్యాలి!

'ఏమి చెయ్యాలి సార్?'

జిమ్‌కి వెళ్లి వర్కౌట్ చెయ్యాలి. ఎవరైనా పేద వాళ్లకు సాయం చెయ్యాలి. అమ్మకూ నాన్నకూ ఏదైనా మంచి గిఫ్ట్ ఇవ్వాలి. మనసులో ప్రేమను నింపుకోవాలి. బాధను బయటకు నెట్టెయ్యాలి!!

lovedoctorram@sakshi.com



● ప్రభాస్, శ్రద్ధా కపూర్

# నీ కన్నులు అలిసేలా నే కనిపిస్తాలే...

...అని బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్‌తో కలిసి ప్రభాస్ ప్రేమరాగం తీశారు. ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్‌లు నిర్మించిన చిత్రం 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించారు. ఈ సినిమాలోని పాటలను ఒక్కొక్కటిగా విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలోని ఒక్కో పాటకు ఒక్కో సంగీతదర్శకుడు స్వరాలందించారు. ఇటీవల 'సైకో సయ్యా' పాటను విడుదల చేసిన 'సాహో' టీమ్ తాజాగా ఈ సినిమాలోని 'ఏ చోట నువ్వున్నా?' పాట టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'నిన్నలు మరిచేలా నిన్ను ప్రేమిస్తాలే... నీ కన్నులు అలిసేలా నే కనిపిస్తాలే' అన్న లిరిక్స్ ఉన్న ఈ పాట టీజర్ శ్రోతలను అలరిస్తోంది. యూరప్‌లోని అందమైన లొకేషన్స్‌లో ఈ పాటను చిత్రీకరించారు. గురు రాంధ్వా సంగీతం అందించిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అదించారు. హరిచరణ్ శేషాద్రి, తులసి కుమార్ ఆలపించారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ భాషల్లో కూడా ఈ పాట టీజర్‌ను విడుదల చేశారు. ఆగస్టు 2న పూర్తి పాటను విడుదల చేయనున్నారు. 'సాహో' చిత్రం ఆగస్టు 30న విడుదల కానుంది.



# 800లో భాగస్వామ్యం

క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టనున్నారు హీరో రానా. ఆడటానికి కాదు. ఆడించడానికి. శ్రీలంక ప్రముఖ మాజీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి '800' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. మురళీధరన్ పాత్రలో తమిళ నటుడు విజయ్ సేతుపతి నటించనున్నారు. ఈ సినిమాను థార్ మోషన్ పిక్చర్స్ ప్రొడక్షన్స్‌తో కలిసి రానా నిర్మించనున్నారు. ''థార్ ఫిల్మ్స్‌తో సురేష్ ప్రొడక్షన్స్ అండ్ నేను కలిసి లెజెండరీ క్రికెటర్ మురళీధరన్ బయోపిక్‌ను నిర్మించబోతున్నాం'' అని రానా పేర్కొన్నారు. ఈ సినిమాకు ఎమ్‌ఎస్ శ్రీపతి దర్శకత్వం వహించనున్నారు. డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేసి వచ్చే ఏడాదిలో విడుదల చేయాలనుకుంటున్నారట.



● రానా

# నిజం ఒప్పుకుంటాను

అంతరిక్షంలో ఇస్రో 'మార్స్' ప్రయోగం విజయవంతం కావడంలో దాగి ఉన్న మహిళా శాస్త్రవేత్తల కృషి ఆధారంగా రూపొందిన చిత్రం 'మిషన్ మంగళ్'. అక్షయ్ కుమార్, విద్యాబాలన్, సోనాక్షీ సిన్హా, నిత్యా మీనన్, కృతీ కుల్హారీ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకు జగన్‌శక్తి దర్శకుడు. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అక్షయ్‌కుమార్ ఫొటో పెద్దగా, సినిమాలోని హీరోయిన్ల ఫొటోలు చిన్నవిగా ఉన్నాయి. 'మిషన్ మంగళ్' మహిళా ప్రాధాన్యంగా సాగే సినిమా అంటున్నారు.. అలాంటప్పుడు ఫస్ట్ లుక్‌లో అక్షయ్ ఫొటోను ఎందుకు పెద్దదిగా పెట్టారు? అని కొందరు బాలీవుడ్‌లో ప్రశ్న లేవనెత్తారు. వీటి గురించి తాప్సీ స్పందిస్తూ – ''ఇలా అడిగిన గొప్ప వ్యక్తులే ఈ సినిమా విడుదలైన తర్వాత వసూళ్ల గురించి మాట్లాడతారు. ఈ సినిమా పోస్టర్‌లో అక్షయ్ ఫొటో పెద్దగా ఉంది. ఎందుకంటే ఆడియన్స్‌ని థియేటర్స్‌కు రప్పించేది ఆయనే. ఇదే నిజం. ఒప్పుకుంటాను. సినిమాలో నటించిన మేం అందరం మా సామర్థ్యానికి తగ్గట్లు వర్క్ చేశాం. కానీ బాక్సాఫీస్ నంబర్‌కు అక్షయ్‌లాంటి హీరో కావాలి. పోస్టర్‌లో ఎవరి ఫొటో పెద్దదిగా ఉంది? అనే ప్రశ్న లేవనెత్తితే ఏం ఉపయోగం ఉంటుంది. దర్శక–నిర్మాతలను ఇలాంటి పశ్నలు అడగడానికి బదులు లేడీ ఓరియంటెడ్ మూవీస్‌కి వెళ్లి, వాటి వసూళ్లు బాగుండేలా చేస్తే మంచిది. అప్పుడు నిజంగా స్త్రీ ప్రాధాన్యం గురించి ఆలోచించినట్లు అవుతుంది'' అన్నారు.

### ముచ్చటగా మూడు



సౌత్ రీమేక్స్‌లో నటించడానికి రెడీ అయ్యారు బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్‌కుమార్. ఆల్రెడీ 'లక్ష్మీ బాంబ్' (తమిళంలో 'కాంచన'), 'బచ్చన్‌పాండే' (తమిళంలో 'వీరమ్') చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అక్షయ్ తాజాగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన తమిళ హిట్ చిత్రం 'కత్తి'లో నటించడానికి రెడీ అయ్యారు. 'మిషన్ మంగళ్' సినిమాకు దర్శకత్వం వహించిన జగన్ శక్తే ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాకు 'ఇక్కా' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నారు.

# నిర్మాత చేయి ఎప్పుడూ పైనే ఉండాలి

- ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



● 'గుణ 369' ప్రీ రిలీజ్ వేడుకలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, బోయపాటి శ్రీనులతో పాటు చిత్రబృందం

''ఆదిత్య 369' సినిమాకు నేను సమర్పకుడిగా వ్యవహరించాను. 'గుణ 369' ప్రారంభోత్సవం రోజున స్క్రిప్ట్‌ను నా చేతులతోనే ఇప్పించారు. లైట్ బాయ్ నుంచి నిర్మాత వరకు ఒళ్లు దాచుకోకుండా పని చేసే ఇండస్ట్రీ ఏదైనా ఉందంటే.. అది సినిమా ఇండస్ట్రీ మాత్రమే'' అని ప్రముఖ గాయకులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అన్నారు. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ, అనఘ జంటగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గుణ 369'. ప్రవీణ కడియాల సమర్పణలో అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బిగ్ సీడీ, ఆడియో సీడీలను ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, దర్శకుడు బోయపాటి శ్రీను విడుదల చేశారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ – ''యజమాని బావుంటే పనిచేసేవాళ్లు బావుంటారు. నిర్మాత చేయి ఎప్పుడూ పైనే ఉండాలని కోరుకుంటాను. ట్రైలర్ చూస్తుంటే 'గుణ 369' క్వాలిటీ తెలుస్తోంది. ఈ సినిమా బాగా ఆడాలని కోరుకుంటున్నా'' అన్నారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''అర్జున్‌ని నా బ్రదర్‌లా భావిస్తాను. తను డైరెక్టర్ కావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అనిల్, ప్రవీణ, తిరుమల్ రెడ్డి నాకు ఎంతో కావాల్సిన వాళ్లు. సినిమా చూశాను. ఎంతో విలువలతో చేశారు. సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ– ''నేను ఎంత బావుండాలని మా నాన్నగారు కోరుకుంటారో మా గురువు బోయపాటిగారు కూడా అంతే కోరుకుంటారు. మమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చిన బాలుగారికి ధన్యవాదాలు. మంచి సినిమా చేశాం.. సినిమా చూసిన ప్రేక్షకులు బాగా లేదని మాత్రం చెప్పరు'' అన్నారు. ''ఓ సాధారణ వ్యక్తి జీవితకథే ఈ చిత్రం. మిమ్మల్ని (ప్రేక్షకులు) మీరు తెరపై చూసుకుంటారు'' అన్నారు ప్రవీణ కడియాల. ''మంచి కథ, కథనంతో సాగే సినిమా ఇది. ఎక్కడా ఇది మా తొలి సినిమా అనే భావన రాలేదు'' అన్నారు తిరుమల్ రెడ్డి. కార్తికేయ మాట్లాడుతూ– ''ఆర్‌ఎక్స్ 100' పూర్తి చేసిన తర్వాత సినిమా హిట్ అయిపోతుందని నేను ప్రిపేర్ కాలేదు. హిట్ తర్వాత ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో అర్థం కాలేదు. మనకు తెలిసిన మేర కొన్ని కథలను ఎంచుకుంటాం. అర్జున్ చెప్పిన కథ వినగానే సినిమా చేస్తున్నామని చెప్పాను. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందో.. స్టార్‌డమ్ తెస్తుందనో కాదు... నన్ను నేను తెరపై చూసుకున్న సినిమా కావడంతో నాకు స్పెషల్ మూవీగా భావించాను. అర్జున్‌తో పనిచేస్తుంటే ప్రతి సెకనుకి 100 కోట్ల లాటరీ తగులుతున్నట్లు అనిపించింది. అంత కిక్ ఇచ్చింది. 'గుణ 369' హిట్ కావాలని అర్జున్ కంటే బాగా కోరుకున్న బోయపాటిగారికి స్పెషల్ థ్యాంక్స్ గుణ పాత్ర చేసినందుకు గర్వపడుతున్నా'' అన్నారు. అనఘ, నిర్మాతలు వల్లూరిపల్లి రమేశ్, కిరణ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్, 'మా' అధ్యక్షుడు నరేశ్, విష్ణు ఇందూరి, నటి సంజనా తదితరులు మాట్లాడారు.

# గోవిందా.. మైండ్ పోయిందా?

● దేవుడా.. ఈ గోవిందా మానసిక పరిస్థితి బాగా లేదా? ఒకప్పుడు ఆయన సూపర్ స్టార్. ఇప్పుడు అతని పరిస్థితి బాగాలేదు కాబట్టి బాలీవుడ్ వాళ్లు ముందుకొచ్చి అతను మెరుగవడానికి సహాయపడాలి... ● జేమ్స్ కామెరూన్‌గారూ.. 'అవతార్' గురించి గోవిందా ఏవేవో మాట్లాడుతున్నాడు. అతను మీకు తెలుసా? నిజమేంటో మీరే చెప్పాలి. ● 'గ్లాడియేటర్'లో ముద్దు సీన్ ఉన్నందున ఆ సినిమాని తిరస్కరించా అని అప్పుడెప్పుడో రాఖీ సావంత్ చెప్పిన విషయం ఇప్పుడు గుర్తొస్తోంది... గోవిందా నీకు మైండ్ ఏమైనా ఉందా? అని అర్థం వచ్చేలా... ఇలా సోషల్ మీడియాలో పలువురు గోవిందాపై వ్యంగ్య బాణాలు విసిరారు.



● గోవిందా

ఇంతకీ గోవిందా అంతలా ఏమన్నారంటే.. ఇటీవల ఆయన ఓ టీవీ చానెల్‌కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో ''జేమ్స్ కామెరూన్ ('అవతార్' దర్శకుడు) నన్ను ఓ కీలక పాత్రకు అడిగారు. కానీ శరీరం మొత్తం పెయింట్ చేసుకోవడం ఇష్టం లేక ఆ సినిమా ఒప్పుకోలేదు. 'అవతార్' టైటిల్ చెప్పింది కూడా నేనే. సినిమా సూపర్ హిట్ అవుతుందని కూడా ఆయనతో చెప్పాను. 'అవతార్'ని మీరు ఏడేళ్లు తీస్తారనిపిస్తోందని కూడా చెప్పాను. అలా ఎందుకు అనుకుంటున్నావ్? అని ఆయన అడిగితే 'మీరు అసాధ్యాన్ని ఊహిస్తున్నారు' అన్నాను'' అని గోవిందా చెప్పుకొచ్చారు. అంతే... కామెరూన్ లాంటి సినిమా మేధావి తన సినిమాకి గోవిందాని అడిగి ఉంటారా? అంటూ.. సోషల్ మీడియాలో ఈ బాలీవుడ్ హీరోపై వ్యంగ్యాస్త్రాలు విసురుతూ, ఇదిగో ఇక్కడ కనిపిస్తున్నట్లు గోవిందా ఫొటోని 'అవతార్' గెటప్‌లోకి మార్చి, నెటిజన్లు పండగ చేసుకున్నారు.



● హేమ

# తప్పు చేయలేదు.. సారీ చెప్పలేదు

''బిగ్ బాస్ హౌస్‌లో గడిపిన వారం రోజుల్లో కొత్తగా నేర్చుకోవడానికి ఏమీ మొదలు పెట్టకుండానే బయటకు వచ్చాను. అయినా హౌస్‌లో ఉన్న సమయంలో బోలెడంత నాలెడ్జ్ వచ్చింది. నేను తప్పు చేయలేదు.. సారీ చెప్పలేదు. వారి ముందు (బిగ్ బాస్‌లో ఉన్న మిగతా పార్టిసిపెంట్స్‌ని ఉద్దేశిస్తూ) నా 30 ఏళ్ల నటనా జీవితం వృథా. నేను తిట్టలేకపోయాను. తిట్టించుకోలేకపోయాను (నవ్వుతూ)'' అన్నారు నటి హేమ. నాగార్జున హోస్ట్‌గా ఇటీవల బిగ్‌బాస్ మూడో సీజన్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ షోలో ఎలిమినేట్ అయిన తొలి పార్టిసిపెంట్ హేమ. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హేమ మాట్లాడుతూ – ''బిగ్‌బాస్ ఫస్ట్ సీజన్‌లో పాల్గొనే అవకాశం వచ్చినా నేను వెళ్లలేదు. సెకండ్ సీజన్‌కు పిలుపు రాలేదు. మానసికంగా స్ట్రాంగ్‌గా ఉందామని థర్డ్ సీజన్‌లో బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లాను. నేటి తరం పిల్లలు మనం చెప్పేది వినరు. సరిగ్గా అర్థం చేసుకోరు. అక్కా అక్కా అంటూ నన్నే టార్గెట్ చేశారు (నవ్వుతూ). నాకు బిగ్‌బాస్ హౌస్‌పైన ఫిర్యాదులు లేవు. హౌస్‌లోనూ నటిస్తే జనాలు నన్ను తిడతారు. హౌస్‌లోని వారు గేమ్ ఆడి గెలవాలి అనుకుంటున్నారు. అందులో తప్పు లేదు. అది షో మాత్రమే. హౌస్ నుంచి ఇంత త్వరగా ఎలిమినేట్ అయినందుకు బాధగా లేదు. వ్యక్తిగతంగా నాకు చాలా మంది ట్వీట్లు చేశారు. మెసేజ్‌లు పంపారు. చాలా సంతోషంగా అనిపించింది. హౌస్‌లో శ్రీముఖిది కన్నింగ్ క్యారెక్టర్. గొడవలు పెడుతుంది. హిమజాకు, నాకు గొడవలు ఉన్నాయి. అందుకే నన్ను టార్గెట్ చేసింది. నేను పారితోషికం డిమాండ్ చేసే హౌస్‌లోకి వెళ్లాను. అయితే ఆ పారితోషికం గురించి చెప్పలేను. నేను గేమ్ ఆడలేదు. హౌస్‌లో వితిక, శ్రీముఖి బాగా నటిస్తున్నారు. అశు రెడ్డి ఇంకొన్ని రోజులు హౌస్‌లో ఉండాలని కోరుకుంటున్నాను. నా ఎలిమినేషన్‌కు కొన్ని సాంకేతిక సమస్యలు కూడా కారణమై ఉండొచ్చు. నాకు గూగుల్ ఓట్లు బాగానే వచ్చాయి. కానీ హాట్‌స్టార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఓట్లు వేస్తేనే లెక్కలోకి వస్తుంది. ఇలాంటి టెక్నికల్ ఇష్యూస్ నన్ను అభిమానించే విలేజ్‌లోని వారికి తెలియకపోవచ్చు. అది నా దురదృష్టం. నేను ఎలిమినేట్ అయినందుకు మా ఇంట్లో నో రియాక్షన్. ఏం మమ్మీ.. టైమ్‌పాస్ చేసి వచ్చేశావా అని నా కూతురు అడిగింది. అలాగే నేను సినిమాల్లో నటించడం మానుకున్నాననే వార్తల్లో నిజం లేదు'' అన్నారు. త్వరలో మీరు వైఎస్సార్‌సీపీ పార్టీలో జాయిన్ కాబోతున్నారా? అనే ప్రశ్నకు.. ''తొందర్లోనే అనౌన్స్ చేస్తాను. జగన్‌గారికి సపోర్ట్ చేశాను. ప్రచారం చేయలేదు. జగన్‌గారు, ఆయన పార్టీ అంటే ఇష్టం. నేను స్ట్రాంగ్ అవ్వాలి. ఏదొచ్చినా ఫేస్ చేయగలగాలి. తీసుకున్న స్టాండ్‌కు కట్టుబడి ఉండే గుండె ధైర్యం రావాలి. నా కూతురు డిగ్రీ సెకండ్ ఇయర్‌కి వెళ్లే లోపు నా నిర్ణయం చెబుతా'' అన్నారు హేమ.

# పదో తరగతి బాయ్ కథ



లక్ష్య, సాహితీ ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'బాయ్'. అమర్ విశ్వరాజ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆర్. రవిశంకర్ రాజు మరో నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఆగస్టు 9న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత బెక్కం వేణుగోపాల్, మాస్టర్ విరాట్ విడుదల చేశారు. బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ – ''స్వచ్ఛమైన ప్రేమకథలంటే నాకు ఇష్టం. అందుకే మా బ్యానర్‌లో 'మేం వయసుకు వచ్చాం' సినిమా చేశాను. 'బాయ్' ట్రైలర్ చూస్తుంటే పదో తరగతిలో ఉన్న పిల్లలు ఏ రకమైన అనుభూతుల్లో ఉంటారో చూపించినట్టు తెలుస్తోంది'' అన్నారు. అమర్ విశ్వరాజ్ మాట్లాడుతూ– ''కాలేజ్ వైపు ఆశగా చూస్తున్న ఓ అబ్బాయి కథే ఈ సినిమా. పదో తరగతిలో తను ఎదుర్కొన్న సమస్యలు ఏంటన్నది ఆసక్తిగా ఉంటాయి'' అన్నారు. ''లెక్కలు చాలా కష్టమైన పదోతరగతి అబ్బాయికి ఎలాంటి సమస్యలు వచ్చాయనేదే కథ సారాంశం'' అన్నారు సాహితీ. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: శశిధర్ కొండూరు, ప్రదీప్ మునగపాటి.

# సినిమా బాగున్నా రేటింగ్స్ రాలేదు

హర్షిత్, వంశీకృష్ణ పాండ్య, శ్రీపద్మ, మాధవి, బిశ్వజిత్‌నాథ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నేను లేను'. రామ్‌కుమార్ దర్శకత్వంలో సుక్రి కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో రామ్‌కుమార్ మాట్లాడుతూ– ''భారతీయ తెరపై ఇప్పటి వరకు మా సినిమాలాంటి కథాంశంతో ఏ సినిమా రాలేదు. కాన్సెప్ట్‌ని ఎక్కడి నుంచో కాపీ కొట్టలేదు. ఒక జెన్యూన్ పాయింట్ మీద చాలా సంవత్సరాలు కష్టపడి రాసుకున్న కథ ఇది. మా సినిమాకి అటు ప్రేక్షకులు ఇటు సినీ విశ్లేషకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే నిర్మాతలకీ, బుక్ మై షోకి మధ్యవర్తిగా పనిచేస్తున్న కొందరి వల్ల మా సినిమాకు సరైన రేటింగ్స్ రాలేదు. దాంతో మల్టీప్లెక్స్ థియేటర్స్ లభించక కొంత నష్టం జరిగింది'' అన్నారు. ''మా సినిమాకి చాలా మంచి స్పందన వచ్చింది. కాన్సెప్ట్ కొత్తగా ఉందని నా ఫ్రెండ్స్ ఫోన్ చేసి అభినందిస్తున్నారు. ఇంతమంచి సినిమాలో నన్ను భాగం చేసిన రామ్‌కుమార్‌గారికి థ్యాంక్స్. ఓ చిన్న సినిమాకి ఎన్నో ఇబ్బందులు ఉంటాయి. అవి పునరావృతం కాకుండా మీడియా సహకారం కావాలి'' అని హీరో వర్షిత్ అన్నారు. నటులు వంశీకృష్ణ పాండ్య, రుద్రప్రకాష్ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: ఆశ్రిత్, కెమెరా:ఎ. శ్రీకాంత్ , సహనిర్మాత: యషిక.



● రుద్రప్రకాశ్, రామ్‌కుమార్, హర్షిత్, వంశీ కృష్ణ

# కొత్త వాళ్లకు మంచి సీజన్

- జి.నాగేశ్వరరెడ్డి



● హీరో హీరోయిన్‌పై క్లాప్ ఇస్తున్న నాగేశ్వర రెడ్డి

''కొత్త హీరోలకి, కొత్త దర్శకులకి ఇది మంచి సీజన్. కొత్త డైరెక్టర్లు మంచి కాన్సెప్ట్‌తో సక్సెస్‌లు అందుకుంటున్నారు. కొత్త హీరోలు కూడా వాళ్ల స్టామినా చూపించి ప్రేక్షకులను వారి వైపు తిప్పుకుంటున్నారు'' అని డైరెక్టర్ జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. హరికృష్ణ హీరోగా, ఫిదాగిల్, అనూ మెహతా హీరోయిన్లుగా రఘు పతకమూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. శ్రీ మోనికా స్రవంతి ఆర్ట్ ప్రొడక్షన్స్‌పై మురళి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హరికృష్ణ, అనూ మెహతాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు 'డైమండ్' రత్నబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి క్లాప్ ఇచ్చారు. పాటల రచయిత భాస్కరభట్ల స్క్రిప్ట్‌ను రఘు పతకమూరికి అందించారు.

మురళి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''మా అబ్బాయి హరికృష్ణని హీరోగా పరిచయం చేస్తూ నూతన చిత్రం ప్రారంభించాం. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. వినోదానికి మంచి ప్రాధాన్యం ఉంటుంది'' అన్నారు. రఘు పతకమూరి మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ఇటీవల వచ్చిన థ్రిల్లర్స్‌కి విభిన్నంగా ఉంటుంది. ఆగస్టు 19 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుతాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అఖిల్ వల్లూరి, సంగీతం: జగదీష్.



● అనుష్కా శర్మ

# స్వేచ్ఛ ఇవ్వండి

రెండు రోజులుగా బాలీవుడ్‌లో ఒకటే హాట్ టాపిక్. అనుష్కా శర్మ గర్భవతిగా ఉన్నారా! అని. 'జీరో' సినిమా తర్వాత అనుష్కా శర్మ సినిమాలు చేయకపోవడానికి కారణం ఇదేననే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంపై అనుష్కా శర్మ పెదవి విప్పారు. ఆమె మాట్లాడుతూ– ''ఒక హీరోయిన్ లవ్‌లో ఉందంటే.. 'పెళ్లెప్పుడు?' అని అడుగుతారు. పెళ్లి చేసుకున్నాక 'పిల్లలు' ఎప్పుడు అని అడుగుతారు. ఏం? ఆ హీరోయిన్ గురించి మాట్లాడటానికి వేరే మాటలు ఉండవా? నిజంగా ఏమీ లేకపోయినా ఏదో ఉందనే వార్తలను చదవడానికే కొందరు ఇష్టపడుతుంటారు. ప్రతి విషయం గురించి మేం వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలను గౌరవించి కాస్త స్వేచ్ఛనివ్వండి. ఎవరైనా కాస్త లూజు దుస్తులు వేసుకుంటే 'గర్భవతి' అని ఊహించేసుకోవడమేనా? లూజు డ్రెస్సులు లేటెస్ట్ ట్రెండ్ అనుకోవచ్చు కదా! ఇప్పుడు నేను పనిగట్టుకుని గర్భవతినా? కాదా? అనే విషయం గురించి వివరణ ఇవ్వాలనుకోవడంలేదు'' అని ఘాటుగా స్పందించారు అనుష్కా శర్మ.



● ఏ జో హై జిందగీ

కోడలిని వేధించే అత్త ఉండదు.
భర్తకు విషం కలిపి పెట్టే భార్య ఉండదు.
ఆడపడుచును ఎలా వేధించాలా అని
ఆలోచించే వదిన ఉండదు.
అందమైన జీవితం ఉంటుంది. వాస్తవమైన
సరదాల గిల్లికజ్జాల మధ్యతరగతి సంసారం
ఉంటుంది. స్నేహం ఉంటుంది. సరదా ఉంటుంది.
నిజంగా ఆ రోజులే వేరు. దూరదర్శన్ సీరియళ్ల రోజులే
వేరు. 'ఏ జో హై జిందగీ' లాంటి సీరియల్స్ ఇప్పుడు లేవు.

# ఫ్యామిలీ సర్కస్







నిప్పుల మీద ఉప్పు వేసినట్టు ఎప్పుడూ చిటపటలాడుతూ ఉండే దంపతులు మన ఇరుగింట్లోనో, పొరుగింట్లోనూ కనిపిస్తూనే ఉంటారు. వారిమధ్య నిత్యం ఏవో చిన్నా పెద్ద సమస్యలు, కాసింత గందరగోళం, కూసిన్ని సరదాలు, తగినంత ప్రేమ.. తోక టపాసుల్లా టప్ టప్‌మని పేలుతుంటాయి. రోజూ ఏదో ఒక సందర్భం కథలా నడుస్తూనే ఉంటుంది. దీనిని 35 ఏళ్ల క్రితమే బేస్‌గా తీసుకుంది దూరదర్శన్. అలా బుల్లితెర ఆలూమగలుగా రేణు–రంజిత్‌లు వీక్షకులకు పరిచయం అయ్యారు. దశాబ్దాలు దాటిపోతున్నా ఆ జంట వేసిన నవ్వుల పందిరి ఇంకా కళ్లను దాటిపోలేదు. వారిద్దరి మధ్య రకరకాల గందరగోళ సమస్యలు, సరదా సన్నివేశాలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. దూరదర్శన్‌లో సీరియళ్లు మొదలైన తొలినాళ్లు అవి. అలాంటి రోజుల్లో మధ్యతరగతి భార్యాభర్తల జీవితంలోని సరదా సన్నివేశాలతో మొట్టమొదటి కామెడీ సిరియల్‌గా అందించింది బుల్లితెర.

**నటీ నటులు..** షరీప్ ఇనామ్‌దార్, స్వరూప్ సంపత్, రాకేష్ బేడీ, సతీష్ షా , రచయిత షరాద్ జోషి, దర్శకులు కుంద న్‌షా, మంజుల్ సిన్హా, రామన్ కుమార్‌లు కలిసి చేసిన హంగామా ఫన్ సీరియల్ ఏ జో హై జిందగీ. 1984లో ప్రతీ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రేక్షకులను అలరించే ఈ సీరియల్‌కి టైటిల్ ట్రాక్ అందించినవారు కిశోర్‌కుమార్.

దంపతులైన రంజిత్ వర్మ, రేణువర్మ ఆమె నిరుద్యోగి తమ్ముడు రాజా ఒక ఇంట్లో ఉంటారు.

**ఈ ఆలూ మగల ఇంట్లో ఏం జరుగుతుందో చూద్దామా..!**

**ఒకనాడు..** తమ పెళ్లిరోజును భర్త రంజిత్ గుర్తుపెట్టుకున్నాడో లేదో టెస్ట్ చేయాలనుకుంటుంది భార్య రేణు. రంజిత్ తమ పెళ్లిరోజును మరిచిపోయినట్లు నటిస్తాడు. రేణుకి కోపం వచ్చి లాయర్‌ని కలుస్తుంది విడాకుల కోసం. ఆ లాయర్‌కి అది మొదటి కేసు. ఒక అబద్ధపు విడాకుల పత్రాన్ని రంజిత్‌కి పంపించి బెదిరించాలనుకుంటుంది. తీరా సాయంత్రానికి రంజిత్ గిఫ్ట్‌తో రేణుని సర్‌ప్రైజ్ చేయడంతో ఇద్దరూ కలిసిపోతారు. ఇదో విడాకుల కహాని.

**మర్నాడు..** రేణు, రంజిత్‌ల ఇంటికి ఒక కొత్త సోఫాను తీసుకొస్తాడు సేల్స్‌మ్యాన్. పొరుగింట్లో ఇవ్వాల్సిన డెలివరీని సేల్స్‌మ్యాన్ పొరపాటున వీళ్ల ఇంట్లో ఇచ్చి వెళ్లిపోతాడు. అతిథులు వచ్చి సోఫాలో కూర్చుంటారు. ఆ సమయంలోనే పొరుగింటివాళ్లు వచ్చి అసలు విషయం చెప్పి, సోఫా తీసుకెళ్తామంటారు. అతిథుల ముందు పరువు పోగొట్టుకోలేక, పొరుగింటి వాళ్లను మేనేజ్ చేయడానికి రేణు, రంజిత్‌లు పడే పాట్లు కడుపుబ్బా నవ్విస్తాయి.

**ఒకరోజు..** పొరుగింటివాళ్లు రంజిత్, రేణుల ఇంటికి వచ్చి 'మా అమ్మాయి కవితకి పెళ్లి చూపులు. మా ఇంట్లో సరైన స్థలం లేదు మీ ఇంట్లో ఏర్పాటు చేస్తాం చూపులు' అంటే 'సరే' అంటారు. వరుడు, అతని తరపు వాళ్లు వచ్చాక పొరపాటున రేణుని వధువుగా పరిచయం చేస్తారు. వాళ్లూ రేణుయే పెళ్లి కూతురు అనుకుంటారు. అయితే వరుడు కవితను ఇష్టపడతాడు. ఈ విషయం తెలియక తల్లిదండ్రులు తమ రెండో అబ్బాయికి కవితను ఇచ్చి చేయాలనుకుంటారు. ఇరు కుటుంబాల మధ్య పెద్ద గందరగోళం. చివరకు సమస్య పరిష్కారం అవడంతో అందరూ ఊపిరి పీల్చుకుంటారు.

**మరో రోజు..** రంజిత్ రొటీన్ మెడికల్ చెకప్‌కి డాక్టర్ వద్దకు వెళతాడు. మెడికల్ రిపోర్టులు చూసిన డాక్టర్ రంజిత్‌కు క్యాన్సర్ ఉందని, ఐదు రోజులకన్నా బతకడని బాధగా చెబుతాడు. రంజిత్ డిప్రెషన్‌కి గురవుతాడు. రేణుకి ఆమె తమ్ముడు రాజాకి ఈ విషయం చెప్పవద్దని నిర్ణయించుకుంటాడు. అయితే, వింతగా నటించడం మొదలుపెడతాడు. చివరకు నర్సు పొరపాటు కారణంగా రిపోర్టులు మారిపోయాయని డాక్టర్ ద్వారా నిజం తెలుస్తుంది.

**ఇంకోరోజు..** పొరుగింటి కవిత తాను తల్లిని కాబోతున్నాననే విషయం చెప్పి, పుట్టబోయే బిడ్డకు సాక్స్ అల్లి ఇవ్వమని అడుగుతుంది రేణుని. అలాగే అని చెప్పిన రేణు సాక్సులు అల్లుతుంటుంది. ఇది చూసిన రంజిత్ రేణు గర్భవతి అనుకుంటాడు. రంజిత్ తమ ఇంట్లోకి రాబోయే కొత్త ప్రాణి గురించి మాట్లాడుతుంటాడు. రేణు కొత్తగా వచ్చే కుక్క పిల్ల గురించి ఆలోచించి తనూ అదేవిధంగా మాట్లాడుతుంది. ఈ గందరగోళం చివరికెప్పటికో క్లియర్ అవుతుంది.

ఇలాగే మొత్తం 67 వారాలు. సరదా సరదా సన్నివేశాలతో 67 ఎపిసోడ్లలో ప్రతీవారం అరగంటపాటు బుల్లి తెర నిండుగా నవ్వుల జల్లులు కురిశాయి.

ఈ షో విజయవంతం అవడం, ఆ తర్వాత కొన్నికారణాల వల్ల రంజిత్ పాత్రధారి ఇనామ్‌దార్ బయటకు వెళ్లిపోవడంతో సెకండ్ అటెమ్ట్‌గా రేణు తమ్ముడు రాజాతో కథను నడిపించారు. రంజిత్–రేణులు విదేశాలకు వెళ్లినట్టు, రాజా రంజిత్ బంధువులింట్లో ఉన్నట్టు, వారి కూతురు రశ్మి, పనిమనిషి, రాజా ప్రేమించే నివేదిత .. వీళ్లందరి మధ్య సాగే కథనాన్ని ఇందులో చూపించారు. రంజిత్–రేణులు 45 ఎపిసోడ్ల వరకు ఉండగా, ఆ తర్వాత ఎపిసోడ్లలో రాజా స్టోరీ ఉంటుంది. మూడు సీజన్స్‌గా 67 ఎపిసోడ్లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న మొట్టమొదటి కామెడీ సీరియల్ 'ఏ జో హై జిందగీ.'

**– ఎన్.ఆర్.**



**సతీష్ షా**
ఈ సీరియల్‌లో సతీష్ షా ప్రతీ ఎపిసోడ్‌లోనూ కీలకపాత్ర పోషించేవారు. లాయర్‌గానూ, ఫ్యామిలీ ఫ్రెండ్‌లా, అపరిచితుడిలా.. షా పోషించిన పాత్రలన్నీ పాపులర్ అయ్యాయి. ఇవన్నీ దేశంలోని రకరకాల వృత్తుల నుంచి, ప్రాంతాల నుంచీ తీసుకున్నవి. ఈ సీరియల్‌లో షా ను 'కింగ్ ఆఫ్ కామెడీ'గా చెప్పుకునేవారు. కొన్ని ఎపిసోడ్ల తర్వాత షా స్థానంలో అంజన్ శ్రీవాత్సవ్ జాయిన్ అయ్యారు.



**స్వరూప్ సంపత్**
ఇండియన్ సినిమా నటి స్వరూప్ సంపత్. 1979లో మిస్ ఇండియాగా ఎన్నికైన స్వరూప్ అప్పటికే హిందీ సినిమాల్లో నటిస్తున్నారు. రేణువర్మగా మొదటి సారి బుల్లితెరపై సందడి చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఈ సీరియల్ గురించి స్వరూప్ మాట్లాడుతూ 'భార్యభర్తలమధ్య ఉండే గొడవలు.. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో కాకుండా తమ పొరుగింట్లో ఇలాగే జరుగుతుంది అని నవ్వుకునేవారు. ఒకసారి ఒకావిడ బయట నన్ను చూసి పరుగున వచ్చి 'మా ఆయన 'నువ్వు ఆ రేణులా గొడవ పడేట్లయితేనే తగాదాకు రా' అని అన్నారట' అని నవ్వుతూ చెప్పారు.



సీరియల్

# న్యూస్ రీడర్ నుంచి సీరియల్ నటిగా!

**'టీవీలో యాంకరింగ్ చేశాను. న్యూస్‌రీడర్‌గా పనిచేశాను. ఇప్పుడు సినిమాలు, సీరియల్స్‌లో వర్క్ చేస్తున్నాను. నటిగా మంచి పేరు తెచ్చుకోవాలన్నదే నా ముందున్న లక్ష్యం' అంటున్న సీరియల్ నటి సిరి చెబుతున్న ముచ్చట్లివి.**

''మాది వైజాగ్. పుట్టి పెరిగింది అక్కడే. డిగ్రీ తర్వాత హైదరాబాద్‌కి వచ్చేశాను. అమ్మ, నేను, అన్నయ్య.. ఇదీ మా కుటుంబం. మా నాన్నగారు చిన్నప్పుడే చనిపోవడంతో అమ్మ చిన్న కిరాణా షాపు పెట్టి, అలా వచ్చిన ఆదాయంతో మమ్మల్ని పెంచింది. ఇప్పుడు ఎంబీయే చేస్తూనే సీరియల్స్‌లో నటిస్తున్నాను. సినిమా అవకాశాల కోసం ట్రై చేస్తున్నాను. అన్నయ్య ఫొటోగ్రఫీ వర్క్ చేస్తున్నాడు. మా బలం అమ్మనే.



సిరి

**అగ్నిసాక్షి**
ఇప్పటి వరకు మూడు సినిమాలలో అవకాశాలు వస్తే చేశాను. 'అగ్నిసాక్షి' సీరియల్‌కి ముందు 'ఉయ్యాల జంపాల', 'ఎవరేమోహినీ'లో వర్క్ చేశాను. ఇప్పుడు అగ్నిసాక్షిలో ప్రాధాన్యం ఉన్న రోల్‌లో నటిస్తున్నాను. సిరిగా ఇప్పుడు అందరిలోనూ మంచి గుర్తింపు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

**డిగ్రీ చేస్తూనే యాంకరింగ్ వైపు**
నేను టీవీలో, సినిమాలో కనిపించడం అమ్మకు నచ్చలేదు. ఈ ఫీల్డ్ అంటే ఉన్న సందేహాలు, నాన్న లేకపోవడంతో మేం భవిష్యత్తులో ఎలా నిలదొక్కుకుంటామో అనే భయాల వల్ల మొదట్లో అమ్మ ఒప్పుకోలేదు. కానీ, నాకు చిన్నప్పటి నుంచి ఆన్‌స్క్రీన్ అంటే బాగా ఇష్టం. అలా డిగ్రీ చేస్తూనే యాంకరింగ్ వైపుకు వచ్చాను. ఆ తర్వాత న్యూస్‌రీడర్‌గానూ వర్క్ చేశాను. పది వరకు షార్ట్ ఫిల్మ్స్‌లో నటించాను. అవి చూసిన వాళ్లు అమ్మకు 'మీ అమ్మాయి చక్కగా ఉంది. మంచి జాబ్ చేస్తోంది. మంచి భవిష్యత్తు ఉంది' అని మెచ్చుకునేవారు. దీంతో అమ్మకు ఈ ఫీల్డ్ అంటే ఉన్న భయం పోయింది. సిరి ఎక్కడున్నా బతికేస్తుంది అని నమ్మకం వచ్చేసింది.

**అన్నయ్య కన్నా నేనే బెస్ట్!**
నాన్నగారు లేకపోవడంతో అమ్మ నన్ను ఇండిపెండెంట్‌గా బతకడం అలవాటు చేసింది. ఇది అమ్మాయిల పని, ఇది అబ్బాయిల పని అని అన్నయ్యను నన్ను ఎప్పుడూ వేరుగా చూడలేదు. పైగా ఎక్కడున్నా ఎవరి మీద ఆధారపడకుండా బతకాలి అంటుండేది. అలా పనులు చేయడంలో, యాక్టివ్‌గా ఉండటంలో అన్నయ్య కన్నా నేనే బెస్ట్ అనిపించుకుంటాను. ఇప్పుడు అమ్మను పనిచేయనివ్వడం లేదు. షాప్ తీసేశాం. 'మా కోసం ఇన్నాళ్లు కష్టపడ్డావు ఇక రెస్ట్ తీసుకో' అని అమ్మకు చెబుతుంటాం నేనూ, అన్నయ్య.

**అభిరుచులు**
డ్యాన్స్ అంటే పిచ్చి. కానీ, ఒక పద్ధతి ఉండదు (నవ్వుతూ). ఎలా అంటే అలా గెంతులు వేస్తుంటాను. పాటలు కూడా అంతే. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటాను. ఎప్పుడూ ఫోన్ చేతిలోనే ఉంటుంది. కాస్ట్యూమ్స్ ఎంపిక, కలర్ కాంబినేషన్స్.. చూసుకోవడం ఇష్టంగా చేస్తాను.

**డ్రీమ్ రోల్**
ఎప్పటికీ ఇలా మీ మధ్య ఈ ఫీల్డ్‌లో కొనసాగాలన్నదే నా కల. ఇదే నా జీవితం. ఈ ఫీల్డ్‌లో దేనినీ వదిలేయను. ఇప్పటికీ ఎవరైనా పిలిచి యాంకరింగ్ చేయమన్నా చేస్తాను. షోస్‌లో పాల్గొంటాను. ఒకటి అని ఏమీ లేదు. సినిమా, టీవీ .. యాక్టింగ్‌లో ఆల్‌రౌండర్ అనిపించుకోవాలి.''

**– నిర్మలారెడ్డి**

● ముత్తులక్ష్మీరెడ్డి

# స్త్రీ విముక్తి చేతనం

**సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా స్త్రీల హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న చర్చలూ, పోరాటాలూ, ఉద్యమాలూ మనం చూస్తున్నాం. కానీ వందేళ్ల క్రితమే మహిళల హక్కుల కోసం, స్త్రీల విముక్తికోసం అలుపెరుగని పోరాటం చేసిన ఓ స్త్రీ శక్తిని ఈ రోజు గూగుల్ డూడిల్ జ్ఞాపకం చేసింది. అంతేనా.. ప్రజారోగ్యం కోసం, స్త్రీపురుష సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన డాక్టర్ ముత్తులక్ష్మీరెడ్డి 133 వ జయంతి సందర్భంగా ఆమె పుట్టిన రోజును ప్రతియేటా ప్రతి ప్రభుత్వాసుపత్రిలోనూ 'హాస్పిటల్ డే' గా జరుపుకోనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.**




● ముత్తులక్ష్మీరెడ్డి జయంతి సందర్భంగా గూగుల్ డూడిల్

## వందేళ్ల క్రితమే వైద్యరంగంలోకి!

తమిళనాడులోని పుదుకొట్టై జిల్లాలో ముత్తులక్ష్మీరెడ్డి 1886లో జన్మించారు. కేవలం పురుషులకే పరిమితమైన వైద్యరంగంలోకి అడుగుపెట్టి వందయేళ్ల క్రితమే 1912లో తొలి మహిళా వైద్యురాలుగా తనదైన చరిత్ర సృష్టించారు. అంతేకాక సర్జరీ విభాగంలో అడుగుపెట్టిన తొలి భారతీయ యువతి కూడా ఈమే. మద్రాసు మెడికల్ కాలేజీలో చదివి మద్రాసులోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో తొలి హౌస్ సర్జన్‌గా ఆమె నియమితులయ్యారు.

కేవలం వైద్య రంగంలోనే కాక రాజకీయంగానూ ఆమె తనదైన ముద్ర వేశారు. 1918లో ఇండియన్ ఉమన్స్ అసోసియేషన్‌కి సహ వ్యవస్థాపకులుగా పనిచేశారు. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపికై దేశంలోనే తొలి మహిళా శాసనసభ్యురాలిగా స్త్రీల జీవితాల్లో మార్పుకి ఎనలేని కృషి చేశారు. ఆ రోజుల్లో బాల్య వివాహాల నుంచి బాలికలకు విముక్తి కల్పించాలనే లక్ష్యంతో బాలికలకు కనీస వివాహ వయస్సు అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తారు.

## దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకు

ముత్తులక్ష్మీరెడ్డి.. చంద్రమ్మాళ్ అనే దేవదాసీ కూతురు. తమిళనాడులోని పుదుకొట్టై మహారాజా కాలేజీ ప్రిన్సిపల్ నారాయణ స్వామిని ముత్తులక్ష్మీరెడ్డి వివాహం చేసుకున్నారు. మహారాజా హై స్కూల్‌కి ఓ బాలిక రావడం ఆ రోజుల్లో పెద్ద వింత. ముత్తు లక్ష్మీరెడ్డి వస్తే తమ పిల్లలను స్కూల్‌కి పంపించేదే లేదని మగపిల్లల తల్లిదండ్రులు హెచ్చరించినా లెక్కచేయకుండా చదువుని కొనసాగించారు. దేవదాసీ అయిన చంద్రమ్మాళ్‌ని వివాహం చేసుకోవడంతో ముత్తులక్ష్మీరెడ్డి తండ్రిని ఆయన కుటుంబం వెలివేసింది. దీంతో అమ్మమ్మ ఇంట్లో పెరిగిన ముత్తులక్ష్మీరెడ్డి దేవదాసీల పరిస్థితిని అత్యంత సమీపం నుంచి చూశారు.



● మద్రాస్ మెడికల్ కాలేజీ స్టూడెంట్‌గా ముత్తులక్ష్మీరెడ్డి (1907-1912)

ఊరుమ్మడి సొత్తుగా భావించి దేవుడి పేరుతో దగాపడ్డ దేవదాసీల జీవితాలను అధ్యయనం చేశారు. వందలాదిమంది దేవదాసీలను ఇంటర్వ్యూ చేసి, ఈ సామాజిక వెనుకబాటుతనానికి సమూలంగా స్వస్తి పలకాలని దేవదాసీ వ్యవస్థ రద్దు బిల్లుని ప్రవేశపెట్టారు. 1930లో ఇద్దరు దేవదాసీ మహిళలు ముత్తులక్ష్మీరెడ్డి ఆశ్రయం కోరారు. నిలువనీడలేని ఆ దేవదాసీ బాలికలను కొద్ది రోజులు తనతో ఉంచుకొని, ఆ తరువాత ఎక్కడైనా వారికి ఆశ్రయం కల్పించే ప్రయత్నం చేశారు. అయితే వారికి ఆశ్రయమిచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. దీంతో ముత్తులక్ష్మీరెడ్డి దేవదాసీ బాలికల కోసం ప్రత్యేకించి 'అవ్వై హోం' అనే షెల్టర్ హోంలను నిర్మించి, అక్కడే దేవదాసీ బాలికలకు విద్యాబోధనా ఏర్పాట్లు చేశారు.

## స్వాతంత్ర్య సంగ్రామంలో..

స్వాతంత్ర్య సంగ్రామంలో సైతం ముత్తులక్ష్మీరెడ్డి పాత్ర మరువలేనిది. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న ముత్తులక్ష్మీరెడ్డి అదే ఉద్యమంలో గాంధీ అరెస్టుకి నిరసనగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి, దేశభక్తిని చాటుకున్నారు. అయితే 1947 డిసెంబర్‌లో మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీలో దేవదాసీ (ప్రివెన్షన్ ఆఫ్ డెడికేషన్) బిల్లు పాస్ అవడంతో ముత్తులక్ష్మీరెడ్డి చిరకాల పోరాటం ఫలించింది. 1954లో చెన్నైలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన ముత్తులక్ష్మిని 1956 లో ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది.

తన యావత్ జీవితాన్నీ స్త్రీ సంక్షేమం కోసం, స్త్రీల హక్కుల కోసం, స్త్రీ విముక్తి కోసం అర్పించిన ముత్తులక్ష్మీరెడ్డి చివరకు 1968లో తన 81వ యేట కన్నుమూశారు.

**– అరుణ అత్తలూరి**

## పీడియాట్రిక్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

# పాప ముఖం మీద మచ్చలు.. తగ్గడం ఎలా?

**మా పాపకు 14 ఏళ్లు. ఏడాది కిందటినుంచి ఒంటి మీద, ముఖం మీద చాలా మచ్చలు వస్తున్నాయి. ఈ మచ్చలు పోవడానికి ఏం చేయాలి?**

**- డి. రమాసుందరి, విజయనగరం**

మీ పాపకు ఉన్న కండిషన్ నీవస్ అంటారు. దీన్ని వైద్యపరిభాషలో మల్టిపుల్ నీవస్ అనీ, సాధారణ పరిభాషలో చర్మంపై రంగుమచ్చలు (కలర్‌డ్ స్పాట్స్ ఆన్ ద స్కిన్) అంటారు. ఇవి రెండు రకాలు. మొదటిది అపాయకరం కానివీ, చాలా సాధారణంగా కనిపించే మచ్చలు. రెండోది హానికరంగా మారే మెలిగ్నెంట్ మచ్చ.

ఒంటిపై మచ్చలు పుట్టుకతోనే రావచ్చు. మధ్యలో వచ్చే మచ్చలు 10 నుంచి 30 ఏళ్ల మధ్య రావచ్చు. నీవస్ చర్మానికి రంగునిచ్చే కణాల వల్ల వస్తుంది. ఇది శరీరంలో ఎక్కడైనా (అరచేతుల్లో, అరికాళ్లలో, ఆఖరుకు గోళ్లమీద కూడా) రావచ్చు. సూర్యకాంతికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం, కుటుంబ చరిత్రలో ఇలాంటి మచ్చలున్న సందర్భాల్లో ఇది వచ్చేందుకు అవకాశం ఎక్కువ. కొన్ని సందర్భాల్లో నీవాయిడ్ బేసల్ సెల్ కార్సినోమా అనే కండిషన్ కూడా రావచ్చు. ఇది పుట్టుకనుంచి ఉండటంతో పాటు, యుక్తవయస్సు వారిలోనూ కనిపిస్తుంది. వారికి ఈ మచ్చలతో పాటు జన్యుపరమైన అబ్‌నార్మాలిటీస్ చూస్తుంటాం. అలాంటి వాళ్లకు ముఖ ఆకృతి, పళ్లు, చేతులు, మెదడుకు సంబంధించిన లోపాలు కనిపిస్తాయి. మీ పాపకు ఉన్న కండిషన్‌తో పైన చెప్పినవాటికి సంబంధం లేదు. మీ పాపది హానికరం కాని సాధారణ నీవస్ కావచ్చు. దీనివల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదు. క్యాన్సర్‌గా మారే అవకాశం కూడా చాలా తక్కువ. అయితే... కొన్ని నీవస్‌లు క్రమంగా క్యాన్సర్ లక్షణాలను సంతరించుకునే అవకాశం ఉంది. కాబట్టి ఒంటిపై మీ పాపలా మచ్చలు ఉన్నవారు రెగ్యులర్‌గా డెర్మటాలజిస్ట్‌లతో ఫాలో అప్‌లో ఉండటం మంచిది. అది ఎలాంటి మచ్చ అయినా... ఏ, బీ, సీ, డీ అన్న నాలుగు అంశాలు గమనిస్తూ ఉండటం మంచిది. ఏ– అంటే ఎసిమెట్రీ... అంటే పుట్టుమచ్చ సౌష్టవంలో ఏదైనా మార్పు ఉందా?, బీ– అంటే బార్డర్... అంటే పుట్టుమచ్చ అంచుల్లో ఏదైనా మార్పు ఉందా లేక అది ఉబ్బెత్తుగా మారుతోందా?, సీ– అంటే కలర్... అంటే పుట్టుమచ్చ రంగులో ఏదైనా మార్పు కనిపిస్తోందా?, డీ– అంటే డయామీటర్... అంటే మచ్చ వ్యాసం (పరిమాణం) పెరుగుతోందా? ఈ నాలుగు మార్పుల్లో ఏదైనా కనిపిస్తే వెంటనే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలి. అప్పుడు బయాప్సీ తీసి పరీక్ష చేసి అది హానికరమా కాదా అన్నది వారు నిర్ణయిస్తారు. ఇక ఇలాంటివి రాకుండా ఉండాలంటే... ఎండకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం పూర్తిగా తగ్గించాలి. హానికారక అల్ట్రావాయొలెట్ కిరణాలు తాకకుండా చూసుకోవాలి. బయటకు వెళ్లేప్పుడు ఎక్కువ ఎస్‌పీఎఫ్ ఉన్న సన్ స్క్రీన్ లోషన్స్ రాసుకోవాలి. మీ పాపకు ఉన్న మచ్చల్ని అప్పుడప్పుడూ డెర్మటాలజిస్ట్‌తో పరీక్ష చేయిస్తూ ఉండటం మంచిది. ఇలాంటి నీవస్‌లు ముఖం మీద ఉండి కాస్మటిక్‌గా ఇబ్బంది కలిగిస్తుంటే... దీన్ని ఎక్సెషన్ థెరపీతో వాటిని తొలగించవచ్చు.



## రంగులతో ఉండే ఆహారాలు తీసుకోవచ్చా?

**మా బాబు బాగా ఆకర్షణీయమైన రంగులు ఉండే స్వీట్లు, ఆహారపదార్థాలను ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. వాటినే ఇప్పించమని అడుగుతుంటాడు. అవి మంచిదేనా?**

**- ఎమ్. శ్రీవాణి, మేదరమెట్ల**

ఆహారపదార్థాల్లో కృత్రిమ రంగులు, నిల్వ ఉంచేందుకు వాడే ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారం వారి ఆరోగ్యానికి, వికాసానికి, పెరుగుదలకు కీడు చేస్తుంది. కొన్ని కృత్రిమ రంగులు అసలు తీసుకోవడమే మంచిది కాదు. ఎందుకంటే వాటిని బయటకు పంపేందుకు మూత్రపిండాలు అతిగా శ్రమించాల్సి ఉంటుంది. ఫలితంగా వాటి దుష్ప్రభావం మూత్రపిండాలపై పడుతుంది. ఇక ఆహారం ఆకర్షణీయంగా ఉండటంతో పాటు అది దీర్ఘకాలం నిల్వ ఉండటానికి ఉపయోగపడే ప్రిజర్వేటివ్స్‌లో సన్‌సెట్ ఎల్లో, ట్యాట్రజైన్, కార్మోయిసైన్, పాన్‌క్యూ 4ఆర్, సోడియం బెంజోయేట్ వంటి ప్రిజర్వేటివ్స్, క్వినోలిన్ ఎల్లో, అల్యూరా రెడ్ వంటి రసాయనాలతో పిల్లల్లో అతి ధోరణులు (హైపర్ యాక్టివిటీ) పెరుగుతాయని పరిశోధనల్లో తేలింది. సోడియం బెంజోయేట్ వంటి రసాయనాలు విటమిన్ 'సి'తో కలిసినప్పుడు అది క్యాన్సర్ కారకం (కార్సినోజెన్)గా మారుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ రసాయనం భవిష్యత్తులో లివర్ సిర్రోసిస్‌కు, పార్కిన్‌సన్ డిసీజ్ లాంటి వాటికి దారితీస్తుందని కూడా వెల్లడయ్యింది. అందుకే అతిగా రంగులు ఉండే ఆహారం తీసుకునే విషయంలో పిల్లలను ప్రోత్సహించకూడదు. దీనికి బదులు స్వాభావిక ఆహారాలు, పానీయాలు తీసుకునేలా వారిని ప్రోత్సహించాలి.





**డా. రమేశ్‌బాబు దాసరి**
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
బుధవారం
31-7-2019

డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేయొచ్చు.. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పీజీ పట్టా అందుకోవచ్చు! ఇంతవరకు అందరికీ తెలుసు!! కానీ, పాఠశాల, సీనియర్ సెకండరీ విద్యలను డిస్టెన్స్‌లో పూర్తిచేయొచ్చని చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు! అంతేకాదు.. ఏం చదవాలి.. ఎప్పుడు చదవాలి.. ఏయే తేదీల్లో పరీక్షలకు హాజరవ్వాలి.. నిర్ణయం విద్యార్థిదే..! చదువును ఏ ఒక్క ప్రదేశానికో..ఏదో ఒక నిర్దిష్ట సమయానికో పరిమితం చేయని విద్యావ్యవస్థే.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)! విద్యను విశ్వజనీనం చేసే లక్ష్యంతో దూరవిద్యా విధానంలో సెకండరీ, సీనియర్ సెకండరీ కోర్సులను అందిస్తోంది ఎన్ఐఓఎస్!! వీటితోపాటు ఒకేషనల్ కోర్సులు, లైఫ్ స్కిల్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది. ఈ నేపథ్యంలో... ఎన్ఐఓఎస్ కోర్సులు, ప్రవేశాలపై ప్రత్యేక కథనం..




# ఓపెన్ స్కూలింగ్

- అందరికీ అందుబాటులో విద్య: ఎన్ఐఓఎస్
- నియత విద్యకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న వైనం
- దూరవిద్యా విధానంలో ఎలిమెంటరీ నుంచి ఇంటర్ వరకు..
- డిస్టెన్స్‌లో పలు ఒకేషనల్ కోర్సులకు శ్రీకారం

**జా**తీయ విద్యావిధానం–1986 లక్ష్యాలను సాధించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 1989లో స్వయం ప్రతిపత్తి గల నేషనల్ ఓపెన్ స్కూల్ (ఎన్ఓఎస్)ను ఏర్పాటు చేసింది. దీన్నే 2002లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)గా మార్చారు. ఎన్ఐఓఎస్ సెకండరీ, సీనియర్ సెకండరీ స్థాయిల్లో జనరల్ అకడెమిక్ కోర్సులతోపాటు ఒకేషనల్, లైఫ్ స్కిల్స్, కమ్యూనిటీ ఓరియెంట్ కోర్సులను ఆఫర్‌చేస్తోంది. వీటితోపాటు ఎలిమెంట్రీ లెవల్ కోర్సులను సైతం అందిస్తుండటం విశేషం. ఆయా కోర్సులకు సంబంధించిన పరీక్షల నిర్వహణతోపాటు సర్టిఫికెట్‌లను జారీచేస్తుంది.

## కోర్సులు

### ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓబీఈ)

భారత ప్రభుత్వం 'సర్వశిక్షా అభియాన్' పథకం ద్వారా దేశంలోని పిల్లలు, యువత, పెద్దలకు ప్రాథమిక విద్యను అందిస్తోంది. ఎన్ఐఓఎస్ సాధారణ విద్యకు ప్రత్యామ్నాయంగా ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీనికి రెగ్యులర్ విద్యకు సమానమైన గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్... 14 ఏళ్ల లోపు, 14 ఏళ్లు నిండిన వారికి వేర్వేరుగా ఉంటుంది.

**దశలు:**
- **ఓబీఈ లెవల్ ఎ:** 1–3 తరగతులకు సమానం.
- **ఓబీఈ లెవల్ బి:** 4–5 తరగతులకు సమానం.
- **ఓబీఈ లెవల్ సి:** 6–8 తరగతులకు సమానం.

### సెకండరీ కోర్సు

- ఈ కోర్సు పదోతరగతి (ఎస్ఎస్‌సీ)కి సమానమైంది. సెకండరీ కోర్సుకు సంబంధించి 'గ్రూప్ ఎ'లో తెలుగు, ఇంగ్లిష్, బెంగాలీ, తమిళం తదితర భాషా సబ్జెక్టులు.. 'గ్రూప్ బి'లో మ్యాథ్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సోషల్ సైన్సెస్, ఎకనామిక్స్, హోమ్ సైన్స్, డేటా ఎంట్రీ ఆపరేషన్ తదితర కోర్ సబ్జెక్టులను పేర్కొన్నారు.
- రెండు గ్రూపుల నుంచి కనీసం అయిదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైన వారికి సెకండరీ సర్టిఫికెట్ అందిస్తారు. 'గ్రూప్ ఎ' నుంచి ఒకటి లేదా గరిష్ఠంగా రెండు సబ్జెక్టులను మాత్రమే ఎంచుకొనే అవకాశం ఉంటుంది. గ్రూప్ బీలో 3 లేదా 4 భాషేతర సబ్జెక్టులు కలిపి మొత్తంగా 5 సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాలి.

### సీనియర్ సెకండరీ

- ఇది ఇంటర్మీడియెట్‌కు సమానమైన కోర్సు. సబ్జెక్టులను గ్రూప్ 'ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్'లుగా వర్గీకరించారు. 'గ్రూప్ ఏ'లో.. ఇంగ్లిష్, హిందీ, గుజరాతీ, ఉర్దూ తదితర భాషా సబ్జెక్టులు ఉంటాయి. 'గ్రూప్ బీ'లో.. మ్యాథ్స్, హోమ్ సైన్స్, సైకాలజీ, జాగ్రఫీ, బిజినెస్ స్టడీస్ మొదలైన సబ్జెక్టులు ఉన్నాయి.
- కనీసం అయిదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైన వారికి సీనియర్ సెకండరీ సర్టిఫికెట్‌ను అందిస్తారు. విద్యార్థులు 'గ్రూప్ ఏ' నుంచి ఒకటి లేదా గరిష్ఠంగా రెండు సబ్జెక్టులను మాత్రమే ఎంచుకోవాల్సి ఉంటుంది.

### ఒకేషనల్ కోర్సులు

- ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను విస్తృతపరచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఆ క్రమంలో ఎన్ఐఓఎస్ ద్వారా పలు ఒకేషనల్ కోర్సులను అందిస్తోంది.
- పుట్టగొడుగుల ఉత్పత్తి, జీవ ఎరువులకు సంబంధించి ఆరు నెలల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది.
- తేనెటీగల సంరక్షణ, ప్యాడీ, పౌల్ట్రీ ఫార్మింగ్‌లలో ఏడాది వ్యవధితో సర్టిఫికెట్ ప్రోగ్రామ్ (సెకండరీ కోర్సు)ను ఆఫర్‌చేస్తోంది.
- ప్లాంట్ ప్రొటక్షన్, వాటర్ మేనేజ్‌మెంట్ ఫర్ క్రాప్ ప్రొడక్షన్, సాయిల్ అండ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్‌లలో ఏడాది వ్యవధితో సర్టిఫికెట్ కోర్సు (సీనియర్ సెకండరీ లెవల్) అందుబాటులో ఉంది.
- వర్చువల్ ఓపెన్ స్కూలింగ్ (వీఓఎస్) కింద అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీకి సంబంధించి ఆన్‌లైన్ కోర్సు అందిస్తోంది.
- బిజినెస్ అండ్ కామర్స్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హెల్త్ అండ్ పారామెడికల్, హోమ్‌సైన్స్ అండ్ హాస్పిటాలిటీ విభాగాల్లో సర్టిఫికెట్, సెకండరీ, సీనియర్ సెకండరీ సర్టిఫికెట్ కోర్సులను ఆఫర్ చేస్తోంది.
- లైబ్రరీ సైన్స్, డ్యాన్స్, మ్యూజిక్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, యోగా టీచర్ ట్రైనింగ్ కోర్సులను అందిస్తోంది.

### డీఈఐఈడీ

టీచింగ్‌లో శిక్షణ పొందకుండా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికోసం ఉద్దేశించిన కోర్సే... డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ). ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు సంబంధించి రిజిస్ట్రేషన్‌కు మూడేళ్ల వ్యాలిడ్ ఉంటుంది. వీటితోపాటు ఎన్ఐఓఎస్‌లో లైఫ్ స్కిల్స్ ప్రోగ్రామ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

### ప్రత్యామ్నాయ విద్య

**నే**షనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ప్రత్యామ్నాయ విద్యను అందుబాటులోకి తెచ్చింది. ఈ దిశగా ఎంహెచ్ఆర్‌డీతో కలిసి స్వయంప్రభ పేరుతో ఆన్‌లైన్ విద్యను అందిస్తోంది. ఎన్ఐఓఎస్ అందించే సెల్ఫ్ లెర్నింగ్ మెటీరియల్ విద్యను అందరికీ మరింత చేరువ చేస్తోంది. ఎన్ఐఓఎస్ సెకండరీ, సీనియర్ సెకండరీలతోపాటు పలు వృత్తి విద్యా కోర్సులను అందిస్తోంది. తాజాగా యోగా కోర్సును సైతం ప్రారంభించడం విశేషం. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ద్వారా 2017–2019 మధ్యకాలంలో 12 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. క్రీడాకారులు, కళాకారులు, నియత విద్యకు దూరంగా ఉన్నవారు ఎన్ఐఓఎస్ ద్వారా విద్యను అభ్యసించవచ్చు.

– **అనిల్ కుమార్**, రీజనల్ డైరెక్టర్, ఎన్ఐఓఎస్ హైదరాబాద్.




### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వయసు:** సెకండరీ కోర్సులో ప్రవేశానికి జూలై 31, 2019 నాటికి కనీసం 14 ఏళ్లు ఉండాలి. ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా పాఠశాలలో విద్యను అభ్యసించినట్లు టీసీ/ధ్రువపత్రం చూపాలి.
- సీనియర్ సెకండరీ కోర్సులో ప్రవేశానికి జూలై 31, 2019 నాటికి కనీసం 15 ఏళ్లు ఉండాలి. సెకండరీ (పదో తరగతి) కోర్సు పూర్తిచేయాలి.

### ఫీజులు

సెకండరీ కోర్సుకు సంబంధించి అయిదు సబ్జెక్టులకు పురుషులకు రూ.1800, మహిళలకు రూ.1450; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్ సర్వీస్ కేటగిరీ అభ్యర్థులకు రూ.1200. సీనియర్ సెకండరీకి సంబంధించి అయిదు సబ్జెక్టులకు పురుషులకు రూ.2,000, మహిళలకు రూ.1650; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్ సర్వీస్ కేటగిరీ అభ్యర్థులకు రూ. 1300. అదనపు సబ్జెక్టులు చదవాలనుకొనేవారు పేపర్‌కు అదనంగా రూ.720 చెల్లించాల్సి ఉంటుంది.

### ఏటా రెండుసార్లు

ఎన్ఐఓఎస్‌లో ఏటా రెండు బ్లాకులుగా ప్రవేశాలు కల్పిస్తారు.

**పరీక్ష షెడ్యూల్–2020:**
- **బ్లాక్ 1 పరీక్ష:** ఏప్రిల్/మే, 2020.
- **బ్లాక్ 2 పరీక్ష:** అక్టోబర్/నవంబర్, 2020.
- **వెబ్‌సైట్లు:** https://www.nios.ac.in/
  www.telanganaopenschool.org
  www.apopenschool.org




## ఐవోసీఎల్

ఖాళీలు 413

**ఇం**డియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సదరన్ రీజియన్.. 413 ట్రేడ్ అప్రెంటీస్, టెక్నీషియన్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. **ట్రేడ్ అప్రెంటీస్:** 353.
   **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
2. **టెక్నీషియన్ అప్రెంటీస్:** 60.
   **అర్హత:** సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.

- **వయసు:** 2019, జూలై 31 నాటికి 18–24 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 7, 2019.
- **రాత పరీక్షతేదీ:** ఆగస్టు 18, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iocl.com

## ఎన్‌హెచ్ఎం

కన్సల్టెంట్ ఖాళీలు

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** చైల్డ్ హెల్త్, మెటర్నల్ హెల్త్, నాన్ కమ్యునికబుల్ డిసీజ్, ప్రైమరీ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/అడ్మినిస్ట్రేషన్, ట్రామాకేర్.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ–మెయిల్ ద్వారా.
- **ఈ–మెయిల్:** spmnhm@qmail.com
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

## వైజాగ్ స్టీల్ ప్లాంట్

ఖాళీలు 28

**భా**రత ప్రభుత్వ రంగ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన విశాఖపట్నంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో తాత్కాలిక ప్రాతిపదికన 28 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టులు:** 28.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఆపరేటర్ కమ్ మెకానిక్–12, మైన్ ఫోర్‌మెన్–5, డ్రిల్ టెక్నీషియన్–5, బ్లాస్టర్–2, బ్లాస్టింగ్ హెల్పర్–4.
- **అర్హతలు:** పదో తరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణత. సంబంధిత అనుభవం కలిగి ఉండాలి.
- **వయోపరిమితి:** 01.07.2019 నాటికి 50 ఏళ్లకు మించరాదు. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్టు, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, జాబ్ టెస్టు ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** 2019, ఆగస్టు 12.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2019, ఆగస్టు 31.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.vizagsteel.com

## రైల్వేలో పోస్టులు

ఖాళీలు 21

**సి**కింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 21 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి అర్హులైన పురుష/మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఆర్చరీ–2, అథ్లెటిక్స్–4, బాల్ బ్యాడ్మింటన్–1, బాస్కెట్‌బాల్–2, బాక్సింగ్–1, చెస్–1, హ్యాండ్‌బాల్–2, హాకీ–1, కబడ్డీ–2, టెన్నిస్–1, వాలీబాల్–2, వెయిట్ లిఫ్టింగ్–2.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతితో పాటు ఐటీఐ, ఇంటర్ ఉత్తీర్ణత. సంబంధిత క్రీడా ఈవెంట్లలో పాల్గొని ఉండాలి.
- **వయసు:** 2020, జనవరి 1 నాటికి 18–25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** క్రీడా విజయాల మదింపు, ట్రయల్స్, విద్యార్హతలు, జనరల్ ఇంటెలిజెన్స్/పర్సనాలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ, మహిళా అభ్యర్థులకు రూ.250).
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

## డ్రెడ్జింగ్ కార్పొరేషన్

ఖాళీలు 42

**వి**శాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తాత్కాలిక ప్రాతిపదికన పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టుల వివరాలు:** డ్రెడ్జ్ క్యాడెట్స్–10, ట్రైనీ మెరైన్ ఇంజనీర్స్–10, ఎన్‌సీవీ ట్రైనీ–10, ట్రైనీ ఎలక్ట్రికల్ ఆఫీసర్స్–10, ఇన్‌స్ట్రుమెంట్ ఇంజనీర్–2.
- **అర్హత:** పోస్టులను బట్టి పదో తరగతి, సంబంధిత విభాగాల్లో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.



- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000 (ఎస్సీ/ఎస్టీలకు ఫీజు మినహాయింపు ఉంది).
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.dredgeindia.com

## ప్రవేశాలు

### ఏపీసెట్-2019

యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు అర్హత, పదోన్నతులకు వీలుకల్పించే స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్–2019) ప్రకటనను విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసింది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు రూ.1200, బీసీలకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.700.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 5, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 11, 2019.
- **పరీక్ష తేదీ:** అక్టోబర్ 20, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://apset.net.in

### క్యాట్-2019

**దే**శవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు, ఫెలో ప్రోగ్రాముల కోసం నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)–2019 నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ (జీఎస్), పర్సనల్ ఇంటర్వ్యూ (పీఐ) ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.950.
- **దరఖాస్తుకు ప్రారంభతేదీ:** ఆగస్టు 7, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 18, 2019.
- **పరీక్ష తేదీ:** నవంబర్ 24, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://iimcat.ac.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
- బ్యాంక్ క్లరికల్, పీవో మెటీరియల్
- జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
- నిపుణుల వీడియో గైడెన్స్
- జీఎస్ గత ప్రశ్నపత్రాలు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి



## భారత హెడ్ కోచ్ పదవి రేసులో జయవర్ధనే!

భారత క్రికెట్ హెడ్ కోచ్ పదవి కోసం శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనే దరఖాస్తు చేసినట్లు తెలిసింది. చివరి రోజైన మంగళవారం జయవర్ధనే దరఖాస్తు బీసీసీఐకి చేరినట్లు తెలిసింది. అతనితో పాటు మరో ఇద్దరు విదేశీయులు టామ్ మూడీ (ఆస్ట్రేలియా), మైక్ హెసన్ (న్యూజిలాండ్) కూడా కోచ్ పదవి రేసులో ఉన్నారని సమాచారం. భారత మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్ కూడా ఇప్పటికే కోచ్ పదవిని ఆశిస్తూ బరిలో నిలిచాడు. అయితే కెప్టెన్ విరాట్ కోహ్లి బహిరంగంగా రవిశాస్త్రికి మద్దతు ప్రకటించిన నేపథ్యంలో వీరందరికీ హెడ్ కోచ్‌గా ఏమాత్రం అవకాశం ఉందనేది ఆసక్తికరం.



ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ జట్టుకు ఇచ్చే గదతో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి. ప్రస్తుతం భారత టాప్ ర్యాంక్‌లో ఉంది.

వచ్చేసింది...

# ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్

రేపటి నుంచి యాషెస్ సిరీస్‌తో ప్రారంభం

టెస్టు కిరీటం కోసం రెండేళ్ల సుదీర్ఘ సమరం

9 దేశాల మధ్య 27 సిరీస్‌లు 71 మ్యాచ్‌లు



ICC WORLD TEST CHAMPIONSHIP

44 ఏళ్లలో 12 వన్డే ప్రపంచ కప్‌లను చూశాం! 12 ఏళ్లలో 6 టి20 ప్రపంచ కప్‌ల మజా ఆస్వాదించాం! ఈ ఫార్మాట్లలో ఎవరెవరు, ఎప్పుడెప్పుడు చాంపియన్లయ్యారో చెప్పగలం! మరి... సంప్రదాయ టెస్టుల్లో జగజ్జేత ఎవరంటే? కనీసం ఆ హోదాకు తగిన జట్టేదంటే? ఇంతకాలం 'వీరు' అని చూపలేని పరిస్థితి! మున్ముందు మాత్రం ఈ ఇబ్బంది ఉండదు! కారణం... రాబోయే 'టెస్టు చాంపియన్‌షిప్'! ఐదు రోజుల ఫార్మాట్‌లో ప్రపంచ విజేతను తేల్చేందుకు ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌తో దీనికి రేపటి నుంచి తెరలేవనుంది.

సాక్షి క్రీడా విభాగం

సంప్రదాయ ఫార్మాట్‌లో శతాబ్దంపైగా చిరకాల ప్రత్యర్థులు ఆస్ట్రేలియా–ఇంగ్లండ్. టెస్టు క్రికెట్‌కు అమిత ప్రాధాన్యమిచ్చే ఈ దేశాల మధ్య గురువారం నుంచి జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌తోనే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)నకు తెరలేవనుంది. సమయం, విస్తృతి దృష్ట్యా బహుళ దేశాల టోర్నీ తరహాలో కాకుండా... ముఖాముఖి సిరీస్‌ల ద్వారానే పాయింట్లు కేటాయించి టెస్టు జగజ్జేత ఎవరో తేల్చనున్నారు. ఇందుకోసం మొత్తం 9 దేశాలు పోటీలో ఉండగా, 27 సిరీస్‌లలో భాగంగా వీటి మధ్య రెండేళ్ల వ్యవధిలో 71 టెస్టులు జరుగనున్నాయి. దీనిలో భాగంగా ప్రతి జట్టు ఇంటా, బయటా మూడేసి సిరీస్‌లు ఆడుతుంది. నిర్ణీత గడువు (2021 జూన్) వరకు పాయింట్ల పట్టికలో ఒకటి, రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఇంగ్లండ్ వేదికగా ఫైనల్ (72వ టెస్టు) ఆడతాయి.

**రెండు నుంచి ఐదు....**

చాంపియన్‌షిప్‌లోని సిరీస్‌లలో కనిష్టంగా రెండు, గరిష్టంగా ఐదు టెస్టులున్నాయి. గురువారం నుంచి ప్రారంభమయ్యే చాంపియన్‌షిప్ (ఆగస్ట్ 2019–మార్చి 2021)ను మొదటి దశగా పేర్కొంటున్నారు. రెండో అంచెను జూన్ 2021–ఏప్రిల్ 2023 మధ్య నిర్వహించే ప్రణాళికలున్నాయి. తొలి అంచెలో డే–నైట్ టెస్టులు సహా ఐదు రోజుల టెస్టులకే చోటిచ్చారు.

**సిరీస్‌కు 120 పాయింట్లు...**

ప్రతి సిరీస్‌కు 120 చొప్పున పాయింట్లు కేటాయిస్తారు. సిరీస్‌లోని టెస్టుల సంఖ్యకు తగ్గట్లు ఈ పాయింట్లను విభజిస్తారు. ఉదాహరణకు భారత్–వెస్టిండీస్ మధ్య జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో విజేత జట్టుకు టెస్టుకు గరిష్టంగా 60 వంతున పాయింట్లు లభిస్తాయి. ఈ విధానం ఎలాగంటే..

| సిరీస్‌లో మ్యాచ్‌లు | విజేతకు దక్కే పాయింట్లు | టై | డ్రా | ఓటమి |
|---|---|---|---|---|
| 2 | 60 | 30 | 20 | 0 |
| 3 | 40 | 20 | 13 | 0 |
| 4 | 30 | 15 | 10 | 0 |
| 5 | 24 | 12 | 8 | 0 |

(డ్రా అయిన మ్యాచ్‌కు 3:1 పద్ధతిలో పాయింట్లు దక్కుతాయి)

**ఐసీసీ పర్యవేక్షణ...**

చాంపియన్‌షిప్‌లో భాగమైనప్పటికీ సాధారణ ద్వైపాక్షిక సిరీస్‌ల తరహాలోనే మ్యాచ్ వేదికలు, ప్రసారం, టిక్కెట్లు తదితరాలన్నీ ఆతిథ్య దేశ బాధ్యతలే. మ్యాచ్ అధికారులను సమకూరుస్తూ, నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని గమనిస్తూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పర్యవేక్షణ మాత్రమే చేస్తుంది. టెస్టు మ్యాచ్‌ల ప్రసార హక్కులూ ఆతిథ్య బోర్డువే. ఫైనల్ ప్రసార హక్కులను మాత్రం ఐసీసీ అట్టిపెట్టుకుంది.

**ఆ మ్యాచ్‌లు లెక్కలోకి రావు...**

టాప్–9 (ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భారత్, శ్రీలంక, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్) జట్ల మధ్య జరిగే సిరీస్‌లే డబ్ల్యూటీసీ పరిధిలోకి వస్తాయి. టెస్టు హోదా ఉన్నప్పటికీ అఫ్గానిస్తాన్, ఐర్లాండ్, జింబాబ్వే మధ్య జరిగే మ్యాచ్‌లను చాంపియన్‌షిప్‌లో భాగంగా చూడటం లేదు. అలాగే... డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికకు ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌కు సంబంధం లేదు.

**ఇంగ్లండ్ 22... లంక, పాక్ 13...**

చాంపియన్‌షిప్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడనున్నది ఇంగ్లండ్ (22). ఆస్ట్రేలియా (19), భారత్ (18) దాని తర్వాత ఎక్కువ టెస్టులు ఆడతాయి. శ్రీలంక, పాకిస్తాన్‌లకు తక్కువగా 13 మ్యాచ్‌లు మాత్రమే ఆడే వీలుచిక్కింది. టోర్నీలో ఈ రెండు జట్లతో భారత్‌కు సిరీస్‌లు లేకపోవడం గమనార్హం. భవిష్యత్ పర్యటనల ప్రణాళిక (ఎఫ్‌టీపీ)లో ఉన్నప్పటికీ వన్డే ప్రపంచకప్ ఫైనలిస్టులు ఇంగ్లండ్–న్యూజిలాండ్ మధ్య నవంబరులో జరిగే టెస్టు సిరీస్ డబ్ల్యూటీసీలో భాగం కాకపోవడం విశేషం.

**స్లో ఓవర్ రేట్ ఉంది...**

ఐసీసీ తాజాగా తెచ్చిన నిబంధన ప్రకారం స్లో ఓవర్ రేట్‌కు జట్టు పాయింట్లలో కోత పడుతుంది. ఒక ఓవర్ తక్కువ వేస్తే జట్టుకు రెండు పాయింట్లు కట్ చేస్తారు.

**ఫైనల్ డ్రా అయితే...**

రెండేళ్ల అనంతరం జరిగే ఫైనల్ మ్యాచ్ 'డ్రా' అయితే రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు. రిజర్వ్ డే ఉన్నప్పటికీ ఐదు రోజుల ఆటలో నెట్ ప్లేయింగ్ టైమ్ (రోజుకు ఆరు గంటలు) నష్టపోతేనే దానిని వర్తింపజేస్తారు.

# అదంతా ఒట్టి భ్రమే!

భారత క్రికెట్ జట్టు ఎంపిక, నాయకత్వ మార్పు గురించి ఎప్పుడు చర్చ జరిగినా సెలక్షన్ కమిటీ సభ్యుల కెరీర్‌పైనే అన్ని వైపుల నుంచి ప్రశ్నలు వస్తుంటాయి. ఆరు టెస్టులే ఆడిన ఎమ్మెస్కే ప్రసాద్ ధోని కెరీర్‌ను శాసించడం ఏమిటంటూ సెలక్టర్ల సామర్థ్యంపైనే అందరూ విమర్శలు చేస్తుంటారు. తాజాగా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అయితే దీనిపై ఎమ్మెస్కే ఘాటుగా స్పందించారు. తమ కెరీర్ గణాంకాలకు సంబంధించి వస్తున్న విమర్శలపై స్పష్టంగా సమాధానమిస్తూ ఆయన ఎదురుదాడి చేశారు. తమ ఆటకు, జట్టు ఎంపికకు సంబంధం ఏమిటంటూ సూటిగా ప్రశ్నించారు.



అనుభవం ఉన్నఆటగాడే సెలక్టర్ కానవసరం లేదు | సచిన్‌ను గుర్తించిన దుంగార్పూర్ ఎన్ని టెస్టులు ఆడారు? | చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ఎదురుదాడి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ క్రికెట్ ఆడిన వారికే సెలక్టర్లుగా బాగా పని చేసే సామర్థ్యం ఉంటుందనే ప్రచారంలో వాస్తవం లేదని భారత క్రికెట్ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నారు. అదంతా ఒట్టి భ్రమ మాత్రమేనని ఆయన విశ్లేషించారు. టీమిండియా ఇటీవలి ప్రదర్శన, తమ బృందంపై వచ్చిన విమర్శలు తదితర అంశాలపై ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు ఎమ్మెస్కే మాటల్లోనే...

✦ **సెలక్షన్ కమిటీ స్థాయి, సామర్థ్యం గురించి వచ్చిన విమర్శలపై...**

ఏదో ఒక ఫార్మాట్‌లో అంతర్జాతీయ క్రికెట్ ఆడి ఉండాలనేది మమ్మల్ని సెలక్టర్లుగా నియమించే సమయంలో పెట్టిన కనీస అర్హత. మా సభ్యులలో అందరికీ ఆ అర్హత ఉంది. దీంతో పాటు మేమందరం కలిసి 477 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాం. మా పదవీ కాలంలో 200కు పైగా ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూశాం. ఆటగాళ్లుగానే కాకుండా సెలక్టర్లుగా ఇన్ని మ్యాచ్‌లు చూసిన అనుభవం సరైన ప్రతిభను గుర్తించేందుకు సరిపోదా!

✦ **ఐదుగురు కలిసి ఆడిన టెస్టుల సంఖ్య 13 మాత్రమే కావడంపై...**

నిజంగా అంతర్జాతీయ అనుభవం గురించే చెప్పుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లండ్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎడ్ స్మిత్ ఒకే ఒక టెస్టు ఆడాడు. సుదీర్ఘ కాలం ఆస్ట్రేలియా చీఫ్ సెలక్టర్‌గా పని చేసిన ట్రెవర్ హాన్స్ 7 టెస్టులు మాత్రమే ఆడాడు. 128 టెస్టులు, 244 వన్డేలు ఆడిన మార్క్‌వా, 87 టెస్టులు ఆడిన మరో దిగ్గజం గ్రెగ్ చాపెల్ కూడా ట్రెవర్ నేతృత్వంలో పని చేశారు. ఆయా దేశాల్లో ఎవరూ పట్టించుకోని అనుభవం, స్థాయి మన వద్దకు వచ్చేసరికి ఎందుకు అవసరమవుతుంది? నా ఉద్దేశం ప్రకారం ప్రతీ పదవికి ప్రత్యేక బాధ్యతలు ఉంటాయి. అపార అంతర్జాతీయ అనుభవమే కొలమానమైతే ఒక్క టెస్టు కూడా ఆడని రాజ్‌సింగ్ దుంగార్పూర్‌లాంటి మహానుభావుడు చీఫ్ సెలక్టర్ అయ్యేవాడా? 16 ఏళ్ల వయసున్న సచిన్ టెండూల్కర్‌లాంటి ఒక వజ్రాన్ని ఆయన వెలికి తీసేవాడా? ప్రతిభను గుర్తించాల్సిన సెలక్టర్‌కు స్థాయి, అంతర్జాతీయ అనుభవంతో పనేంటి.

✦ **సెలక్టర్లకు చేవ లేదంటూ సునీల్ గావస్కర్ చేసిన వ్యాఖ్యలపై...**

ఇది చాలా దురదృష్టకరం. దిగ్గజ క్రికెటర్లంటే మాకు ఎంతో గౌరవం ఉంది. వారు వెలిబుచ్చే ప్రతీ అభిప్రాయాన్ని తగిన విధంగా పరిగణలోకి తీసుకుంటాం కూడా. వారి ఆలోచనలు వారికి ఉండవచ్చు. అయితే ఇలాంటి మాటల వల్ల బాధ పడటంకంటే సెలక్షన్ కమిటీ మరింత బలంగా, అంకితభావంతో, కలిసికట్టుగా పని చేయడం ముఖ్యం.

✦ **ఎంపిక విషయంలో కోహ్లి, శాస్త్రిలతో వచ్చే విభేదాలపై...**

ఎక్కువ క్రికెట్ ఆడిన వారికి ఎక్కువ పరిజ్ఞానం ఉంటుందని, అదే కారణంతో వారు సెలక్టర్లకు ఇబ్బంది పెడతారని చాలా మంది అనుకుంటారు. కానీ అది తప్పు. అలా అయితే కోచ్‌ల నుంచి ఇతర సహాయక సిబ్బంది వరకు అంతా అనుభవం ఉన్న క్రికెటర్లతోనే నిండిపోయేది. ఎంపిక సమయంలో కోహ్లి, శాస్త్రి, 'ఎ' జట్టు కోచ్ ద్రవిడ్‌లతో చర్చించడం సహజం. సెలక్టర్లకు కూడా తమ పాత్ర ఏమిటో బాగా తెలుసు. అభిప్రాయ భేదాలు కూడా వస్తాయి కానీ బయటకు చెప్పం. నాలుగు గోడల మధ్య ఏం జరిగిందో అక్కడే ఉండిపోతుంది. చివరకు భారత జట్టు ప్రయోజనాలే అన్నింటికంటే ముఖ్యం.

✦ **గత మూడేళ్లలో సెలక్షన్ కమిటీ పనితీరుపై...**

మా సెలక్షన్ కమిటీ దేశంలోని మూలమూలకూ వెళ్లి ప్రతిభాన్వేషణ సాగించింది. ఒక పద్ధతిలో సరైన వారిని గుర్తించి భారత 'ఎ' జట్టులోకి, సీనియర్ జట్టులోకి తీసుకొచ్చింది. భారత జట్టు 13 టెస్టు సిరీస్‌లలో 11 గెలిచి గత మూడేళ్లుగా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతోంది. వన్డేల్లో విజయశాతం 80–85 మధ్యలో ఉండగా, ఇటీవలి ప్రపంచకప్ సెమీస్ పరాజయం వరకు నంబర్‌వన్‌గా నిలిచాం. చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరడంతో పాటు రెండు సార్లు ఆసియా కప్ సాధించాం. 'ఎ' జట్టు 11 వన్డే సిరీస్‌లలో 11 కూడా గెలిస్తే, 9 టెస్టు సిరీస్‌లలో 8 నెగ్గింది. దాదాపు 35 మంది ఆటగాళ్లను గుర్తించి మూడు ఫార్మాట్‌లలో కూడా ఎంపిక చేశాం. ఇదంతా మా కమిటీ ఘనతగా చెప్పగలను.

## భారత యువతిని పెళ్లాడనున్న పాక్ క్రికెటర్ హసన్ అలీ

**కరాచీ:** మరో పాకిస్తాన్ క్రికెటర్ భారత్‌కు అల్లుడవుతున్నాడు. పేస్ బౌలర్ హసన్ అలీ హరియాణాకు చెందిన షమీమా అర్జూను వివాహమాడనున్నాడు. వచ్చేనెల 20న దుబాయ్‌లోని హోటల్‌లో ఈ నిఖా తంతు జరుగుతుందని క్రికెటర్ సన్నిహితులు వెల్లడించారు. హరియాణా అమ్మాయి అయిన షమీమా దుబాయ్‌లో స్థిరపడింది. భారత్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఆమె ఉన్నత చదువు కోసం ఇంగ్లండ్ వెళ్లింది. అనంతరం ఫ్లైట్ ఇంజనీర్‌గా ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తోంది. కొన్నాళ్ల క్రితం దుబాయ్‌లో ఇద్దరి మధ్య మొదలైన పరిచయం ఇప్పుడు పరిణయం దాకా వచ్చింది. పెళ్లి సంగతి నిజమే కానీ తేదీ మాత్రం ఖరారు కాలేదని హసన్ అలీ చెప్పాడు. మరోవైపు పెళ్లి పనులు కూడా మొదలయ్యాయని దుబాయ్‌లోని అట్లాంటిస్ పామ్ హోటల్‌లో వేడుక జరుగనుందని సన్నిహితులు పేర్కొన్నారు. ఇదే జరిగితే భారత యువతిని పెళ్లి చేసుకుంటున్న నాలుగో పాక్ క్రికెటర్ హసన్ అలీ. ఇదివరకు జహీర్ అబ్బాస్, మోసిన్ ఖాన్, షోయబ్ మాలిక్‌లు భారత వధువుల్ని వివాహమాడారు. షోయబ్ హైదరాబాదీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జాను పెళ్లాడగా వీరికి ఓ కొడుకు (ఇహాన్ మీర్జా మాలిక్) పుట్టాడు.



## క్రికెట్‌కు వేణు గుడ్‌బై

భారత్ తరఫున 16 వన్డేలు ఆడిన ఆంధ్ర ఆటగాడు



**సాక్షి, విశాఖపట్నం:** భారత మాజీ క్రికెటర్, ఆంధ్ర ఆటగాడు వై.వేణుగోపాల రావు (37) ఆటకు గుడ్‌బై చెప్పాడు. క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు అతను ప్రకటించాడు. 2017 అక్టోబరులో ఆంధ్ర, తమిళనాడు మధ్య జరిగిన రంజీ మ్యాచ్‌లో ఆడిన తర్వాత రెండేళ్లుగా వేణుగోపాలరావు మళ్లీ బరిలోకి దిగలేదు. క్రికెట్ కామెంటేటర్‌గా కూడా కొనసాగుతున్న వేణు... ఇటీవలి ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరాడు.

దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో భారత జట్టులోకి వచ్చిన వేణుగోపాలరావు అంతర్జాతీయ కెరీర్ మాత్రం సంతృప్తికరంగా సాగలేదు. 2005 జులైలో తొలి వన్డే ఆడిన అతని కెరీర్ పది నెలల వ్యవధిలోనే 16 వన్డేలకే (ఆరు వేర్వేరు జట్లపై కలిపి) పరిమితమైంది. వేణుగోపాలరావు అంతర్జాతీయ క్రికెట్‌లో తన ఏకైక అర్ధ సెంచరీ (93 బంతుల్లో 61 నాటౌట్) పాకిస్తాన్‌పై అబుదాబిలో సాధించాడు. దక్కన్ చార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున కలిపి వేణు ఐపీఎల్‌లో మొత్తం 65 మ్యాచ్‌లు (2008–2014) ఆడాడు.

ప్రధానంగా విజయ్ హజారే ట్రోఫీ, దేవధర్ ట్రోఫీ, చాలెంజర్ ట్రోఫీలో రాణించడంతో అతనికి వన్డే టీమ్ పిలుపు దక్కినా... అంతకుముందు ఇంగ్లండ్ 'ఎ'తో జరిగిన ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో చేసిన అద్భుత బ్యాటింగ్ వేణుకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 501 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వేణు అజేయంగా 228 పరుగులు చేయడం విశేషం.

ఆంధ్ర క్రికెట్‌కు సంబంధించి మాత్రం వేణుగోపాలరావుకు ప్రత్యేక స్థానం ఉంది. జూనియర్ క్రికెట్‌తో పాటు 19 ఏళ్ల సుదీర్ఘ ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో అతను ఎన్నో సార్లు తన జట్టుకు కీలక విజయాలు అందించాడు. కెరీర్ చివర్లో వేర్వేరు కారణాలతో ఆంధ్ర జట్టుకు దూరమైన అతను రంజీల్లో గుజరాత్, రాజస్తాన్ జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. రిటైర్మెంట్ సందర్భంగా వేణుగోపాలరావును అభినందించి అతని సేవలను ప్రశంసించిన ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అతను భవిష్యత్తులో ఏ రంగంలోనైనా మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

**వేణుగోపాలరావు కెరీర్**

| | మ్యాచ్‌లు | పరుగులు | సగటు | అత్యధిక స్కోరు | 100/50 | వికెట్లు |
|---|---|---|---|---|---|---|
| వన్డేలు | 16 | 218 | 24.22 | 61 నాటౌట్ | 0/1 | 0 |
| ఫస్ట్‌క్లాస్ | 121 | 7081 | 40.93 | 228 నాటౌట్ | 17/30 | 66 |
| లిస్ట్ ఎ | 137 | 4110 | 38.77 | 115 నాటౌట్ | 11/25 | 53 |
| టి20లు | 83 | 1390 | 23.55 | 71 నాటౌట్ | 0/7 | 8 |



## దోప్ టెస్టులో పృథ్వీ షా విఫలం

8 నెలల నిషేధం విధించిన బీసీసీఐ

**న్యూఢిల్లీ:** ముంబై యువ క్రికెటర్, భారత టెస్టు ఓపెనర్ పృథ్వీ షా డోపింగ్ టెస్టులో దొరికిపోయాడు. అతని నుంచి సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షించగా నిషేధిత ఉత్ప్రేరకం తీసుకున్నట్లు తేలింది. దీంతో బీసీసీఐ అతనిపై 8 నెలల నిషేధం విధించింది. కానీ దీన్ని తాజాగా కాకుండా పాత తేదీ (మార్చి 16)తో విధించడం వల్ల వచ్చే నవంబర్ 15వ తేదీతో నిషేధం ముగుస్తుంది. మరో ఇద్దరు జూనియర్ క్రికెటర్లు అక్షయ్, దివ్య గజ్‌రాజ్‌లకు కూడా ఇదే విధమైన నిషేధాన్ని బోర్డు విధించింది. అయితే పృథ్వీ షా కావాలని ఉత్ప్రేరకాన్ని తీసుకోలేదు. దగ్గుతో బాధపడుతుండగా దగ్గుమందులో నిషేధిత టెర్బుటలైన్ అనే ఉత్ప్రేరకం ఉంది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో టెర్బుటలైన్ ఉత్ప్రేరకం ఉంది. దీనిపై అవగాహన లేకే తీసుకున్నట్లు పృథ్వీ బోర్డుకు వివరణ ఇచ్చాడు. కావాలని కాకుండా మెడిసిన్‌గా తీసుకోవడంతో బోర్డు కరుణించి 8 నెలలతో సరిపెట్టింది.

**నిషేధం సరే... మరి ఐపీఎల్ ఆడాడుగా!**

బోర్డు ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ పృథ్వీ షాపై కరుణ చూపించడం బాగానే ఉంది. అతని కెరీర్‌కు ఇబ్బంది లేకుండా పాత తేదీతో విధించింది. అలాంటపుడు ఐపీఎల్ ఆడిన సంగతి మరిచిందా. మార్చి 15 నుంచి నిషేధం అమలైతే మార్చి 23 నుంచి మొదలైన ఐపీఎల్ 12వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడాడుగా... మరి ఇదేరకమైన నిషేధమో బోర్డే సెలవివ్వాలి!

## ప్రిక్వార్టర్స్‌లో ప్రజ్నేశ్

**న్యూఢిల్లీ:** మెక్సికో ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 90వ ర్యాంకర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ శుభారంభం చేశాడు. మెక్సికోలోని లాస్ కబోస్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రజ్నేశ్ 6–4, 1–6, 6–2తో ప్రపంచ 67వ ర్యాంకర్ జాన్ మిల్‌మన్ (ఆస్ట్రేలియా)పై సంచలన విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు.



గంటా 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన ప్రజ్నేశ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో జీవన్ నెడుంజెళియన్–పురవ్ రాజా (భారత్) ద్వయం 3–6, 3–6తో లుకాస్ పుయి–గ్రెగోరి బరెరే (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.

## మెయిన్ 'డ్రా'కు సాయి ఉత్తేజిత

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



సాయి ఉత్తేజిత

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి చుక్కా సాయి ఉత్తేజిత రావు... మధ్యప్రదేశ్ షట్లర్ సౌరభ్ వర్మ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ మ్యాచ్‌లో సాయి ఉత్తేజిత 16–21, 21–14, 21–19తో బ్రిట్నీ ట్యామ్ (కెనడా)పై విజయం సాధించింది. పురుషుల క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో సౌరభ్ వర్మ తొలి మ్యాచ్‌లో 21–18, 21–19తో కంతావత్ లీలావెచాబుత్ర (థాయ్‌లాండ్)పై... రెండో మ్యాచ్‌లో 11–21, 21–14, 21–18తో జౌ జె కి (చైనా)పై గెలుపొంది మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు. భారత్‌కే చెందిన అజయ్ జయరామ్ క్వాలిఫయింగ్ తొలి మ్యాచ్‌లో 16–21, 13–21తో జౌ జె కి (చైనా) చేతిలో ఓడిపోయాడు.

**సాత్విక్ జంట ముందంజ...**

పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా' విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాత్విక్ సాయిరాజ్ తన భాగస్వామి చిరాగ్ శెట్టితో కలిసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–11, 24–26, 21–11తో భారత్‌కే చెందిన సుమీత్ రెడ్డి–మను అత్రి జంటపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జోడీ 7–21, 13–21తో లి వెన్ మె–జెంగ్ యు (చైనా) ద్వయం చేతిలో ఓడిపోయింది. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో చెన్ జియో జిన్ (చైనా)తో సాయి ఉత్తేజిత రావు; ఫిత్యాపోర్న్ చైవాన్ (థాయ్‌లాండ్)తో సైనా నెహ్వాల్ ఆడతారు. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కాంటా సునెయామ (జపాన్)తో సౌరభ్ వర్మ; రెన్ పెంగ్ బో (చైనా)తో కిడాంబి శ్రీకాంత్; వోంగ్ వింగ్ కి విన్సెంట్ (హాంకాంగ్)తో హెచ్ఎస్ ప్రణయ్; మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)తో పారుపల్లి కశ్యప్; లీ జి జియా (మలేసియా)తో సమీర్ వర్మ; కాంతాపోన్ వాంగ్‌చరోయిన్ (థాయ్‌లాండ్)తో సాయిప్రణీత్ తలపడతారు. భారత్‌కే చెందిన శుభాంకర్ డే తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ కెంటా మొమోటా (జపాన్)తో తలపడాల్సింది. అయితే కెంటా మొమోటా చివరి నిమిషంలో టోర్నీ నుంచి వైదొలగడంతో శుభాంకర్ డేకు తొలి రౌండ్‌లో వాకోవర్ లభించింది.

సాక్షి బిజినెస్
బుధవారం 31-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 289 ▼ | 104 ▼ |
| 37,397 | 11,085 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,266 | ▼ 26 |
| డోజోన్స్ | 27,157 | ▼ 65 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,645 | ▼ 39 |
| డాక్స్ | 12,147 | ▼ 270 |
| షాంఘై | 2,952 | ▲ 11 |
| నికాయ్ | 21,709 | ▲ 93 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 67.95 | 69.59 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 82.22 | 85.25 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.25 | 78.11 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.05 | 64.44 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.55 | 48.71 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.33 | 51.08 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.64 | 19.35 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.06 | 19.57 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.38 | 10.74 |

# కాఫీ కింగ్ అదృశ్యం




## తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కాఫీ డే అధినేత సిద్ధార్థ మిస్సింగ్

- ఐటీ అధికారులు, పీఈ ఇన్వెస్టర్ వేధించారంటూ లేఖ
- వ్యాపారంలో విఫలమయ్యానని ఆవేదన...
- ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్న కర్ణాటక పోలీసులు
- ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానాలు
- 20 శాతం కుప్పకూలిన కాఫీ డే షేరు...

సాక్షి, బెంగళూరు

దేశ కార్పొరేట్ ప్రపంచమంతా మంగళ వారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కాఫీ కింగ్‌గా పేరొందిన ప్రముఖ వ్యాపారవేత్త, కెఫే కాఫీ డే(సీసీడీ) వ్యవస్థాపకుడు, కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ అల్లుడు వీజీ సిద్ధార్థ అదృశ్యమయ్యారన్న వార్త తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే, వ్యాపారవేత్తగా తాను విఫలమయ్యానని పేర్కొంటూ సిద్ధార్థ సంతకంతో ఒక లేఖ బయటపడింది. అందులో ఆదాయపు పన్ను అధికారులు, పీఈ భాగస్వామ్య సంస్థ నుంచి తీవ్రమైన వేధింపులు ఉన్నాయంటూ ఆయన పేర్కొనడం పారిశ్రామిక వర్గాలను నివ్వెరపోయేలా చేసింది. సిద్ధార్థ అదృశ్య వార్తలతో కాఫీ డే షేరు ధర 20 శాతం కుప్పకూలింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సిద్ధార్థ నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? ప్రమాదవశాత్తు పడిపోయారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

### ఇలా అదృశ్యమయ్యారు

'సోమవారం సాయంత్రం సకలేశపురకు అని చెప్పి డ్రైవర్ బసవరాజు దేశాయితో కలసి వీజీ సిద్ధార్థ బయలుదేరారు. కానీ సకలేశపురకు చేరుకోగానే, అక్కడి నుంచి మంగళూరుకు వెళ్లు అని డ్రైవర్‌కు సూచించారు. మంగళూరు సమీపంలోని ఉల్లాల్ వద్ద నున్న నేత్రావతి నది వద్దకు చేరుకోగానే కారు నిలపమని డ్రైవర్‌ను ఆదేశించారు. ఆ తర్వాత కారును వంతెనకు అటువైపు చివరకుతీసుకెళ్లి నిలిపి ఉండు, నేను నడుచుకుంటూ కారు దగ్గరికి వస్తాను అని చెప్పి దిగేశారు. అయితే వంతెనపై నడుచుకుంటూ ఎంత సేపటికీ రాకపోవడంతో డ్రైవర్ వెనక్కి వచ్చి చూడగా చుట్టుపక్కల ఎక్కడా సిద్ధార్థ కనిపించలేదు. ఫోన్ చేస్తేనేమో స్విచ్చాఫ్ అయింది. దీంతో డ్రైవర్ పోలీసులకు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు' అని దక్షిణ కన్నడ జిల్లా డిప్యూటీ కమిషనర్ సెంథిల్ శశికాంత్ సెంథిల్ పేర్కొన్నారు. అదృశ్య వార్తను సిద్ధార్థ కుమారుడికి ఫోన్ చేసి డ్రైవర్ వెల్లడించాడు.. వారు కూడా స్థానిక కాఫీడే సిబ్బందికి తెలియజేసి గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగి గాలింపు ప్రారంభించింది. సిద్ధార్థ అదృశ్యంపై అతని కారు డ్రైవర్‌ని మంగళూరు పోలీసులు ప్రశ్నించారు. సిద్ధార్థ కాల్ డేటా ఆధారంగా అన్ని కోణాల్లోనూ విచారణ సాగిస్తున్నారు. మంగళూరులో సిద్ధార్థ బస చేసే హోటళ్లు, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లోని హోటల్లు, బంధువుల ఇళ్లలోనూ గాలింపు చేపట్టారు.



చివరిసారిగా సిద్ధార్థ ప్రయాణించిన కారు



మంగళవారం నేత్రావతి నది వంతెన వద్ద గాలింపు చర్యలు

### ఆత్మహత్యా అనుమానాలు

ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న ఆయన వాటిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెంగళూరు నుంచి మంగళూరుకు కారులో వెళుతున్నంత సేపు తన స్నేహితులకు ఫోన్లు చేసి 'నన్ను క్షమించండి' అంటూ భాగోద్వేగానికి లోనవడంతో ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా, మంగళూరు నగరంలోని డీసీపీలు హనుమంతరాయ, లక్ష్మి గణేశ్‌ల నేతృత్వంలోని సుమారు 200 మందికి పైగా పోలీసు సిబ్బంది, అధికారులు సోమవారం రాత్రి నుంచి సిద్ధార్థ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సిద్ధార్థ అదృశ్యమైన నేత్రావతి నదిలో గజ ఈతగాళ్లు, 25 బోట్లు ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టారు. నది చుట్టుపక్కల కూడా వెతుకుతున్నారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు సంఘటన స్థలంలో మకాం వేసి శోధిస్తున్నారు. అలాగే వీరికి కోస్టుగార్డు సిబ్బంది, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బంది కూడా సాయపడుతున్నారు. స్థానిక మత్స్యకారుల సాయం కూడా తీసుకుంటున్నామని, చివరిగా ఆయన ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారో కూడా చెక్ చేస్తున్నామని మంగళూరు పోలీస్ కమిషనర్ సందీప్ పాటిల్ వెల్లడించారు.

### ఎస్‌ఎం కృష్ణకు నేతల పరామర్శ

సిద్ధార్థ అదృశ్యంతో బెంగళూరు సదాశివనగరలో ఆయన మామ ఎస్‌ఎం కృష్ణ ఇంటి వద్ద విషాద వాతావరణం నెలకొంది. శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు రాజకీయ, సినీ ప్రముఖులు తరలివచ్చారు. మాజీ ప్రధాని దేవెగౌడ, సీఎం యడియూరప్ప, మాజీ సీఎం కుమారస్వామి, సీఎల్పీ నాయకుడు సిద్ధరామయ్య తదితరులు కృష్ణకు ధైర్యం చెప్పారు.

### షేరు.. క్రాష్

సిద్ధార్థ అదృశ్యంతోపాటు కంపెనీలో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరిగాయన్న వార్తలతో సీసీడీ షేరు కుప్పకూలింది. మంగళవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో 20 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకంది. రూ.154 వద్ద స్థిరపడింది. ఇది ఏడాది కనిష్ట స్థాయి. కాగా, ఈ భారీ పతనంతో కంపెనీ మొత్తం మార్కెట్ విలువ రూ.813 కోట్లు ఆవిరై రూ. 3,254 కోట్లకు దిగజారింది.

### వ్యాపారవేత్తగా విఫలమయ్యా...

*ఆర్థిక ఒత్తిళ్లతో అదృశ్యమైన వీజీ సిద్ధార్థ కాఫీ డే ఉద్యోగులు, బోర్డు సభ్యులకు రాసినట్లు పేర్కొంటూ ఒక లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సిద్ధార్థ కనిపించకుండాపోవడానికి రెండు రోజుల ముందు(ఈ నెల 27న) తేదీతో ఈ లేఖ ఉండటం గమనార్హం. ఆయన లేఖలో ఏం చెప్పారంటే...*

'గడిచిన 37 ఏళ్లుగా ఎంతో నిబద్ధతతో కష్టపడిపనిచేస్తూ నేను స్థాపించిన కంపెనీలు, అనుబంధ సంస్థల్లో 30 వేలకు పైగా ఉద్యోగాలను సృష్టించా. అదేవిధంగా నేను అతిపెద్ద వాటాదారుగా ఉన్న మరో టెక్నాలజీ కంపెనీలో కూడా 20 వేల కొలువులను తీసుకొచ్చా. అయితే, నా కష్టమంతా ధారపోసినప్పటికీ.. ఆయా సంస్థలను లాభదాయకమైన వ్యాపార దిగ్గజాలుగా తీర్చిదిద్దడంలో విఫలమయ్యా. నామీద నమ్మకంతో చేదోడుగా నిలిచినవారందరినీ క్షమించమని కోరుతున్నా. ఎందుకంటే నేను ఎంతగా ప్రయత్నించినా నామీద ఉన్న ఒత్తిళ్లతో నిస్సహాయుడిగా ఉండిపోయా. ప్రైవేటు ఈక్విటీ(పీఈ) భాగస్వామ్య సంస్థల్లో ఒకదాని నుంచి షేర్ల బైబ్యాక్ కోసం విపరీతమైన ఒత్తిడి రావడంతో స్నేహితుల నుంచి భారీ మొత్తంలో అప్పులుతెచ్చిమరీ కొంత మేరకు ఈ లావాదేవీలను ఆరు నెలల క్రితం పూర్తిచేశాను. మరోపక్క, రుణ దాతల నుంచి కూడా ఒత్తిడి పెరిగిపోవడంతో పరిస్థితి దిగజారింది. అంతేకాదు.. మైండ్‌ట్రీలో షేర్ల అమ్మకం డీల్‌కు సంబంధించి గతంతో ఆదాయపు పన్ను(ఐటీ) డీజీ నుంచి కూడా వేధింపులను ఎదుర్కొన్నా. ఒప్పందాన్ని అడ్డుకోవడం కోసం రెండుసార్లు నా వాటా షేర్లను అటాచ్ చేయడంతో పాటు కాఫీ డే షేర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఐటీ రిటర్నులను వాళ్లు చెప్పినట్లు సవరించి వేసినా నన్ను వేధించారు. ఈ అన్యాయమైన చర్యలతో కంపెనీలో తీవ్రమైన నగదు కొరతకు దారితీసింది. నా ముందున్న దారులన్నీ మూసుకుపోయాయి. ఈ సమయంలో మీరంతా కొత్త యాజమాన్యం నేతృత్వంలో మన వ్యాపారాన్ని కొనసాగించేందుకు శక్తివంచనలేకుండా కృషిచేయాలని కోరుతున్నాను. జరిగిన తప్పులన్నింటికీ నాదే పూర్తి బాధ్యత. అంతేకాదు సంస్థలో జరిగిన ఆర్థిక లావాదేవీలన్నింటికీ కూడా నేనే బాధ్యత తీసుకుంటున్నా. ఆడిటర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ ఇతరత్రా ఉద్యోగులెవరికీ వీటి గురించి తెలియదు. చివరికి నా కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాలను చెప్పలేదు. మోసం చేయడం, తప్పుదోవపట్టించాలన్నది నా ఉద్దేశం కానేకాదు. చట్టపరంగా ఈ మొత్తం పరిణామాలన్నింటికీ నాదే బాధ్యత. ఒక వ్యాపారవేత్తగా నేను విఫలమయ్యాను. ఎదో ఒకరోజు నా నిజాయితీని మీరంతా గుర్తించి, నన్ను క్షమిస్తారని భావిస్తున్నా. నాకున్న ఆస్తుల విలువతో పాటు వాటి జాబితాను కూడా మీకు తెలియజేస్తున్నా. అప్పులన్నీ తీర్చేయడానికి నా ఆస్తులు సరిపోతాయి'

– వీజీ సిద్ధార్థ

### సీసీడీడీలో 6% వాటా ఉంది: కేకేఆర్




సీసీడీ వ్యవస్థాపకుడు సిద్ధార్థ అదృశ్యం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కేకేఆర్ పేర్కొంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఆయన కుటుంబ సభ్యులంతా ధైర్యంగా ఉండాలని ఒక ప్రకటన విడుదల చేసింది. సిద్ధార్థపైన నమ్మకంతో సీసీడీలో తాము తొమ్మిదేళ్ల క్రితం చేసిన పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని గతేడాది విక్రయించామని.. దీంతో తమ వాటా 10.3 శాతం నుంచి ప్రస్తుతం 6 శాతానికి పరిమితమైనట్లు కేకేఆర్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఒక పీఈ ఇన్వెస్టర్ నుంచి షేర్ల బైబ్యాక్ కోసం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నానంటూ సిద్ధార్థ రాసినట్లు చెబుతున్న లేఖలో బయటపడిన నేపథ్యంలో కేకేఆర్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా పీఈ ఫండ్స్ ఏడాది నుంచి ఏడేళ్ల కాలానికి మాత్రమే పెట్టుబడులు పెట్టి వైదొలగుతుంటాయని, అయితే తాము మాత్రం సీసీడీ వృద్ధి చెందేంతవరకూ సహకారం అందించి కొంత వాటాను మాత్రమే విక్రయించామని కేకేఆర్ వివరించింది.

### బకాయిలేమీ లేవు: హెచ్‌డీఎఫ్‌సీ




సిద్ధార్థతో సంబంధం ఉన్న కంపెనీల నుంచి తమకు రుణ బకాయిలు ఉన్నట్లు వచ్చిన వార్తలను హెచ్‌డీఎఫ్‌సీ తోసిపుచ్చింది. 'సీసీడీకి చెందిన టాంగ్లిన్ డెవలప్‌మెంట్స్ బెంగళూరులోని గ్లోబల్ విలేజ్ టెక్ పార్క్ ప్రాజెక్టు కోసం గతంలో మేం రుణాలిచ్చాం. అయితే, 2019 జనవరిలో ఈ మొత్తం రుణాన్ని సంబంధిత సంస్థ చెల్లించేసింది. ప్రస్తుతం కాఫీడే ఎంటర్ ప్రైజెస్ గ్రూపు నుంచి మాకు ఎలాంటి బకాయిలూ లేవు' అని హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు.

### పరిస్థితిని సమీక్షిస్తున్నాం: సీసీడీ




సిద్ధార్థ అదృశ్యంతో సీసీడీ డైరెక్టర్ల బోర్డు మంగళవారం అత్యవసరంగా సమావేశమైంది. సిద్ధార్థ రాసినట్లు బయటికొచ్చిన లేఖలోని అంశాలను సమీక్షించడంతోపాటు లేఖ కాపీలను సంబంధిత అధికారులకు అందజేసినట్లు కంపెనీ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. కాగా, వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం లేకుండా తగిన చర్యలపై దృష్టిపెట్టినట్లు వెల్లడించింది. 'సిద్ధార్థ అదృశ్య సంఘటనతో మేం షాక్‌కు గురయ్యాం. ఆయన కుటుంబ సభ్యులు, ఆప్తులకు మా పూర్తి మద్దతను తెలియజేస్తున్నాం. ఆయన ఆచూకీ కోసం మేం అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. నిపుణులైన నాయకత్వంలో కంపెనీ నడుస్తున్నందున వ్యాపార కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయి' అంటూ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది.

### సిద్ధార్థ నదిలో దూకడాన్ని చూశా

యశవంతపుర (బెంగళూరు): కాఫీ డే యజమాని సిద్ధార్థ నేత్రావతి నదిలో దూకడాన్ని తాను ప్రత్యక్షంగా చూసినట్లు సైమన్ డిసోజా అనే స్థానిక జాలరి తెలిపారు. తను చేపలకు వల వేస్తుండగా నీటిలోకి ఎవరో దూకిన శబ్దం వినిపించిందని మంగళవారం స్థానిక మీడియాకు తెలిపారు. తను అక్కడికి వెళ్లేలోపు దూకిన వ్యక్తి నీటి ప్రవాహానికి కొట్టుకుపోతూ లోపలికి మునిగిపోయాడని చెప్పారు. రాత్రి 7 నుంచి 7:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ అనేకం జరిగినట్లు తెలిపారు.



### బ్లాక్‌మనీ ఉన్నట్లు సిద్ధార్థ అంగీకరించారు: ఐటీ శాఖ



అదృశ్యమైన కాఫీ డే వ్యవస్థాపకుడు సిద్ధార్థను తాము గతంలో దర్యాప్తు సందర్భంగా వేధించామన్న ఆరోపణలను ఆదాయపు పన్ను శాఖ ఖండించింది. లేఖలోని సిద్ధార్థ సంతకం, తమ దగ్గరున్న సంతకానికి చాలా తేడా ఉందని ఐటీ శాఖ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. గతంలో తాము జరిపిన సోదాల్లో తనవద్ద బ్లాక్‌మనీ ఉన్నట్లు సిద్ధార్థ అంగీకరించారని కూడా ఐటీ శాఖ తెలిపింది. భారీ మొత్తంలో పన్ను ఎగవేతలకు పాల్పడినట్లు తగిన ఆధారాలు దొరకడంతోనే షేర్లను అటాచ్ చేశామని, 2017లో కాఫీ డే గ్రూపు కంపెనీల్లో సోదాలను కూడా చేశామని ఐటీ అధికారులు చెప్పారు. ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారమే తాము చర్యలు తీసుకున్నామని కూడా స్పష్టం చేశారు. కాగా, మైండ్ ట్రీ షేర్ల విక్రయం ద్వారా సిద్ధార్థకు దాదాపు రూ.3,200 కోట్లు వచ్చాయని.. ఈ డీల్ విషయంలో కనీస ప్రత్యామ్నాయ పన్నుగా రూ.300 కోట్లను సిద్ధార్థ చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.46 కోట్లను మాత్రమే కట్టారని కూడా ఐటీ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ వద్ద రూ.362.11 కోట్ల లెక్కలో చూపని ఆదాయం(బ్లాక్ మనీ) తో పాటు, తన వద్ద రూ.118.02 కోట్ల నగదు ఉన్నట్లు సిద్ధార్థ ఒప్పుకున్నారని ఐటీ వర్గాలు వివరించాయి.

### దేశీ కాఫీ కింగ్ సిద్ధార్థ..



దాదాపు 140 ఏళ్లుగా కాఫీ వ్యాపారంలో ఉన్న కుటుంబం నుంచి వచ్చిన సిద్ధార్థ జీవితంలో పలు మలుపులు ఉన్నాయి. ఆయన ముందుగా భారతీయ ఆర్మీలో చేరాలనుకున్నారు. కానీ ఎకనమిక్స్‌లో మాస్టర్స్ పట్టా తీసుకున్న తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకరుగా మారారు. 1984లో సొంతంగా శివన్ సెక్యూరిటీస్ పేరిట ఇన్వెస్ట్‌మెంట్, వెంచర్ క్యాపిటల్ సంస్థను ప్రారంభించారు. దాన్నుంచి వచ్చిన లాభాలతో కర్ణాటకలోని చిక్‌మగళూర్ జిల్లాలో కాఫీ తోటలను కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. అదే సమయంలో కుటుంబ కాఫీ వ్యాపారంపై మరింత ఆసక్తి పెంచుకున్నారు. 1993లో అమాల్గమేటెడ్ బీన్ కంపెనీ (ఏబీసీ) పేరిట కాఫీ ట్రేడింగ్ కంపెనీ ప్రారంభించారు. అప్పట్లో రూ. 6 కోట్లుగా ఉన్న ఈ సంస్థ వార్షిక టర్నోవరు ఆ తర్వాత రూ. 2,500 కోట్ల స్థాయికి చేరింది. దేశీయంగా ఇది ప్రస్తుతం అతి పెద్ద గ్రీన్ కాఫీ ఎగుమతి సంస్థ. ఇక, జర్మన్ కాఫీ చెయిన్ 'చిబో' స్ఫూర్తితో సొంత కెఫేలను కూడా సిద్ధార్థ ప్రారంభించారు. తేనీటిప్రియులను కూడా ఘుమఘుమలాడే కాఫీ వైపు మళ్లేలా చేశారు. 1994లో బెంగళూరులో తొలి కెఫే కాఫీ డే ప్రారంభమైంది. ప్రస్తుతం వియన్నా, ప్రాగ్, కౌలాలంపూర్ తదితర 200 పైచిలుకు నగరాల్లో ప్రపంచవ్యాప్తంగా 1,750 కెఫే కాఫీ డే అవుట్‌లెట్స్ ఉన్నాయి. 2015లో కాఫీ డే పబ్లిక్ ఇష్యూకి కూడా వచ్చింది.

### మైండ్‌ట్రీ డీల్‌తో రూ.3,200 కోట్లు




కాఫీ దగ్గరే ఆగిపోకుండా సిద్ధార్థ కొంగొత్త వ్యాపారాల్లోకి కూడా అడుగుపెట్టారు. ఇటు ఆర్థిక సేవల నుంచి అటు ఐటీ దాకా వివిధ రంగాల్లో కార్యకలాపాలు విస్తరించారు. ఐటీ రంగంలో ప్రవేశించి గ్లోబల్ టెక్నాలజీ వెంచర్స్‌ని ఏర్పాటు చేశారు. అటు ఆర్థిక సేవలు అందించే శివన్ సెక్యూరిటీస్ కింద చేతన్ ఉడ్ ప్రాసెసింగ్, బేర్‌ఫుట్ రిసార్ట్స్ (ఆతిథ్య రంగం), డార్క్ ఫారెస్ట్ ఫర్నిచర్ (కలప వ్యాపారం) పేరిట మరో మూడు అనుబంధ సంస్థలు ఏర్పాటు చేశారు. 1999లో సుబ్రతో బాగ్చీ, కేకే నటరాజన్, రోస్టో రవనన్‌లు మైండ్‌ట్రీ సంస్థను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నప్పుడు సిద్ధార్థను కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా తీసుకొచ్చారు ఐటీ రంగంలో సీనియర్ అయిన అశోక్ సూతా. ఒక దశలో మైండ్‌ట్రీలో ఆయన అతి పెద్ద వాటాదారు కూడా. ఈ ఏడాది మార్చిలోనే తనకున్న 20.41 శాతం వాటాలను లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ)కి విక్రయించారు. ఈ వివాదాస్పద డీల్ ద్వారా రూ. 3,200 కోట్లు వచ్చాయి. దాదాపు రూ. 2,900 కోట్ల రుణభారాన్ని ఈ నిధులతో తగ్గించుకున్నారు.

### అప్పుల కుప్ప.. కాఫీ డే

కాఫీ డే చెయిన్ మాతృ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌కు ఈ ఏడాది మార్చి నాటికి రూ. 6,550 కోట్ల మేర రుణభారం పేరుకుపోయింది. రుణాలతో పాటు నష్టాలు కూడా భారీగా పెరిగిపోయాయి. దేశీయంగా కాఫీ ఉత్పత్తి తగ్గినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలు 13 ఏళ్ల కనిష్టానికి పడిపోవడం కీలకమైన సిద్ధార్థ వ్యాపారాన్ని గట్టిగానే దెబ్బతీసింది. అయితే, రుణాల భారాన్ని తగ్గించుకునేందుకు మైండ్‌ట్రీలో వాటాలు విక్రయించేసిన సిద్ధార్థ.. ఇతర వ్యాపారాల్లో కూడా వాటాలను విక్రయించే ప్రయత్నాల్లో ఉన్నారు. రూ. 10,000 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువతో కెఫే కాఫీ డే (సీసీడీ)లో కొంత వాటాలను కోకకోలా సంస్థకు అమ్మేసేందుకు చర్చలు కూడా జరిపినట్లు వార్తలు వచ్చాయి. రియల్టీ రంగంలో సిద్ధార్థ నెలకొల్పిన టాంగ్లిన్ డెవలప్‌మెంట్స్‌లో దాదాపు రూ. 2,800 కోట్లతో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్ కూడా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.




# యాక్సిస్ బ్యాంక్ లాభం డబుల్

**రూ.1,370 కోట్లకు నికర లాభం ● 19 శాతం రుణ వృద్ధి**
**మెరుగుపడిన రుణ నాణ్యత**

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ నికర లాభం(స్టాండ్అలోన్) ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 95 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.701 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.రూ.1,370 కోట్లకు పెరిగిందని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.15,702 కోట్ల నుంచి రూ.19,124 కోట్లకు పెరిగిందని బ్యాంక్ సీఈఓ అమితాబ్ చౌధురి చెప్పారు. కన్సాలిడేటెడ్ పరంగా చూస్తే, గత క్యూ1లో రూ. 722 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో 75 శాతం పెరిగి రూ.1,263 కోట్లకు ఎగసిందని పేర్కొన్నారు. ఆదాయం రూ.16,126 కోట్ల నుంచి రూ.19,409 కోట్లకు పెరిగిందని తెలిపారు. నికర లాభం భారీగా పెరిగినా మొండి బకాయిల సమస్య నుంచి పూర్తిగా గట్టెక్కలేకపోయామని చెప్పారు. అదనంగా రూ.2,358 కోట్ల మేర కేటాయింపులు జరిపామని, వీటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే నికర లాభం మరింతగా పెరిగేదని వివరించారు.

### రూ.5,844 కోట్ల నికర వడ్డీ ఆదాయం....

నికర వడ్డీ ఆదాయం 13 శాతం వృద్ధితో రూ.5,844 కోట్లకు పెరిగిందని అమితాబ్ చౌధురి తెలిపారు. ఇతర ఆదాయం 32 శాతం వృద్ధితో రూ.3,868 కోట్లకు ఎగసిందని పేర్కొన్నారు. 19 శాతం రుణ వృద్ధి సాధించామని, నికర వడ్డీ మార్జిన్(గ్లోబల్) 3.40 శాతంగా ఉందని చెప్పారు. రిటైల్ రుణాలు 22 శాతం, కార్పొరేట్ రుణాలు 16 శాతం చొప్పున పెరిగాయని పేర్కొన్నారు. ఈ బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ1లో 6.52 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 5.25 శాతానికి తగ్గాయని అమితాబ్ చౌధురి వెల్లడించారు. నికర మొండి బకాయిలు 3.09 శాతం నుంచి 2.04 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు. మొండి బకాయిలు తగ్గినప్పటికీ, మొండి బకాయిలు, ఇతరాలకు కేటాయింపులు రూ.3,338 కోట్ల నుంచి రూ.3,815 కోట్లకు పెరిగాయని వివరించారు.




**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో యాక్సిస్ బ్యాంక్ షేర్ 2 శాతం నష్టంతో రూ.707 వద్ద ముగిసింది.**

# టెక్ మహీంద్రా లాభం 959 కోట్లు

**7 శాతం వృద్ధి ● 4 శాతం తగ్గిన మార్జిన్ ● రూ.8,653 కోట్లకు ఆదాయం**

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.959 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో ఆర్జించిన నికర లాభం, రూ. 898 కోట్లుతో పోల్చితే 7 శాతం వృద్ధి సాధించామని టెక్ మహీంద్రా తెలిపింది. మొత్తం ఆదాయం రూ.8,388 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ.8,653 కోట్లకు చేరిందని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ సీపీ గుర్నానీ తెలిపారు. సీక్వెన్షియల్‌గా చూస్తే, 3 శాతం క్షీణించిందని చెప్పారు. మార్చి క్వార్టర్(గత క్యూ4లో)లో 16.1 శాతంగా ఉన్న మార్జిన్ 4 శాతం తగ్గి 15.2 శాతానికి చేరిందని తెలిపారు. (ఇతర ఐటీ కంపెనీల సగటు మార్జిన్ 24 శాతంగా ఉంది)భవిష్యత్తులో మంచి వృద్ధిని సాధించగలమన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. రెండు భారీ డీల్స్ దాదాపు ఖరారయ్యే దశలో ఉన్నాయని వివరించారు.

### రికార్డ్ స్థాయి డీల్స్..

ఎంటర్‌ప్రైజ్, కమ్యూనికేషన్స్ విభాగాల్లో 50 కోట్ల డాలర్ల డీల్స్ సాధించామని గుర్నానీ తెలిపారు. ఈ క్యూ1లో రికార్డ్ స్థాయిలో 48 కోట్ల డాలర్ల డీల్స్ సాధించామని చెప్పారు. డీల్స్ విషయంలో మంచి పురోగతి సాధిస్తున్నామని డిమాండ్ బాగా ఉంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. డిజిటల్ విభాగం కూడా మంచి వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. సాధారణంగా ఈ క్యూ1లో కమ్యూనికేషన్స్ విభాగం బలహీనంగా ఉంటుందని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మనోజ్ భట్ తెలిపారు. దీంతో పాటు వేతనాల పెంపు, రూపాయి పుంజుకోవడం, అమెరికా వీసాల ఫీజులు పెరగడం కూడా ప్రభావం చూపడంతో మార్జిన్లు తగ్గాయని వివరించారు. ఆటోమేషన్, కృత్రిమ మేధ అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ ఏడాది వేగవంతమైన వృద్ధి సాధనకు ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు.




### టెక్ మహీంద్రా చేతికి మ్యాడ్‌పా

కాగా అమెరికాకు చెందిన స్ట్రాటజిక్ డిజైన్ కన్సల్టెన్సీ సంస్థ, మ్యాడ్‌పాను టెక్ మహీంద్రా కొనుగోలు చేసింది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలను టెక్ మహీంద్రా వెల్లడించలేదు. డిజిటల్ విభాగంలో మరింత వృద్ధి సాధించడానికి ఈ కంపెనీ కొనుగోలు తోడ్పడుతుందని గుర్నానీ పేర్కొన్నారు. ఈ కంపెనీ కొనుగోలుతో డిజిటల్ విభాగంలో అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మరింతగా విస్తరించగలమని తెలిపారు.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టెక్ మహీంద్రా షేర్ 1 శాతం నష్టంతో రూ.640 వద్ద ముగిసింది.**

# 11,100 దిగువకు నిఫ్టీ

## రెండో రోజూ కొనసాగిన నష్టాలు
- కీలక స్థాయిల దిగువకు సెన్సెక్స్, నిఫ్టీలు
- 289 పాయింట్లు పతనమై 37,397కు సెన్సెక్స్
- 104 పాయింట్ల నష్టంతో 11,085కు నిఫ్టీ



ఆరంభ లాభాలు కోల్పోయి మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండో రోజూ క్షీణించాయి. సెన్సెక్స్ 37,500 పాయింట్ల, నిఫ్టీ 11,100 పాయింట్ల (200 రోజుల మూవింగ్ యావరేజ్–11,140 పాయింట్లు) దిగువకు పతనమయ్యాయి. కంపెనీల క్యూ1 ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ పది పైసలు పతనం కావడం, ముడి చమురు ధరలు పెరగడం ప్రతికూల ప్రభావం చూపించాయి. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చలు ఆరంభం కావడం, ఫెడరల్ రిజర్వ్ కీలక సమావేశం మంగళవారం రాత్రి నుంచి మొదలు కానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బ్యాంక్, వాహన, లోహ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 289 పాయింట్లు నష్టపోయి 37,397 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 104 పాయింట్ల నష్టంతో 11,085 పాయింట్ల వద్ద ముగిశాయి. నిఫ్టీకి ఇది దాదాపు ఐదు నెలల కనిష్ట స్థాయి. సెన్సెక్స్‌కు రెండున్నర నెలల కనిష్ట స్థాయి.

**చివరి గంటన్నరలో నష్టాలు:** అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం చర్చలు ఆరంభం కావడం, రేట్ల కోత ఉండగలదన్న అంచనాల నడుమ అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం మొదలు కానుండటంతో ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. ఆసియా మార్కెట్ల జోరుతో మన మార్కెట్ కూడా లాభాల్లోనే మొదలైంది. రోజులో ఎక్కువ భాగం లాభాల్లో కొనసాగిన సెన్సెక్స్, నిఫ్టీలు చివరి గంటన్నరలో నష్టాల్లోకి జారిపోయాయి. ఒక దశలో 264 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 327 పాయింట్ల వరకూ నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 591 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

- యస్ బ్యాంక్ 9 శాతం నష్టంతో రూ.86 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వి.జి. సిద్దార్థ అదృశ్యం కావడంతో కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేర్ ధర 20 శాతం లోయర్ సర్క్యూట్‌తో రూ.154 వద్ద ముగిసింది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.800 కోట్ల మేర కరిగిపోయింది.
- దాదాపు 600కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. అయితే భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా లాభపడింది.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,278 |
| ఎన్‌ఎస్‌ఈ | 35,300 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 13,60,912 |
| ఎఫ్‌ఐఐ | -645 |
| డీఐఐ | 1,080 |

- రెండు రోజుల స్టాక్ మార్కెట్ నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.3.09 లక్షల కోట్లు ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.3.09 లక్షల కోట్లు తగ్గి రూ.1,40,73,090 కోట్లకు పరిమితమైంది.

## నేటి బోర్డ్ సమావేశాలు

ఐషర్ మోటార్స్, ఇండియన్ ఆయిల్ కార్పొ, అశోక్ లేలాండ్, అలహాబాద్ బ్యాంక్, ఫ్యూచర్ రిటైల్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, కేర్ రేటింగ్స్, అపోలో టైర్స్, యూపీఎల్, సింఫనీ, జీ మీడియా కార్పొరేషన్, ఫ్యూచర్ సప్లై చెయిన్ సొల్యూషన్స్, అజంతా ఫార్మా, ఇండియాబుల్స్ వెంచర్స్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హెరిటేజ్ ఫుడ్స్, బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్,

# బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం రెండు రెట్లు అప్

- రూ.11,527 కోట్లకు ఆదాయం
- పెరిగిన కేటాయింపులు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రెండు రెట్లు పెరిగింది. గత క్యూ1లో రూ.95 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.243 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. మొత్తం ఆదాయం రూ.10,631 కోట్ల నుంచి రూ.11,527 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

**తగ్గిన మొండి బకాయిలు...**
బ్యాంక్ రుణ నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. గత క్యూ1లో రూ.16.66 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 16.50 శాతానికి తగ్గాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. అలాగే నికర మొండి బకాయిలు 8.45 శాతం నుంచి 5.79 శాతానికి తగ్గాయని పేర్కొంది. విలువ పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.60,604 కోట్ల నుంచి రూ.62,068 కోట్లకు పెరగ్గా, నికర మొండి బకాయిలు రూ.27,932 కోట్ల నుంచి రూ.19,288 కోట్లకు తగ్గాయని వివరించింది. కేటాయింపులు మాత్రం రూ.8,762 కోట్ల నుంచి రూ.9,256 కోట్లకు పెరిగాయని తెలిపింది.



ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ బీఎస్‌ఈలో 6.5 శాతం నష్టంతో రూ.70.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.69.95ను తాకింది.

# స్పీడ్ పెరిగిన... హీరో మోటార్స్

### క్యూ1లో రూ. 1,257 కోట్లు

**న్యూఢిల్లీ:** దేశీ ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 1,257 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నమోదైన రూ. 925 కోట్లతో పోలిస్తే 36 శాతం వృద్ధి సాధించింది. జాతీయ విపత్తు సహాయక నిధి కోసం గతంలో కేటాయించిన రూ. 737 కోట్లు రీఫండ్ కావడం.. తాజాగా లాభాల వృద్ధికి కారణమైందని సంస్థ వెల్లడించింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ ఆదాయం రూ. 8,913 కోట్ల నుంచి రూ. 8,186 కోట్లకు తగ్గింది. హరిద్వార్‌లోని ప్లాంటుపై సెస్సుకు సంబంధించి జాతీయ విపత్తు సహాయక నిధికి నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించాలన్న ఆదేశాలను సుప్రీం కోర్టులో సవాల్ చేయగా, తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని, దీంతో రీఫండ్‌గా వస్తున్న ఆ మొత్తాన్ని ఆర్థిక ఫలితాల్లో ప్రత్యేక అంశంగా పేర్కొనడం జరిగిందని హీరో మోటోకార్ప్ తెలిపింది.





ఫలితాల నేపథ్యంలో మంగళవారం బీఎస్‌ఈలో హీరో మోటోకార్ప్ షేరు 6 శాతం క్షీణించి రూ. 2,259.35 వద్ద ముగిసింది.

## వెల్‌స్పన్ లాభం 17.49% అప్

**న్యూఢిల్లీ:** టెక్స్‌టైల్ సంస్థ వెల్‌స్పన్ ఇండియా నికర లాభం (కన్సాలిడేటెడ్) క్యూ1లో రూ.156 కోట్లుగా నమోదైంది. గతేడాది (2018–19) తొలి త్రైమాసికంలో రూ.132.83 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. ఏడాది ప్రాతిపదికన 17.49 శాతం వృద్ధిని సాధించింది. ఆదాయం 10 శాతం వృద్ధి చెంది రూ.1,736.29 కోట్లుగా నమోదైంది. గతేడాదిలో రూ.1,577.78 కోట్లుగా ఉంది.



## కొత్త ఫైనాన్స్ సెక్రటరీగా రాజీవ్ కుమార్



**న్యూఢిల్లీ:** ఆర్థిక సేవల కార్యదర్శిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న రాజీవ్ కుమార్ మంగళవారం కొత్త ఫైనాన్స్ సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని నియామక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (ఏసీసీ) ఈ నియామకానికి ఆమోదముద్ర వేసినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. కుమార్ 1984 జార్ఖండ్ కేడర్ ఐఏఎస్ అధికారి. కుమార్‌కు బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు, మూలధన కల్పన వంటి అంశాల్లో అపార అనుభవం ఉంది.

## ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్‌గా చక్రవర్తి



**ముంబై:** ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతాను చక్రవర్తి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు. ఆర్‌బీఐ మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై 29 నుంచీ అమల్లోకి వచ్చే ఈ నియామకం తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకూ అమల్లో ఉంటుంది. గార్గ్ స్థానంలో ఈ నియామకం జరిగింది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,750 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 34,050 | 0 |
| వెండి (కిలో) | 44,700 | ▲ 200 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,000 | ▲ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,330 | ▲ 90 |
| వెండి (కిలో) | 44,700 | ▲ 200 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,000 | ▲ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,330 | ▲ 90 |
| వెండి (కిలో) | 44,700 | ▲ 200 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,800 | ▼ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,200 | ▼ 60 |
| వెండి (కిలో) | 41,000 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,740 | ▼ 80 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,240 | ▼ 80 |
| వెండి (కిలో) | 42,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 36,030 | ▲ 90 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,330 | ▲ 90 |
| వెండి (కిలో) | 44,700 | – |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 57.41 (రాత్రి 11.30కు) | $56.87 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 64.22 (రాత్రి 11.30కు) | $63.71 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 31-07-2019

| | |
|---|---|
| విశాఖ | 350-00 |
| చిత్తూరు | 358-00 |
| వరంగల్ | 317-00 |
| చెన్నై | 365-00 |
| ముంబై | 368-00 |
| విజయవాడ | 324-00 |
| నమక్కల్ | 355-00 |
| గోదావరి | 319-00 |
| **30-07-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 314-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.74 |
| బెంగళూరు | 345-00 |
| కోల్‌కత్త | 357-00 |
| ఢిల్లీ | 305-₹+-00 |

# సన్నగిల్లిన వ్యాపార విశ్వాసం

### గ్రాంట్ థార్న్‌టన్ ఇంటర్నేషనల్ బిజినెస్ రిపోర్ట్‌లో వెల్లడి



**న్యూఢిల్లీ:** భారత్‌లో వ్యాపార విశ్వాసం మరింత క్షీణించింది. దేశ ఆర్థిక అభివృద్ధి వచ్చే 12 నెలల్లో ఎలా ఉండనుందనే అంశంపై గ్రాంట్ థార్న్‌టన్ నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇంటర్నేషనల్ బిజినెస్ రిపోర్ట్ పేరిట ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో కేవలం 64 శాతం కార్పొరేట్ కంపెనీలు మాత్రమే ఆశావాహంగా ఉన్నట్లు తేలింది. గతేడాది ఏప్రిల్– జూన్ కాలంలో 78 శాతం కంపెనీలు భవిష్యత్తు వృద్ధిపై విశ్వాసాన్ని వ్యక్తం చేశాయి. ఆదాయ అంచనాల పరంగా గతేడాది ద్వితీయార్థంలో నాల్గవ స్థానంలో ఉన్న భారత విశ్వాసం.. తాజాగా ఐదవ స్థానానికి దిగివచ్చింది. గతంలో ఆరు, మూడవ స్థానాల్లో ఉన్న విక్రయ ధర, లాభదాయకత అంచనాలు ఇప్పుడు ఎనిమిది, ఐదవ స్థానాలకు తగ్గాయి. ఇక అంతర్జాతీయంగా.. వ్యాపార నిబంధనలు, రెడ్ టేపిజంలో భారత్ మొదటి స్థానంలో ఉంది.

## జూన్ త్రైమాసికంలో వృద్ధి 5.7 శాతమే!: నోమురా





భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు జూన్ త్రైమాసికంలో కేవలం 5.7 శాతంగానే నమోదయ్యే అవకాశం ఉందని జపాన్ బ్రోకరేజ్ సంస్థ– నోమురా అంచనావేసింది. దేశంలో సేవలు, వినియోగ డిమాండ్ పరిస్థితులు మందగమనం, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలకు తన అంచనాకు కారణమని తాజా నివేదికలో పేర్కొంది. అయితే ఇంతకుమించి వృద్ధిరేటు ముున్ముందు పడిపోయే అవకాశం లేదనీ, అక్కడి నుంచి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని పేర్కొంది.

# నష్టాల్లోంచి లాభాల్లోకి.. యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

### గత క్యూ1లో రూ.389 కోట్ల నష్టాలు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో రూ.105 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో రూ.389 కోట్ల నికర నష్టాలు వచ్చాయని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. కోర్ ఆదాయం పెరగడం, మొండి బకాయిలు తగ్గడం వల్ల ఈ క్యూ1లో లాభాల బాట పట్టామని వివరించింది. మొత్తం ఆదాయం రూ.2,550 కోట్ల నుంచి రూ.3,003 కోట్లకు పెరిగిందని పేర్కొంది. వడ్డీ ఆదాయం రూ.2,155 కోట్ల నుంచి రూ.2,374 కోట్లకు పెరిగిందని, ఇతర ఆదాయం రూ.395 కోట్ల నుంచి రూ.629 కోట్లకు ఎగసిందని వివరించింది. నికర వడ్డీ ఆదాయం రూ.545 కోట్ల నుంచి రూ.727 కోట్లకు పెరిగిందని పేర్కొంది. నికర వడ్డీ మార్జిన్ 2.36 శాతం నుంచి 2.83 శాతానికి చేరిందని తెలిపింది.

**తగ్గిన మొండి బకాయిలు...**
బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ1లో 22.73 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 15.89 శాతానికి తగ్గాయని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. అలాగే నికర మొండి బకాయిలు 15.17 శాతం నుంచి 8.19 శాతానికి తగ్గాయని పేర్కొంది. విలువ పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.15,169 కోట్ల నుంచి రూ.11,640 కోట్లకు, నికర మొండి బకాయిలు రూ.9,233 కోట్ల నుంచి రూ.5,496 కోట్లకు తగ్గాయని పేర్కొంది. మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గాయని తెలిపింది. గత క్యూ1లో రూ.856 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ1లో 40 శాతం తగ్గి రూ.572 కోట్లకు చేరాయని వివరించింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 56.91 శాతం నుంచి 74.38 శాతానికి పెరిగిందని పేర్కొంది.



**10 శాతం రుణవృద్ధి..**
ఈ ఏడాది జూన్ నాటికి డిపాజిట్లు 3 శాతం వృద్ధితో రూ.1.32 లక్షల కోట్లకు, రుణాలు 10 శాతం పెరిగి రూ.73,249 కోట్లకు, మొత్తం వ్యాపారం 5 శాతం వృద్ధితో రూ.2.06 లక్షల కోట్లకు పెరిగాయని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. నష్టాల నుంచి లాభాల్లోకి రావడం, రుణ నాణ్యత మెరుగుపడటం వంటి సానుకూలాంశాల కారణంగా...

బీఎస్‌ఈలో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 1.6 శాతం లాభంతో రూ.9.68 వద్ద ముగిసింది.

# రుణ రేటును తగ్గించిన యూబీఐ

**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్ నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) మంగళవారం 20 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గించింది. దీని ప్రకారం...

- ఏడాది కాలపరిమితి రేటు 8.55 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గింది. రిటైల్, ఆటోమొబైల్, పర్సనల్ రుణాల వంటి వినియోగ రుణ వడ్డీరేటుకు ఏడాది ఎంసీఎల్ఆర్ ప్రామాణికం.
- ఓవర్‌నైట్, నెలవారీ రేటు 8.25 శాతం, 8.30 శాతం నుంచి 8.10 శాతానికి దిగివచ్చాయి.
- మూడు నెలలు, ఆరు నెలల రేట్లు కూడా 10 బేసిస్ పాయింట్లు తగ్గి 8.25 శాతం, 8.35 శాతాలకు తగ్గాయి.



- తగ్గించిన తాజా రేట్లు 2019 ఆగస్టు 1వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి.

## రతుల్ పురి రూ.254 కోట్ల ఆస్తులు జప్తు



**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్ పురికి చెందిన రూ.254 కోట్ల విలువైన ''బినామీ'' ఈక్విటీని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ జప్తు చేసింది. హెచ్ఈపీసీఎల్ అనే పేరుతో ఉన్న వేరొక గ్రూప్ కంపెనీ ఓవర్ ఇన్‌వాయిసింగ్ ద్వారా జరిగిన సోలార్ ప్యానల్ దిగుమతులకు సంబంధించి రతుల్ పురి ఈ పెట్టుబడులు పెట్టినట్లు ఐటీ శాఖ పేర్కొంది. హిందుస్తాన్ పవర్‌ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్‌గా ఉన్న రతుల్ పురి అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంతో సంబంధాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

## ప్రారంభమైన రియల్‌మీ 3ఐ అమ్మకాలు



**హైదరాబాద్:** స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ రియల్‌మీ '3ఐ' అమ్మకాలను మంగళవారం ప్రారంభించింది. ఫ్లిప్‌కార్ట్‌తోపాటు రియల్‌మీ ఆన్‌లైన్ స్టోర్‌లో ఇది లభిస్తుంది. 13 ఎంపీ, 2 ఎంపీ రేర్ కెమెరాలు, 13 ఎంపీ సెల్ఫీ కెమెరా, 4,230 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.2 అంగుళాల హెడీ ప్లస్ డిస్‌ప్లేతో రూపొందింది. డైమండ్ బ్లాక్, డైమండ్ బ్లూ, డైమండ్ రెడ్ రంగుల్లో లభిస్తుంది. 3 జీబీ ర్యామ్, 32 జీబీ ఇంటర్నల్ మెమరీ వేరియంట్ ధర రూ.7,999 కాగా, 4జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమరీ రకం ధర రూ.9,999 ఉంది. సేల్‌లో భాగంగా కస్టమర్లు పలు ఆఫర్లను అందుకోవచ్చు.

# రోల్స్ రాయిస్‌పై సీబీఐ కేసు





**న్యూఢిల్లీ:** అవినీతి ఆరోపణలపై బ్రిటన్ దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ మీద సీబీఐ కేసు నమోదు చేసింది. నవరత్న హోదా గల హెచ్ఏఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థల కాంట్రాక్టులు దక్కించుకునే క్రమంలో రోల్స్ రాయిస్ నిబంధనలకు విరుద్ధంగా ఓ ఏజెంటు సర్వీసులు వినియోగించుకున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. 2000 నుంచి 2013 మధ్య కాలంలో హెచ్ఏఎల్ నుంచి కంపెనీకి రూ. 4,736 కోట్ల కాంట్రాక్టులు రోల్స్ రాయిస్ దక్కించుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే గెయిల్, ఓఎన్‌జీసీలకు కూడా విడిభాగాలు సరఫరా చేసే కాంట్రాక్టులు కూడా దక్కించుకుంది. ఒప్పందాల ప్రకారం ఏజంట్ల సేవలు వినియోగించుకోవడం నిషిద్ధమే అయినప్పటికీ రోల్స్ రాయిస్ మాత్రం నిబంధనలు ఉల్లంఘించిందని సీబీఐ పేర్కొంది. దాదాపు అయిదేళ్ల ప్రాథమిక విచారణ అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.

## ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 373.45 | 373.85 |
| ASIAN PAINT | 1508.75 | 1513.25 |
| AXIS BANK | 707.6 | 720.25 |
| BAJAJ AUTO | 2463.85 | 2487.65 |
| BAJAJ FINSE | 7078.05 | 7120.85 |
| BAJAJ FINAN | 3249.95 | 3252.65 |
| BHARTI AIRTEL | 345.75 | 334.55 |
| BPCL | 335.5 | 342.2 |
| BRITANNIA | 2617.05 | 2672.3 |
| CIPLA LTD | 520 | 522.25 |
| COAL INDIA | 199.55 | 205.4 |
| EICHER MOTO | 16163.55 | 16388.1 |
| GAIL (INDIA) | 129.15 | 131.4 |
| GRASIM INDU | 762.55 | 795.65 |
| HCL TECHNOL | 1023.6 | 1015.45 |
| HDFC LTD | 2127.25 | 2149 |
| HDFC BANK L | 2252.25 | 2244.3 |
| HERO MOTOCO | 2258.8 | 2404.55 |
| HINDALCO | 190.1 | 193.25 |
| HUL | 1719.9 | 1713.3 |
| INDIABULLS | 523.9 | 559.7 |
| ICICI BANK | 425.35 | 429.35 |
| INDUSIND BA | 1337.3 | 1432.3 |
| BHARTI INFR | 249.55 | 256.5 |
| INFOSYS LIM | 792.7 | 791.45 |
| INDIAN OIL | 133.5 | 138.25 |
| ITC LTD | 268.9 | 267.75 |
| JSW STEEL | 230.25 | 241.4 |
| KOTAK MAHIN | 1498.7 | 1502.5 |
| LARSEN & T | 1376.35 | 1371.5 |
| MAHINDRA &M | 548.75 | 553.15 |
| MARUTI SUZU | 5507.15 | 5561.25 |
| NTPC LTD | 127.2 | 127.3 |
| ONGC | 138.75 | 140.35 |
| POWER GRID | 208.25 | 207.9 |
| RIL | 1180.9 | 1210.95 |
| SBI | 327.55 | 343.8 |
| SUN PHARMA | 410.35 | 431.05 |
| TATA MOTORS | 133.45 | 137.55 |
| TATA STEEL | 415.05 | 433.45 |
| TCS | 2179.15 | 2130 |
| TECH MAHIND | 640.25 | 646.3 |
| TITAN COMPA | 1079.2 | 1078.9 |
| ULTRATECH | 4317.55 | 4368.95 |
| UPL LIMITED | 573.7 | 584.55 |
| VEDANTA LIM | 150.6 | 155.65 |
| WIPRO LTD | 262.3 | 262.4 |
| YES BANK LI | 86.05 | 94.75 |
| ZEE ENTERTA | 381.1 | 387.15 |

## నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1358.3 | 1394.55 |
| ACC LIMITED | 1540.9 | 1535.7 |
| AMBUJA CEME | 202.1 | 205.15 |
| ASHOK LEYLA | 68.55 | 71.65 |
| BAJAJ HOLDI | 3562.9 | 3414.2 |
| BANDHAN BAN | 480.7 | 492.25 |
| BANK OF BAR | 102.65 | 109 |
| BHEL | 57.75 | 59.25 |
| BIOCON LIMI | 234.1 | 237.05 |
| BOSCH LIMIT | 14281 | 14815.95 |
| CADILA HEAL | 220.05 | 227.3 |
| COLGATE PAL | 1168.75 | 1163.3 |
| CONTAINER C | 513.15 | 515.5 |
| DABUR INDIA | 422.95 | 427.9 |
| DLF LIMITED | 177.75 | 179.45 |
| AVENUE SUPE | 1459.7 | 1449.9 |
| GENERAL INS | 199.05 | 204 |
| GODREJ CONS | 598.4 | 613.25 |
| HAVELLS IND | 636.35 | 665.35 |
| HDFC AMC LI | 2135.2 | 2174.6 |
| HDFC LIFE I | 483.1 | 485.35 |
| HINDUSTAN P | 258.3 | 268.9 |
| HINDUSTAN Zinc | 214.1 | 215.75 |
| ICICI LOMBA | 1157.25 | 1174 |
| ICICI PRU L | 398 | 399.3 |
| VODAFONE ID | 6.5 | 6.75 |
| INTERGLOBE | 1544.55 | 1579.95 |
| L&T FINANCE | 97.65 | 101.15 |
| LUPIN LIMIT | 752.6 | 762.25 |
| MARICO LIMI | 362.75 | 365 |
| UNITED SPIR | 568.8 | 587 |
| MOTHERSON S | 103.6 | 107.95 |
| MRF LTD | 53778.5 | 53785.3 |
| NHPC LTD | 22.25 | 22.45 |
| THE NEW IND | 114 | 119.4 |
| NMDC LTD. | 107.3 | 109.45 |
| ORACLE FIN | 3306.85 | 3320.6 |
| PAGE INDUST | 18051.35 | 18599.05 |
| PIRAMAL ENT | 1788.15 | 1790.05 |
| PETRONET LN | 233.2 | 236.1 |
| P&G HYGIENE | 10704.35 | 10702 |
| PIDILITE IN | 1228.7 | 1240.7 |
| STEEL AUTHO | 41.6 | 44.2 |
| SBI LIFE IN | 797.4 | 797.35 |
| SHREE CEMEN | 20768.7 | 21095.45 |
| SIEMENS LTD | 1154.85 | 1167.75 |
| SHRIRAM TRA | 969 | 967.45 |
| UNITED BREW | 1400.25 | 1421.45 |

## ఆంధ్ర సిమెంట్స్ నష్టం రూ.36.94 కోట్లు





**న్యూఢిల్లీ:** ఆంధ్ర సిమెంట్స్ నికర నష్టం ఏడాది ప్రాతిపదికన మరింత పెరిగింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.36.94 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గతేడాది క్యూ1లో కంపెనీ నికర నష్టం రూ.31.34 కోట్లు. ఇక అంతక్రితం ఏడాదిలో రూ.93.24 కోట్లుగా ఉన్న ఆదాయం.. తాజా క్వార్టర్‌లో 55.80 శాతం క్షీణించి రూ.41.21 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయం 37.23 శాతం తగ్గింది. రూ.124.74 కోట్ల నుంచి రూ.78.29 కోట్లకు తగ్గింది. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు మంగళవారం బీఎస్‌ఈలో 4.98 శాతం తగ్గి రూ.2.67 వద్ద ముగిసింది.

## గ్రాన్యూల్స్ లాభం 61 శాతం జంప్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో గ్రాన్యూల్స్ ఇండియా నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 61 శాతం అధికమై రూ.83 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.453 కోట్ల నుంచి రూ.595 కోట్లకు ఎగసింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 25 పైసల తొలి మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించింది.

## పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ లాభం రూ.461 కోట్లు





**న్యూఢిల్లీ:** పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభం (కన్సాలిడేటెడ్) జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.461 కోట్లుగా నమోదైంది. గతేడాది (2018–19) క్యూ1లో రూ.382 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించగా.. ఏడాది ప్రాతిపదికన 21 శాతం వృద్ధిని సాధించింది. నికర విక్రయాలు కూడా 21 శాతం వృద్ధి చెందాయి. తాజా క్వార్టర్‌లో అమ్మకాలు రూ.3,506 కోట్లుగా నమోదుకాగా, ఇవి గతేడాది క్యూ1లో రూ.2,902 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ద్రవ్య లభ్యత సమస్య కొనసాగుతూ, అన్ని రంగాలు నెమ్మదించినప్పటికీ.. గడిచిన 16 త్రైమాసికాలుగా తమ సంస్థ మాత్రం 20 శాతం వృద్ధిని నమోదుచేస్తూనే ఉందని ఆ సంస్థ చైర్మన్ అజయ్ పిరమల్ అన్నారు. ఆర్థిక సేవల వ్యాపారంలోకి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8,000–10,000 కోట్ల ఈక్విటీని తీసుకురానున్నట్లు వెల్లడించారు.

## పీఎన్‌బీ హౌసింగ్ ఆదాయం రూ.2,233 కోట్లు

- 11 శాతం వృద్ధితో రూ.285 కోట్లకు నికర లాభం
- రూ.2,000 కోట్ల నిధుల సమీకరణ

**న్యూఢిల్లీ:** పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 11 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.256 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.285 కోట్లకు పెరిగిందని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1,648 కోట్ల నుంచి రూ.2,233 కోట్లకు పెరిగిందని కంపెనీ ఎమ్‌డీ సంజయ గుప్తా తెలిపారు. నికర వడ్డీ ఆదాయం రూ.433 కోట్ల నుంచి 45 శాతం వృద్ధితో రూ.626 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నికర వడ్డీ మార్జిన్ 2.74 శాతం నుంచి 3.14 శాతానికి పెరిగిందని వెల్లడించారు. దేశంలో ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నా, మంచి వృద్ధి సాధించామని సంతృప్తి వ్యక్తం చేశారు.

**రూ.88,333 కోట్లకు నిర్వహణ ఆస్తులు.....**
గత క్యూ1లో 0.43 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 0.85 శాతానికి పెరిగాయని సంజయ గుప్తా తెలిపారు. అలాగే నికర మొండి బకాయిలు 0.33 శాతం నుంచి 0.67 శాతానికి చేరాయని పేర్కొన్నారు. ఇక కేటాయింపులు 0.74 శాతం నుంచి 0.99 శాతానికి పెరిగాయని వెల్లడించారు. గత క్యూ1లో రూ.9,767 కోట్లుగా ఉన్న రుణ మంజూరీలు ఈ క్యూ1లో రూ.7,634 కోట్లకు తగ్గాయని తెలిపారు. నిర్వహణ ఆస్తులు రూ.68,578 కోట్ల నుంచి రూ.88,333 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 కోట్ల నిధుల సమీకరణకు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.





ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్‌ఈలో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ షేర్ 3 శాతం లాభంతో రూ.721 వద్ద ముగిసింది.

# షాపర్స్ స్టాప్‌కు రూ. 10 లక్షల నష్టాలు

- రూ.856 కోట్లకు మొత్తం ఆదాయం
- మందగమన ప్రభావం

**న్యూఢిల్లీ:** రిటైల్ చెయిన్ షాపర్స్ స్టాప్ కంపెనీకి తొలి త్రైమాసికంలో రూ.10 లక్షల నికర నష్టాలు వచ్చాయి. గత క్యూ1లో రూ. 4.73 కోట్ల నికర లాభం వచ్చిందని షాపర్స్ స్టాప్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.858 కోట్ల నుంచి రూ.856 కోట్లకు తగ్గిందని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ రాజీవ్ సూరి పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి మందగించిందని, ఈ మందగమనం రిటైల్, తయారీ రంగాలపై తీవ్ర ప్రభావం చూపించిందని వివరించారు. అయినప్పటికీ, అమ్మకాలు తమ అంచనాలకనుగుణంగానే 5 శాతం మేర వృద్ధి సాధించాయని వివరించారు. రానున్న సీజన్ నుంచి అమ్మకాలు పుంజుకోగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ కంపెనీ 40 నగరాల్లో 83 డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను నిర్వహిస్తోంది.





ఆర్థిక ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండటంతో బీఎస్‌ఈలో షాపర్స్ స్టాప్ షేర్ 3.1 శాతం నష్టంతో రూ.375 వద్ద ముగిసింది.

# బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఎంటీఎన్‌ఎల్ విలీనం?

- ప్రతిపాదనపై డీవోటీ కసరత్తు
- రెండు సంస్థలను గట్టెక్కించేందుకు ప్రయత్నాలు

**న్యూఢిల్లీ:** ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్ సంస్థలను గట్టెక్కించే చర్యలపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఎంటీఎన్‌ఎల్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. టెలికం విభాగం (డాట్) కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు సంస్థల పునరుద్ధరణ ప్రణాళికల్లో విలీనం అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు వివరించాయి. 'ఎంటీఎన్‌ఎల్ తన కాళ్ళ మీద తాను నిలబడే పరిస్థితి లేదని స్పష్టం తెలుస్తోంది. కాబట్టి పునరుద్ధరణ ప్రణాళికల్లో విలీన అంశం కూడా చేర్చారు. దీని మీద క్యాబినెట్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. భారీ నష్టాలతో కుంగుతున్న మహానగర్ టెలిఫోన్ నిగమ్ (ఎంటీఎన్‌ఎల్), భారత్ సంచార్ నిగమ్ (బీఎస్‌ఎన్‌ఎల్) ఇటీవలి కాలంలో సిబ్బందికి సకాలంలో జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితికి దిగజారిన సంగతి తెలిసిందే. దీంతో స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) అసెట్ల విక్రయం, 4జీ స్పెక్ట్రం కేటాయింపు వంటి అంశాలతో ఎంటీఎన్‌ఎల్, బీఎస్‌ఎన్‌ఎల్ పునరుద్ధరణ ప్రణాళికను డీవోటీ రూపొందిస్తోంది.





**నష్టాలతో కుదేలు..**
ఆదాయాలు గణనీయంగా పడిపోవడంతో 2018–19లో బీఎస్‌ఎన్‌ఎల్ నష్టం రూ. 14,000 కోట్ల మేర ఉంటుందని అంచనా. కంపెనీలో 1,65,179 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. సంస్థ మొత్తం ఆదాయంలో ఏకంగా 75 శాతం వాటా సిబ్బందిపై వ్యయాలకే పోతోంది. దీనితో పోలిస్తే ప్రైవేట్ రంగంలోని ఎయిర్‌టెల్‌లో 20,000 మంది ఉద్యోగులే ఉన్నారు. కంపెనీ ఆదాయంలో వీరిపై వ్యయాలు 2.95 శాతం మాత్రమే ఉన్నాయి.





# ఎడ్లబండిలో వాగు దాటి...

- ఏజెన్సీలో ఓ గర్భిణి నరకయాతన
- మార్గమధ్యలో ఆటోలో ప్రసవం

**బెజ్జూర్ (సిర్పూర్):** పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి ఆసుపత్రికి వెళ్లేందుకు నరకయాతన అనుభవించింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండలంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని సోమిని గ్రామానికి చెందిన కోండ్ర శంకరమ్మ సోమవారం రాత్రి నుంచే పురిటి నొప్పులతో బాధపడుతోంది. గ్రామం నుంచి మండల కేంద్రానికి మధ్యలోని సుశ్మీర గ్రామ సమీపంలో ఒర్రె (వాగు) ఉప్పొంగడంతో ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గ్రామస్తుల సహకారంతో ఎడ్లబండిలో శంకరమ్మను వాగు దాటించారు. అక్కడి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకొస్తుండగా ఆటోలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

- మెడికల్ సీట్ల విషయంలో పలు ఆరోపణలు
- జీవో 550ను సక్రమంగా అమలు చేయట్లేదని విమర్శలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదుల వెల్లువ
- అవన్నీ అవాస్తవాలంటున్న ఆరోగ్య విశ్వవిద్యాలయం

**సాక్షి, హైదరాబాద్:** ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు జరిగిన కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కువ మార్కులు వచ్చిన ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులను జనరల్ కోటాలో లెక్కించాల్సింది పోయి రిజర్వేషన్ల కిందకు తీసుకొచ్చారని, దీంతో అనేక రిజర్వేషన్ సీట్లు కోల్పోవాల్సి వచ్చిందంటూ విమర్శలు వస్తున్నాయి. ఇది రిజర్వేషన్ల స్ఫూర్తికే విరుద్ధమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనరల్ కోటాలో సీట్లు వచ్చే అవకాశమున్న రిజర్వేషన్ విద్యార్థులను రిజర్వేషన్ల ద్వారా భర్తీ చేయకూడదంటూ 550 ప్రభుత్వ ఉత్తర్వు ఉన్నప్పటికీ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పెడచెవిన పెట్టిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు ఫిర్యాదులు అం దాయి. అలాగే ఓపెన్ కాంపిటీషన్‌లో సీటు సాధించిన రిజర్వేషన్ విద్యార్థి కాలేజీ ఆప్షన్ మార్చుకొని మరో కాలేజీకి వెళ్తే.. అటువంటి సీటును అదే కేటగిరీకి చెందిన వారికి ఇవ్వాలని కూడా ఉత్తర్వులో ఉందని అంటున్నారు.






**ఆర్.కృష్ణయ్య ఫిర్యాదు..**

ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంత్రి ఈటలకు ఫిర్యాదు చేశారు. గత 19 ఏళ్లుగా ఆ ఉత్తర్వు ప్రకారమే మెడిసిన్, ఇంజనీరింగ్, పీజీ అడ్మిషన్లు జరిపారని ఆయన అన్నారు. గతేడాది ప్రభుత్వం అమలు చేయకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లగా 550 జీవో ప్రకారమే అడ్మిషన్లు జరపాలని తీర్పు చెప్పిందన్నారు. కానీ ప్రస్తుత వర్సిటీ అధికారులు మాత్రం జీవోను అమలు చేస్తున్నట్లు నటిస్తూ తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వర్సిటీ అధికారుల అవగాహన లోపం వల్లనో లేక ఉద్దేశపూర్వకంగానో ఓపెన్ కేటగిరీలో వచ్చిన రిజర్వేషన్ విద్యార్థులను రిజర్వేషన్లలో చూపించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 262 ఎంబీబీఎస్ సీట్లు రాకుండా పోయాయన్నారు.

**ఆ తర్వాతే లెక్కించాలి..**

'మెడికల్ కౌన్సెలింగ్‌లో ఓపెన్ కాంపిటీషన్ లాస్ట్ కటాఫ్ మార్కు 509 (చివరి ర్యాంకు 43,868). అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల రిజర్వేషన్లను లాస్ట్ కటాఫ్ మార్కుల తర్వాతే లెక్కించాలి. రిజర్వేషన్ కేటగిరీ కింద వచ్చే ఆ వర్గాల విద్యార్థుల మార్కులు 509 మార్కుల కిందనే ఉండాలి. 509 మార్కుల కంటే ఎక్కువ వచ్చిన ఆయా వర్గాలను ఓపెన్ కాంపిటీషన్ కింద లెక్కించాలి. 509 మార్కుల కంటే తక్కువ మార్కులు వచ్చిన వారిలో బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు లెక్కించాలి. వెబ్‌సైట్ ద్వారా చూసినప్పుడు 262 సీట్లు ఆయా వర్గాలకు దక్కకుండా పోయాయి'అని కృష్ణ య్య పేర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఓపెన్ కాంపిటీషన్ విద్యార్థులతో సమాన మార్కులు ఉన్నవారిని కూడా రిజర్వేషన్ల కింద లెక్కించారని ఆరోపిస్తున్నారు.

**అందుకే ఆపేశారు..**

గత 19 ఏళ్లుగా తొలి విడత కౌన్సెలింగ్‌లో వివిధ కళాశాలల్లో ఉండే మొత్తం సీట్లకు ఎంపిక జరిగేది. రెండో విడత కౌన్సెలింగ్ కేవలం నాన్ జాయిన్ సీట్లకే జరుగుతుండేదని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది కాళోజీ వర్సిటీ అధికారులు మెరిట్‌లో వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఏ కళాశాలలో చేరారో తెలుసుకొని ఒకవేళ వారు జాయిన్ కాకుండా ఉంటే అలాంటి వారిని గుర్తించడానికి వీలుగా ఉంటుందని చెప్పారు. మొదటి దశ కౌన్సెలింగ్ రెండో రౌండ్ వరకు నిర్వహించి ఆపేశారని, మూడో రౌండ్ పూర్తి చేయలేదు. ఈ ఆరోపణలపై వర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి స్పందిస్తూ.. 550 జీవో ప్రకారం రిజర్వేషన్ల అమలులో ఎటువంటి పొరపాటు జరగలేదని స్పష్టం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## మెరిసిన 'ఎర్ర బంగారం'

**క్వింటాల్ ధర రూ.14,200**

**ఖమ్మం వ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చి ధర రికార్డు స్థాయిలో క్వింటాలు రూ.14,200 పలికింది. ఈ నెల ఆరంభం నుంచి తేజా రకం మిర్చి రూ.13 వేలు పలుకగా, క్రమంగా ఆ ధర పెరుగుతూ వచ్చింది. గత శుక్రవారం గరిష్టంగా రూ.13,500 పలికింది. శని, ఆది, సోమ వారాలు సెలవు దినాలు కావడం.. మంగళవారం మార్కెట్‌లో ఒక్కసారిగా మిర్చికి ఉలిక్కిపడే ధర పలికింది. క్వింటాలుకు దాదాపు రూ.700 ధర పెరిగి రూ.14,200లకు చేరుకుంది. ఈ ధర మరికొంత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.

# సోనీ కిడ్నాప్ కథ సుఖాంతం

- సురక్షితంగా హైదరాబాద్‌కు యువతి
- పోలీసుల అదుపులో నిందితుడు రవిశేఖర్?

**హైదరాబాద్:** యువతి కిడ్నాప్ కథ ఎట్టకేలకు సుఖాంతం అయ్యింది. వారం క్రితం కిడ్నాపునకు గురైన బీ ఫార్మసీ విద్యార్థిని సోనీ సురక్షితంగా నగరానికి చేరడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ నెల 23న రాత్రి యువతి అపహరణకు గురైనప్పటి నుంచి పలు మలుపులు తిరుగుతూ వచ్చిన కిడ్నాప్ కథ మంగళవారం ఉదయం సోనీ నగరానికి వచ్చిందని తెలియడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని బొంగుళూరు గేటు వద్ద టీ స్టాల్ నడుపుకునే ఎలిమినేటి యాదగిరి కూతురు సోనీ(22)కి ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపి 23న రవిశేఖర్ కారులో ఎక్కించుకుని హయత్‌నగర్ వరకు తీసుకొచ్చి రాత్రి 8:30 గంటల సమయంలో కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పటి నుంచి నిందితుని కోసం గాలిస్తున్నారు. నిందితుడు వాడిన కారు నంబర్ నకిలీదని తెలిసి కంగుతిన్నారు. అతని ఆచూకీ కోసం ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఐదు ప్రత్యేక బృందాలు వేట సాగిస్తున్నాయి. 3 రోజులు గడిచినా ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో పోలీసులు, కుటుంబ సభ్యుల్లో ఆందోళన పెరిగింది. చివరకు నిందితుడిని రవిశేఖర్‌గా గుర్తించిన పోలీసులు అతను ఆ కారును బళ్లారి నుంచి దొంగిలించినట్లుగా కనుగొన్నారు. నిందితుడు చోరీలు, దొంగతనాలు, దారి దోపిడీలు చేసేవాడని అతనిపై తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ పలు కేసులు ఉన్నాయని తెలిసింది. విజయవాడలోని ఓ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రవిశంకర్ ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడని కథనాలు వచ్చాయి. దీంతో ఈ కేసు మరింత జఠిలంగా మారింది. రోజులు గడుస్తున్నా నిందితుడు చిక్కకపోవడంతో పోలీసులు అతని ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమతిని ప్రకటించారు. ఏం జరిగిందో ఏమో కానీ మంగళవారం ఉదయం సోనీ నగరానికి చేరుకుంది.


నిందితుడు శేఖర్

**మీడియా కంట పడకుండా...**

ఎంజీబీఎస్‌లో బస్సు దిగిన వెంటనే సోనీ తల్లిదండ్రులకు ఫోన్ చేయగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సోనీని సరూర్‌నగర్ మహిళా పోలీస్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి ఎల్‌బీనగర్ సీసీఎస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. మంగళవారం మొత్తం సోనీ మీడియా కంట పడకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. రవిశేఖర్ పోలీసుల అదుపులో ఉన్నాడని ప్రచారం జరుగుతున్నా అధికారులు మాత్రం ధ్రువీకరించడంలేదు. ఈ ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాచకొండ పోలీసులు సోనీని, రవిశేఖర్‌ను విచారిస్తున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షల కోసం సోనీని పేట్లబురుజులోని మెటర్నిటీ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఆమెపై అఘాయిత్యం జరిగిందా అన్న కోణంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగమణి నేతృత్వంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అమృత తెలిపారు.

**ఒంగోలులో అరెస్టు..**

రవిశేఖర్‌ను ఏపీ పోలీసులు ఒంగోలులో అరెస్ట్ చేసి ఇక్కడి పోలీసులకు అప్పగించగా సరూర్‌నగర్ స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుడి నేర చరిత్ర, అతనిపై ఉన్న కేసుల గురించి ఆరా తీస్తున్నారు. డబ్బు ఆశ చూపి యువతులను కిడ్నాప్ చేసేవాడని, ఏపీలోని పలుచోట్ల మహిళలను ట్రాప్ చేసినట్లు కేసులున్నాయని సమాచారం. బళ్లారిలో దొంగిలించిన కారుకు జీపీఆర్ఎస్ ఉన్నట్లు తెలిసింది. దాని ఆధారంగా పోలీసులు కారు కదలికలను కనుగొన్నారని కర్నూలు, తిరుపతిలో అతని కదలికలు గుర్తించగా త్రుటిలో తప్పించుకున్నాడని చివరికి అద్దంకి, ఒంగోలులో పట్టుకున్నట్లు సమాచారం.

## బోధనాసుపత్రుల బంద్ నేడు

**ఎన్‌ఎంసీకి వ్యతిరేకంగా జూడాల నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ మెడికల్ బిల్లు (ఎన్‌ఎంసీ)–2019కి వ్యతిరేకంగా తెలంగాణ జూనియర్ డాక్టర్లు (జూడా) ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నారు. బుధవారం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 వరకు 24 గంటలపాటు బంద్ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఆయా బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు ఇబ్బందులు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌ను వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అంతర్గత ఉత్తర్వులు జారీచేశారు. జాతీయ మెడికల్ బిల్లు వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని జూడాలు పేర్కొంటున్న విషయం విదితమే. దీనిపై ఢిల్లీలో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లోనూ జూడాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిగిలిన 67 ఎంబీబీఎస్ సీట్లు

- జాతీయ కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ కాని రాష్ట్ర సీట్లు
- వాటిని తిరిగి తెలంగాణకు కేటాయించిన కేంద్రం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల నుంచి నేషనల్ పూల్‌కి ఇచ్చిన 15 శాతం కోటా ఎంబీబీఎస్ సీట్లలో కొన్ని మిగిలిపోయాయి. దీంతో వాటిని తిరిగి రాష్ట్రానికి కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రంలో మెడికల్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులకు కీలకమైన ప్రభుత్వ సీట్లు దక్కనున్నాయి. నేషనల్ పూల్‌కు రాష్ట్రం నుంచి 225 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా, ఇటీవల జాతీయ స్థాయిలో వాటికి 2 కౌన్సెలింగ్‌లు నిర్వహించారు. వాటిలో 158 సీట్లే భర్తీ అయ్యాయి. దీంతో 67 సీట్లు మిగిలినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. జాతీయ స్థాయిలో రెండు దశల కౌన్సెలింగ్ నిర్వహించాక మిగిలిపోయే సీట్లను ఆయా రాష్ట్రాలకు తిరిగి కేటాయించాలన్న నిబంధన ఉంది. ఆ ప్రకారంమిగిలిన సీట్లను కేంద్రం తెలంగాణకు కేటాయించింది. దీంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించే మూడో విడత కౌన్సెలింగ్‌లో మరికొందరికి ఈ సీట్లు కేటాయించొచ్చు. కన్వీనర్ కోటా సీట్లకు రాష్ట్రంలో మూడో విడత కౌన్సెలింగ్ వచ్చే నెల 1న ప్రారంభం కానుంది.

**కొన్ని కాలేజీలపై అనాసక్తి..**

నీట్ టాప్ ర్యాంకర్లు దేశంలో ఉండే ప్రముఖమైన మెడికల్ కాలేజీల్లో సీట్ల కోసం పోటీ పడతారు. అంటే జాతీయ స్థాయి కౌన్సెలింగ్‌ల్లో ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన 15 శాతం నేషనల్ పూల్ సీట్లకు పోటీ పడతారు. ఆ ప్రకారం తెలంగాణకు చెందిన 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకూ జాతీయస్థాయిలో టాప్ ర్యాంకులు పొందిన వారు కూడా పోటీ పడుతారు. రాష్ట్రానికి చెందిన జాతీయ టాపర్లు గాంధీ, ఉస్మానియా, కాకతీయ వంటి ప్రముఖమైన కాలేజీలలో చేరి ఉండొచ్చని అంచనా. మిగిలిన 67 సీట్లు పెద్దగా పేరులేని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందినవే ఉంటాయని అంటున్నారు. ఏ ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన సీట్లు మిగిలాయన్న వివరాల జాబితా ఇంకా తమకు రాలేదని విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ సీట్లకు తోడు అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్) సీట్లకు కూడా మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈడబ్ల్యూఎస్‌లో 190 ఎంబీబీఎస్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.








మంగళవారం అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాకు చీరను బహూకరిస్తున్న ఉద్యోగినులు

# కేథరిన్ హడ్డాకు చీర బహూకరణ

**వీడ్కోలు పలికిన తోటి ఉద్యోగినులు**

**సాక్షి, హైదరాబాద్:** యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాకు తోటి ఉద్యోగినులు వీడ్కోలు పలికారు. ఏపీ, తెలంగాణ, ఒడిశాకు చెందిన కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగినులు కేథరిన్‌కు చీరను బహూకరించారు. పలువురు జ్ఞాపికలను అందజేశారు. అలాగే కార్యాలయం ప్రవేశద్వారం వద్ద అమెరికన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, అమెరికా విదేశాంగ మంత్రితోపాటు గతంలో పనిచేసిన కాన్సుల్ జనరల్ ఫొటోల పక్కన కేథరిన్ ఫొటోను మంగళవారం తగిలించారు. ఈ విషయాన్ని కేథరిన్ ట్వీట్ ద్వారా తెలిపారు. త్వరలోనే కేథరిన్ యూఎస్ కాన్సుల్ జనరల్ బాధ్యతల నుంచి వైదొలగనున్న విషయం తెలిసిందే.

# బొగ్గు నిల్వల అన్వేషణకు సింగరేణికి అనుమతి

- కొత్తగూడెం అటవీ డివిజన్ పెంగడ్డప బ్లాక్‌లో..
- అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** కొత్తగూడెం అటవీ డివిజన్ పెంగడ్డప రిజర్వ్ ఫారెస్ట్‌లోని పెంగడ్డప బ్లాక్‌లో 2.31 చ.కి.మీ పరిధిలో బొగ్గు నిల్వల అన్వేషణ కోసం సింగరేణి కాలరీస్ సంస్థకు రాష్ట్రప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ బ్లాక్‌లోని 2.31 చ.కి.మీ పరిధిలో 4 ఇంచుల వ్యాసంలో 11 బోర్లు వేసేందుకు మెసెర్స్ ఎస్‌సీసీఎల్–ఫైనల్ (స్టేజ్–3)కి ఆమోదం తెలుపుతూ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా ఇందుకు ఉత్తర్వులిచ్చారు. కేంద్ర అటవీ, పర్యావరణ నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా తుది అనుమతినివ్వాల్సిందిగా తెలంగాణ పీసీసీఎఫ్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. నిర్ణీత ఫారం–సీలో సమర్పించిన ప్రతిపాదనలకు అనుగుణంగా బొగ్గు నిల్వల అన్వేషణ కోసం సింగరేణి సంస్థకు కొన్ని షరతులను విధించింది. జాతీయ పార్కులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, బయోస్పియర్ రిజర్వ్, టైగర్ రిజర్వ్‌లు, నోటిఫై చేసి వైల్డ్‌లైఫ్ కారిడార్లలో తవ్వకాలు చేపట్టరాదని, చెట్లు కొట్టడం వంటివి చేయరాదని, కేవలం తుప్పలు, కొమ్మలు వంటివి మాత్రమే కొట్టాలని సూచించింది. అటవీ ప్రాంతం లేదా చెట్లను కొట్టాల్సి వస్తే కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని పేర్కొంది. అటవీ భూమి బదలాయింపు కోసం యూజర్ ఏజెన్సీ దరఖాస్తు చేసుకోవాలని.. ఈ విషయంలో పీసీసీఎఫ్ తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792